ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 13.04.2026 | సంపుటి : 12 సంచిక : 264 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## అమెరికా-ఇరాన్ చర్చలు

# విఫలం



శాంతి చర్చలు విఫలం కావడానికి ఇరాన్ అణు ఆశయాలే ప్రధాన కారణం.ఇస్లామాబాద్ చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినా అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే ఒప్పందం కుదరలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వను. ప్రమాదకరమైన వ్యక్తుల చేతుల్లో అణుశక్తి ఉండటానికి అంగీకరించలేం. హర్మూజ్ జలసంధిని తెరుస్తామని మాటిచ్చిన ఇరాన్, ఉద్దేశపూర్వకంగానే ఆ మాట తప్పింది. ఇరాన్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించింది ఇకనైనా ఆ అంతర్జాతీయ జలమార్గాన్ని అత్యంత వేగంగా తెరవాలి. - ట్రంప్

### అర్ధాంతరంగా తిరిగి వెళ్లిన జేడీ వాన్స్ బృందం

### అమెరికా వల్లే చర్చలు విఫలం: ఇరాన్

- యుద్ధంతో సాధించలేనివన్నీ డిమాండ్ చేసింది
- అమెరికా తమ నమ్మకాన్ని పొందలేకపోయిందని వెల్లడి

ఇస్లామాబాద్(జనంసాక్షి):పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. అర్ధంతరంగా చర్చలను ముగించి జేడీ వాన్స్ బృందం వెనక్కి వెళ్లిపోయింది. అనేక గంటలు సుదీర్ఘంగా సాగిన ఈ చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా ఈ విషయాన్ని పేర్కొన్నారు. చర్చలు ముగిసిన అనంతరం వాన్స్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 21 గంటలు నిరంతాయంగా ఇరాన్‌తో తాము చర్చలు జరిపామన్నారు. అనేక కీలకమైన విషయాలపై చర్చించినట్లు వెల్లడించారు. అయితే, ఈ చర్చల్లో ఎలాంటి ఒప్పందానికి రాలేకపోయామని స్పష్టం చేశారు. మిగతా 2లో..



యుద్ధం ముగింపు విషయంలో మాకు సదుద్దేశం, సంకల్పం ఉన్నాయని స్పష్టంగా చెప్పాను. కానీ గత రెండు యుద్ధాల అనుభవం కారణంగా మాకు ప్రత్యర్థి పక్షంపై నమ్మకం లేదు. ఇప్పుడు మా నమ్మకాన్ని సంపాదించుకోగలదా లేదా అనే విషయంపై ఆ దేశం నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇది. ఇరాన్ ప్రజల హక్కుల సాధన కోసం సైనిక పోరాటంతో పాటు దౌత్యం కూడా మరొక మార్గమని మేం విశ్వసిస్తున్నాం. ఇరానీయులు 40 రోజుల పాటు చేసిన జాతీయ రక్షణ విజయాలను పటిష్ఠం చేసే మా ప్రయత్నాలను ఒక్క క్షణం కూడా వదులుకోం. - ఘాలిబఫ్, ఇరాన్ పార్లమెంటు స్పీకర్

# ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

### ప్రథమ సంవత్సరంలో 66.2 %, ద్వితీయ సంవత్సరంలో 70.58 శాతం ఉత్తీర్ణత

- మే 13 నుంచి 21 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- పరీక్షల టైం టేబుల్ విడుదల చేసిన ఇంటర్ బోర్డు




హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఈ ఫలితాలను విడుదల చేశారు. ప్రథమ ఇంటర్‌లో 66.2 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. ఈ ఫలితాల్లో ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మిగతా 2లో..

# త్వరలో ఆపరేషన్ హర్మూజ్

- మందుపాతరలను నిర్వీర్యం చేయండి
- అమెరికా నౌకదళానికి ట్రంప్ ఆదేశాలు
- జలసంధిని వెంటనే తెరవాలని ఇరాన్‌కు అల్టిమేటం
- అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఆ దేశం సిద్ధంగా లేదు
- అందువల్లే చర్చలు బెడిసికొట్టాయని వెల్లడి

వాషింగ్టన్(జనంసాక్షి):పాకిస్థాన్ వేదికగా ఇరాన్‌తో జరిగిన శాంతి చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే విఫలమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను అడ్డుకునేలా తక్షణమే సముద్ర దిగ్బంధనాన్ని ప్రారంభించాలని అమెరికా నౌకాదళాన్ని ఆదేశించారు. ఈ కీలక జలమార్గంపై వ్యూహాత్మక నియంత్రణ సాధించడం మిగతా 2లో..

నాడు మమ్మల్ని భయపెట్టిన వారే

# నేడు మనుగడ కోసం పోరాడుతున్నారు

- యుద్ధంలో ఇప్పటికే మేం చారిత్రాత్మక విజయాలు సాధించాం
- అమెరికా -ఇజ్రాయెల్ ఏకమై ఇరాన్‌కు ఊపిరాడనివ్వడం లేదు
- అయినా ఈ పోరాటం ఇంకా ముగిసిపోలేదు : నెతన్యాహు

వివరాలు 2వ పేజీలో..

# ఆశా భోంస్లే ఇకలేరు

### వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో కన్నుమూసిన ప్రముఖ గాయని



ముంబై(జనంసాక్షి): ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) కన్నుమూశారు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. 1933లో మహారాష్ట్రలోని సాంగ్లీలో ఆమె జన్మించారు. గాయనిగా ఎన్నో వేల పాటలతో శ్రోతలను అలరించారు. ఆమె సినీ ప్రస్థానం 1943లో మరాఠీ చిత్రం 'మజాబ్'తో ప్రారంభమైంది. అందులో 'చలా చలా నవ్ చలా' పాట పాడారు. 1948లో బాలీవుడ్ దర్శకుడు హంసరాజ్ బహల్ పిలుపుతో ముంబయి వెళ్లారు. 1954లో వచ్చిన 'బూట్ పాలిష్'లోని పాటలతో ఆశాకు మిగతా 2లో..

అమర్‌నాథ్ యాత్ర

# జులై 3 నుంచి..



న్యూఢిల్లీ(జనంసాక్షి):దక్షిణ కశ్మీర్‌లో 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు ఏటా వైభవంగా నిర్వహించే యాత్ర తేదీలు ఖరారయ్యాయి. జులై 3 నుంచి ఇది ప్రారంభం కానుంది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదివారం ఈ మేరకు ప్రకటించారు. 57 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర.. ఆగస్టు 28న ముగుస్తుందన్నారు. యాత్ర చేపట్టాలనుకునే భక్తులు ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్స్ చేసుకోవచ్చన్నారు. జమ్మూకశ్మీర్ బ్యాంకు, ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఎస్ బ్యాంకులకు దేశవ్యాప్తంగా ఉన్న 554 శాఖల్లో దరఖాస్తుదారులు ముందస్తు నమోదులు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇక బోర్డు నిబంధనల ప్రకారం.. పదమూడేళ్లలోపు వయసున్న పిల్లలను, 70 ఏళ్లకు పైబడిన వృద్ధులను ఈ యాత్రకు అనుమతించరు.

## మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక

- మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్

2లో..

### తెలంగాణలో అర్బన్ నక్సల్స్ అంటూ

# ఎవరూ లేరు!

సామాజిక భావజాలం కలిగి ఉన్నంత మాత్రాన అలా పిలవలేం..

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టీకరణ



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో అర్బన్ నక్సలైట్లు అంటూ ఎవరూ లేరని, అసలు ఈ విషయమే తన దృష్టికి రాలేదని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా, కేవలం భిన్నమైన రాజకీయ లేదా సామాజిక భావజాలం కలిగి ఉన్నంత మాత్రాన ఎవరినీ 'అర్బన్ నక్సలైట్లు' అని పిలవలేమని డీజీపీ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపు శూన్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసనలు తెలిపే వారిని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే వారిని వేధించే ఉద్దేశం పోలీస్ శాఖకు లేదని తెలిపారు. ఆపరేషన్ కగార్‌తో రాష్ట్రంలో ఐదుగురు మావోయిస్టులు మినహా మిగతా 2లో..



హుజూర్‌నగర్,కోదాడ నియోజకవర్గాల్లో ఎత్తిపోతలను

# త్వరగా పూర్తి చేయాలి


### ఖరీఫ్ నాటికి పూర్తికి తగిన చర్యలు తీసుకోవాలి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి):సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ఎత్తిపోతల పథకాలు ఖరీఫ్ 2026 నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో సూర్యాపేట జిల్లా నీటిపారుదల అధికారులతో మంత్రి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హుజర్నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని ఎత్తిపోతల పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మరియు జవహర్ జనపహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం వంటి ప్రధాన పథకాల స్థితిగతులను పరిశీలించారు.53,000 ఎకరాలకు సాగునీరు స్థిరీకరణ లక్ష్యంతో రూ. 1,642 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించారు.అలాగే రూ. 292 కోట్ల వ్యయంతో 10,000 ఎకరాలకు సాగునీరు అందించడానికి ఉద్దేశించిన జవహర్ జనపహాడ్ బ్రాంచ్ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పురోగతిపై కూడా వివరాలు తెలుసుకున్నారు.తన స్వస్థల నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో 2,041 ఎకరాలకు సాగునీరు అందించనున్న బెట్టే తండా ఎత్తిపోతల పథకంతో పాటు3,200 ఎకరాలకు సాగునీరు అందించనున్న నక్కగూడెం ఎత్తిపోతల మిగతా 2లో..

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో

# కమిటీ

### విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్(జనంసాక్షి):విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ వేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఆదివారం ఉదయం హైదరాబాదులోని ప్రజాభవన్ లో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు వారి సమస్యలపై డిప్యూటీ సీఎంతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విద్యుత్ డిస్కములను ప్రైవేటు పరం చేస్తారన్న ప్రచారం జరుగుతుందని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ డిస్కములను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరించమని ఈ విషయాన్ని నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని, అసత్య ప్రచారాలను ఖండించాలని సూచించారు. ఇంధన శాఖ దీర్ఘకాలం కొనసాగాలని అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉద్యోగుల జేఏసీ, అధికారులపై ఉందని తెలిపారు. 1912 కు వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కారం చేసి మెరుగైన సేవలకు విద్యుత్ సంస్థలు చిరునామాగా నిలవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఇతర అంశాలు విని పరిష్కరించేందుకు ఉద్యోగ సంఘాలకు ప్రతినెల ఒక గంట పాటు సమయం ఇచ్చేలా విద్యుత్ సంస్థల ఉన్నత అధికారులను ఆదేశిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. మూడవ డిస్కం ఏర్పాటు ఉద్యోగుల సర్దుబాటు, 2026 2004 వరకు నియామకమైన వారికి పాత పెన్షన్స్ స్కీమ్ మిగతా 2లో..

### బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా

# మార్చే ఆలోచన



### తప్పులు చేశాం

- ప్రజలకు నాయకులకు మధ్య దూరం పెరిగింది
- కేటీఆర్ ఆత్మవిమర్శ
- కాంగ్రెస్ పార్టీ అంతా అవినీతిమయమైంది
- బీజేపీ-కాంగ్రెస్ తోడు దొంగల మాదిరి కలిసి నడుస్తున్నాయి
- మంచిర్యాల క్యాతనపల్లిలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మంచిర్యాల(జనంసాక్షి): బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్పు చేసే అంశాన్ని పరిశీలిస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తమ కుపొత్తులతో కలిసిరాదని, కుదరదని వ్యాఖ్యానించారు. గతంలో తాము కొన్ని చిన్నచిన్న తప్పులు చేశామని తెలిపారు. అప్పుడు ప్రజలకు నాయకులకు మధ్య దూరం పెరిగిందని, గతంలో జరిగిన తప్పులపై అధ్యయనం చేశామని అన్నారు. లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. ఈసారి వచ్చేది బీఆర్ఎస్సేనని.. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. అన్ని పథకాల్లో కాంగ్రెస్ విఫలమైందన్నారు."చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్ముకున్నాయి. మబ్బులు తొలిగి చంద్రుడు మళ్లీ ఉజ్వలంగా ప్రకాశిస్తాడు. మిగతా 2లో..

ఐదేళ్లలోపు దగ్గుమందు

# వినియోగం వద్దు

- సిరప్‌ల నిషేధం
- ముసాయిదా నిబంధనలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):చిన్న పిల్లలకు వాడే దగ్గు మందులపై కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు మందుల్లో సిరప్‌లను ప్రిస్క్రిప్షన్‌లో రాయకుండా నిషేధం విధించాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతిపాదిస్తోంది. ఐదేళ్లలోపు పిల్లలకూ వాడకుండా నిరోధించే చర్యలు చేపట్టాలని యోచిస్తున్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ (ఐపీసీ) విడుదల చేసిన నేషనల్ ఫార్ములరీ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐ) 2026 ముసాయిదాలో భాగంగా ఈ చర్యలు చేపట్టే వీలుంది.గతేడాది నాసిరకం దగ్గుమందు సిరప్‌ల కారణంగా పలువురు మరణించిన, నేపథ్యంలో వీటిని ప్రిస్క్రైబ్ చేసే నిబంధనలను సవరించే అవకాశం ఉంది. రెండేళ్ల లోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులను సిరప్ రూపంలో ప్రిస్క్రైబ్ లేదా పంపిణీ మిగతా 9లో..

## ప్రాణం తీసిన ఈత సరదా

- నీట మునిగి ముగ్గురు బాలురు మృతి
- అల్లూరి సీతారామరాజు జిల్లా విషాదం..

2లో..

# తెలంగాణలో అర్బన్ నక్సల్స్ అంటూ ఎవరూ లేరు!

మిగిలిన వారంతా లొంగిపోయారన్నారు. మావోయిస్టు సానుభూతిపరులు ఉంటే ఉండవచ్చని అన్నారు. ఆ ఐదుగురు కూడా తెలంగాణకు చెందినవారైనా తెలంగాణలో లేరని, ఇతర రాష్ట్రాల్లో ఉన్నారని తెలిపారు. గణపతి ఎప్పుడు లొంగిపోతాడో తనకు తెలియదన్నారు. తెలంగాణ మావోయిస్టులు లేని రాష్ట్రంగా ఆవిర్భవించింది. రాష్ట్రంలో అర్బన్ నక్సలైట్లు ఉన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. తెలంగాణలో అర్బన్ నక్సలైట్లు లేరని, ఎవ్వరూ అనుమానించాల్సిన అవసరం లేదని చెప్పారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి..

4,89,123 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో ఉత్తీర్ణత శాతం 74.4 కాగా.. బాలురు ఉత్తీర్ణత శాతం 57.69గా ఉంది. ద్వితీయ ఇంటర్ పరీక్షలకు మొత్తంగా 5,07,948 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,58,490 మంది (70.34శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 78.65గా ఉండగా.. బాలుర ఉత్తీర్ణత 62.50 శాతంగా నమోదైంది.ప్రథమ ఇంటర్‌లో 66.20 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 66.94% మంది, ఒకేషనల్‌లో 59.30% మంది ఉత్తీర్ణత సాధించారు.ద్వితీయ ఇంటర్‌లో 75.34శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 75.61%, ఒకేషనల్‌లో 72.71%గా ఉంది.ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం బాగానే ఉంది. బీసీ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 86శాతం (జనరల్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 96శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో (జనరల్) 90శాతం నమోదు కాగా.. ఒకేషనల్‌లో 98శాతంగా ఉంది.కేజీబీవీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 72శాతం, ఒకేషనల్‌లో 86శాతం ఉత్తీర్ణత కాగా.. సెకండ్ ఇయర్‌లో 82శాతం, ఒకేషనల్‌లో 94శాతంగా ఉంది.ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో (జనరల్) 77శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 65శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో 71శాతం (రెగ్యులర్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 51శాతంగా ఉంది. సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం 77.66 కాగా.. ద్వితీయ ఇంటర్‌లో 86.79శాతంగా ఉంది. పెరిగిన ఉత్తీర్ణత శాతం.. గత ఐదేళ్ల లెక్కలు ఇలా..సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ని కూడా ఇంటర్ బోర్డు ప్రకటించింది. సప్లిమెంటరీ పరీక్షలను త్వరలోనే నిర్వహించనున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా వెల్లడించారు. ఉత్తీర్ణత కాని విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలుగా నెల రోజుల్లోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు అవకాశం ఇచ్చారు.మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయి. రెండు సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు.ఇంటర్ అడ్వాన్స్‌డ్ ప్రాక్టికల్ పరీక్షలు మే 22న ప్రారంభమవుతాయి. ఇవీ రెండు సెషన్లలో నిర్వహిస్తారు.

మే 13 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రథమ ఇంటర్‌లో 66.20శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైన విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారు రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలుగా త్వరగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఫలితాలు ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు టైం టేబుల్‌ని సైతం విడుదల చేసింది. రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. అలాగే, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 20 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది.మే 13 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు; మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు.మరోవైపు, మే 22 (శుక్రవారం) నుంచి మే 25 (సోమవారం) వరకు ప్రాక్టికల్ పరీక్షలను కూడా రెండు సెషన్లలో నిర్వహిస్తామని బోర్డు పేర్కొంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్; మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్ ఉంటుందని తెలిపింది. మే 26న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షతో పాటు ఎథిక్స్ అండ్ హ్యూమన్‌వాల్యూస్ పరీక్ష (అర్హులైన విద్యార్థులకు మాత్రమే) ఉంటుందని, 28న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నట్లు టైం టేబుల్‌లో పేర్కొంది.

## హుజూర్‌నగర్,కోదాడ నియోజకవర్గాల్లో ఎత్తిపోతలను త్వరగా పూర్తి చేయాలి

పథకం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.కోదాడ అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న లిఫ్ట్ పథకాలను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.4,460 ఎకరాలు సేద్యంలోకి రానున్నరెడ్లకుంట ఎత్తిపోతల పథకం 5,000 ఎకరాలకు సాగునీరు అందించనున్న రాజీవ్ శాంతినగర్ లోని రాజీవ్ ఎత్తిపోతల పథకంతో పాటు నాగార్జునసాగర్ ఎడమ కాలువపై నడిగూడెంలో3,500 ఎకరాలకు నిరందించేందుకు గాను చేపట్టిన ఆర్-9 లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ ఎత్తిపోతల పథకాలన్నింటికీ ట్రాన్స్‌కో అధికారులతో సమన్వయం చేసుకొని ట్రాన్స్‌ఫార్మర్ యార్డులు, విద్యుత్ సరఫరా సదుపాయాలు సమయానికి ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.జిల్లాలో కొత్తగా నిర్మిస్తున్న నీటిపారుదల కార్యాలయ భవనాల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేయాలని సూచించారు . హుజూర్‌నగర్‌లో రూ. 7.99 కోట్లతో ఒకటి, కోదాడలో రూ. 5.12 కోట్లతో మరొకటి నిర్మిస్తున్నమన్నారు.ఈ భవనాల రూపకల్పన మరియు నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని చీఫ్ ఇంజనీర్ నాగభూషణ్ రావును బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.సూర్యాపేట జిల్లా రైతులకు రాబోయే ఖరీఫ్ సీజన్ నుంచే నిరంతర సాగునీరు అందేలా అన్ని పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.ఈ సమావేశంలో ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు, ఓఎస్‌డీ ఇరిగేషన్ భీమ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు దగ్గుమందు వినియోగం వద్దు

చేయరాదని ప్రతిపాదిస్తున్నారు.అయిదేళ్లలోపు పిల్లలకు కూడా అత్యంత జాగ్రత్తగా, క్లినికల్ మదింపు చేయకుండా వీటిని సిఫారసు చేయరాదు. దగ్గు నివారణకు ఉపయోగపడే లిక్విడ్ ఓరల్ ఫార్ములేషన్స్‌లో డైఇథిలీన్ గ్లైకాల్(డీఈజీ), ఇథిలీన్ గ్లైకాల్(ఈజీ) వంటి హానికర పారిశ్రామిక రసాయనాలు ఉన్నట్లు తేలడంతో, సిరప్‌ల తయారీలో నిబంధనలను కఠినతరం చేసే దిశగా ఐపీసీ అడుగులేస్తోంది.ఫార్మా కంపెనీల బాధ్యత ఇదీ..దగ్గుమందుల్లో మలినాలు రాకుండా తయారీదార్లు ఫార్మాకోపియల్ గ్రేడ్ సాల్వెంట్లనే వినియోగించాలి. రిజిస్టర్డ్ లేబొరేటరీల్లో ముడిపదార్థాలు, తుది ఉత్పత్తులను బ్యాచ్‌ల వారీగా పరీక్షలు జరిపి, సవివర రికార్డులను నిర్వహించాలి. ఇండియన్ డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ వంటి పరిశ్రమ సంఘాలు ఈ ముసాయిదాను సమీక్షించి, తమ స్పందన తెలుపుతాయి. దగ్గుమందుగా వినియోగిస్తున్న సిరప్‌ల వల్ల చిన్న పిల్లల్లో పరిమిత థెరప్యూటిక్ ప్రయోజనమే ఉంటుందని నిపుణులు అంటున్నారు. దగ్గు అనేది ఒక సహజమైన రక్షణ ప్రతిచర్య అని.. ఈ లక్షణాలను అణచివేయడం కంటే, అందుకు కారణాలపై దృష్టిసారించడం మంచిదని వైద్యులు అంటున్నారు. సిరప్‌లకు బదులుగా హైడ్రేషన్, సెలైన్ డ్రాప్స్, తేనె (ఏడాది వయసుపైన పిల్లలకు) వంటివి సిఫారసు చేయొచ్చని అంటున్నారు.

# అమెరికా ఇరాన్ చర్చలు విఫలం



అందించిందని చెప్పారు. అయినప్పటికీ.. అమెరికన్లు తమ నమ్మకాన్ని పొందలేకపోయారని 'ఎక్స్' వేదికగా తెలిపారు. అగ్రరాజ్యంతో చర్చలకు ఇరాన్ తరఫున ఘాలిబఫ్‌తోపాటు విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నాయకత్వం వహించిన విషయం తెలిసిందే."యుద్ధం ముగింపు విషయంలో మాకు సదుద్దేశం, సంకల్పం ఉన్నాయని చర్చలకు ముందే చెప్పాం. కానీ.. గత రెండు యుద్ధాల అనుభవం కారణంగా మాకు అవతలి పక్షంపై నమ్మకం లేకుండా పోయింది. చర్చల సమయంలో మా ప్రతినిధులు దూరదృష్టితో కూడిన కొన్ని ప్రతిపాదనలు చేశారు. కానీ.. మా నమ్మకాన్ని చూరగొనడంలో అమెరికా విఫలమైంది. ఇరాన్ ఆలోచన విధానాన్ని, సూత్రాలను బాగా అర్థం చేసుకుంది. ఇప్పుడు మా విశ్వాసాన్ని గెలుచుకోగలదా? లేదా? అనేది ఆ దేశం చేతుల్లో ఉంది.ఇరాన్ అంటే 9 కోట్లమంది ప్రజల సముదాయం. సుప్రీం లీడర్ పిలుపును అనుసరించి.. వారంతా వీధుల్లోకి వచ్చారు. మా ప్రజల హక్కుల సాధనకు సైనిక పోరాటంతోపాటు దౌత్యం కూడా ఓ మార్గమని భావిస్తున్నాం. అదేవిధంగా 40 రోజుల యుద్ధంలో సాధించిన విజయాలను సుస్థిరం చేసుకునే దిశగా మా ప్రయత్నాలను విరమించుకోం" అని ఘాలిబఫ్ అన్నారు.పాకిస్థాన్ వేదికగా ఇరాన్- అమెరికాల మధ్య నిర్వహించిన శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఇరాన్ తమ షరతులు అంగీకరించని కారణంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. అయితే, అమెరికా అర్థం లేని డిమాండ్లు చేసిందని ఇరాన్ ఆరోపించింది.

**యుద్ధంతో సాధించలేనివన్నీ అమెరికా డిమాండ్ చేసింది: ఇరాన్**

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ తమ షరతులు అంగీకరించని కారణంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. అయితే, అమెరికా చేసిన.. అర్థం లేని డిమాండ్లే ఈ చర్చలు విఫలమవడానికి కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధంతో సాధించలేని వాటిని వారు ప్రస్తావించారని పేర్కొంది.ప్రజల జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం.. తమ ప్రతినిధి బృందం 21గంటల పాటు చర్చలు జరిపిందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. ఒప్పందం చేసుకునేందుకు.. ఇరాన్ ప్రతినిధులు అన్నిరకాలుగా చొరవ తీసుకున్నట్లు తెలిపింది. కానీ, యూఎస్ అర్థంలేని డిమాండ్లు చర్చల విఫలానికి కారణమయ్యాయని ఆరోపించింది. యుద్ధంతో సాధించలేని వాటిని అమెరికా చర్చల్లో ప్రతిపాదించిందని ఘనాలోని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది. తాము వాటన్నింటినీ గట్టిగా తిరస్కరించినట్లు తెలిపింది. హర్మూజ్ జలసంధి మూసే ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో చేసేది లేక.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వట్టి చేతులతో వెళ్లిపోయారని వ్యాఖ్యానించింది. పరువు నిలుపుకోవడానికి వారికి మరో మార్గం ఏదీ మిగల్లేదని ఎద్దేవా చేసింది.ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. కానీ, రెండు కీలక విషయాలాపై విభేదాలు రావడంతో ఒప్పందం కుదరలేదన్నారు. ఆ రెండు విషయాలు ఏంటనేది ఆయన స్పష్టం చేయలేదు. అయితే, హర్మూజ్ జలసంధి, ఇరాన్ అణుహక్కులపై నెలకొన్న ప్రతిష్ఠంభన కారణంగానే ఇవి విఫలమైనట్లు ఆ దేశ మీడియా పేర్కొంది.

ఒప్పందానికి అనుకూలంగా తాము షరతలు విధించామని.. కానీ వాటిని ఇరాన్ ప్రతినిధులు అంగీకరించలేదని వాన్స్ పేర్కొన్నారు. చర్చల్లో తాము చాలా సానుకూలంగా వ్యవహరించామన్నారు. సద్భావనతో ఇక్కడికి వచ్చి.. ఒక ఒప్పందం చేసుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేశామన్నారు. కానీ, దురదృష్టవశాత్తు ఎలాంటి పురోగతి సాధించలేకపోయామన్నారు. ఇది అమెరికా కంటే.. ఇరాన్‌కే దురదృష్టకర వార్తగా పేర్కొన్నారు. ఎలాంటి ఒప్పందం కుదరకుండానే తాము.. అమెరికాకు తిరిగి వెళ్లిపోతున్నట్లు వెల్లడించారు.భవిష్యత్తులో ఇరాన్ తన అణ్వాయుధాలను సమకూర్చుకోవడానికి గానీ.. దాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించకుండా ఉంటామనే స్పష్టమైన హామీని అమెరికా కోరుతోందని వాన్స్ అన్నారు. అయితే, ఇందుకు ఇరాన్ నిరాకరించిందన్నారు. ఎలాంటి ఒప్పందం కుదరనప్పటికీ.. తమ ప్రతిపాదనపై స్పందించేందుకు ఇరాన్‌కు ఇంకా సమయం ఇవ్వనున్నట్లు వాన్స్ సూచించారు. పాక్‌లో చర్చల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తాము నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నామని పేర్కొన్నారు. విదేశాంగమంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్‌లతో కూడా నిరంతరం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశం అనంతరం వాన్స్ నేతృత్వంలోని యూఎస్ ప్రతినిధుల బృందం పాక్‌ను వీడింది.అమెరికాతో శాంతి చర్చలు విఫలమవడంపై ఇరాన్ స్పందించింది. హర్మూజ్ జలసంధి, ఇరాన్ అణు హక్కులు వంటి కీలక అంశాలపై ప్రతిష్ఠంభన కారణంగానే ఇవి విఫలమయ్యాయని ఆ దేశ మీడియా పేర్కొంది.

అమెరికా వల్లే చర్చలు విఫలం

యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో చర్చలు విఫలం కావడానికి ఆ దేశమే కారణమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ ఆరోపించారు. 21 గంటల పాటు జరిగిన చర్చల సందర్భంగా తమ ప్రతినిధి బృందం సానుకూల ప్రతిపాదనలు

## నాడు మమ్మల్ని భయపెట్టిన వారే నేడు మనుగడ కోసం పోరాడుతున్నారు

**టెల్‌అవీవ్(జనంసాక్షి):**ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలమవడంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. ఇరాన్‌లోని అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలను అణచివేయడానికి చేస్తున్న పోరాటంలో తాము విజయం సాధించామన్నారు. గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, సిరియాలోని అసద్ ప్రభుత్వం, ఇరాక్‌లోని సాయుధ ముఠాలు, యెమెన్‌లోని హూతీల రూపంలో ఇరాన్ తమను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు ప్రయత్నించిందని పేర్కొన్నారు. కానీ అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఏకమై ఇరాన్ సేనలకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయన్నారు. ఇజ్రాయెల్‌ను సర్వనాశనం చేస్తామని నాడు బెదిరించిన ఇరాన్ పాలకులు నేడు భయంతో మనుగడ కోసం పోరాడుతున్నారని అన్నారు. ఈ యుద్ధంలో తాము ఇప్పటికే చారిత్రాత్మక విజయాలు సాధించినప్పటికీ.. ఈ పోరాటం ఇంకా ముగిసిపోలేదని నెతన్యాహు అన్నారు. భవిష్యత్తులో ఆ దేశంపై మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. ఇరాన్ నిర్వహిస్తోన్న అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిర్మూలించి.. ఇంకెప్పుడూ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

## త్వరలో ఆపరేషన్ హర్మూజ్

ద్వారా, ఇరాన్ ఆర్థిక వనరులను, వారికున్న ప్రధాన బలాన్ని పూర్తిగా దెబ్బతీయాలని ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు సుంకం చెల్లించిన ప్రతి నౌకను వెంబడించి అడ్డుకోవాలని తమ నౌకాదళానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు. అవసరమైతే వాటిని నిలిపివేయాలని యూఎస్ నేవీని ఆదేశించినట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' పోస్ట్‌లో పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన టోల్ చెల్లించే ఎవరికీ సముద్రాలపై సురక్షితమైన ప్రయాణం ఉండబోదని ట్రంప్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

హర్మూజ్ జలసంధిని తెరుస్తామని ఇరాన్ మాట ఇచ్చింది

హర్మూజ్ జలసంధిని తెరుస్తామని మాటిచ్చిన ఇరాన్, ఉద్దేశపూర్వకంగానే ఆ మాట తప్పిందని డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఇరాన్ చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఇరాన్ ప్రతిష్ట ఇప్పటికే మంటగలిసిందని, అంతర్జాతీయ చట్టాలను వారు ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఆ అంతర్జాతీయ జలమార్గాన్ని అత్యంత వేగంగా తెరవాలని వార్నింగ్ ఇచ్చారు. సరైన సమయంలో ఇరాన్ పని పట్టడానికి అమెరికా సిద్ధంగా ఉందని ట్రంప్ హెచ్చరించారు.

శాంతి చర్చలు విఫలం కావడానికి ఇరాన్ అణు ఆశయాలే ప్రధాన కారణం

ఈ యుద్ధాన్ని ముగించేందుకు చేసిన శాంతి చర్చలు విఫలం కావడానికి ఇరాన్ అణు ఆశయాలే ప్రధాన కారణమని ట్రంప్ మండిపడ్డారు. ఇస్లామాబాద్ చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినా అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే ఒప్పందం కుదరలేదని ట్రంప్ వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వనని ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రమాదకరమైన వ్యక్తుల చేతుల్లో అణుశక్తి ఉండటానికి అంగీకరించలేమన్నారు.

పాకిస్థాన్ నాయకత్వంపై ట్రంప్ ప్రశంసలు

ఇదే ప్రకటనలో పాకిస్థాన్ నాయకత్వంపై ట్రంప్ ప్రశంసలు కురిపించడం గమనార్హం. ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు సాధ్యపడేలా చేసిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ నాయకత్వాన్ని ట్రంప్ కొనియాడారు. గతంలో భారత్-పాకిస్థాన్ మధ్య జరగాల్సిన ఒక భయంకరమైన యుద్ధాన్ని తాను ఆపానని, దాదాపు 3 నుంచి 5 కోట్ల మంది ప్రాణాలను కాపాడినందుకు పాక్ నేతలు తనకు పదే పదే కృతజ్ఞతలు చెబుతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఇరాన్ నౌకలను దిగ్బంధించే అవకాశం ఉన్నట్లు చెబుతున్న ఓ మీడియా కథనాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫలితంగా ఇరాన్‌పై తదుపరి ప్రణాళికల గురించి ట్రంప్ పరోక్షంగా హింట్ ఇచ్చారా అని అంతర్జాతీయ మీడియా అనుమానం వ్యక్తం చేస్తోంది. ట్రంప్ షేర్ చేసిన వార్తా కథనం ప్రకారం 'ఇరాన్ అమెరికా డిమాండ్లకు లొంగకపోతే అధ్యక్షుడి వద్ద ఉన్న అస్త్రం నౌకాదళంతో దిగ్బంధనం చేయడమే. ఇరాన్ నౌకలను ఉన్న ప్రదేశం నుంచి కదలనీయకుండా చేయడం వల్ల చమురు ఎగుమతులపై ఆధారపడిన ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుంది. టెహ్రాన్ నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దాని మిత్ర దేశాలైన చైనా, భారత్‌పైనా ఈ ప్రభావం పడుతుంది.

## ఆశా భోంస్లే ఇకలేరు

మంచి గుర్తింపు దక్కింది. 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే జో దిల్ కో' తదితర పాటలు సంచలనం సృష్టించాయి. ఇప్పటివరకు 1000కి పైగా బాలీవుడ్ చిత్రాల్లో ఆమె పాటలు పాడారు. చిత్ర పరిశ్రమకు చేసిన ఎనలేని కృషికిగానూ పద్మ విభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, మహారాష్ట్ర భూషణ్, బంగా బిభూషణ్ అవార్డులు ఆమెను వరించాయి.

**ఏ కష్టానికి కుంగిపోని 'ఆశ'..!**

తీరాన్ని అలలు తాకినట్లు ఆమె జీవితాన్ని కష్టాలు వెన్నంటాయి.. టీనేజ్‌లోనే ప్రేమ వివాహం.. గర్భిణిగా ఉన్న సమయంలో భర్త దూరం కావడంతో.. ఒక దశలో ఆత్మహత్యకు యత్నించినా.. ఆమె గానామృతాన్ని ఆస్వాదించే అదృష్టం ప్రపంచానికి ఉండటంతో మృత్యువును తప్పించుకొన్నారు. 'దమ్ మారో దమ్' అంటూ పాడి సంగీతాభిమానులను ఓలలాడించారు. 14 భాషల్లో వేలాది పాటలతో భారత చిత్రపరిశ్రమను అలరించారు. ఆమే ఆశా భోంస్లే..!

**చిన్నప్పటి నుంచే..**

ఆశా మహారాష్ట్రలోని సాంగ్లీలో కళాకారుల కుటుంబంలో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. ఆమె తండ్రి దీననాథ్ మంగేష్కర్ థియేటర్ ఆర్టిస్ట్. అక్క లతా మంగేష్కర్. ఉమా, మీనా అక్కాచెల్లెళ్లు, హృదయనాథ్ సోదరుడు. ఆశా 9 ఏళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయింది. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు అక్క లతా మంగేష్కర్‌తో కలిసి పాటలు పాడింది. క్లాసికల్, గజల్స్, రొమాంటిక్ ఇలా అన్ని రకాల పాటలను అలవోకగా పాడగలగడం ఆమెకు దేవుడిచ్చిన వరం. 16 ఏళ్ల వయసులో ఆమె తన అక్క లతా మంగేష్కర్ పీఏ 31 ఏళ్ల గణపత్‌రావ్ భోంస్లేను ప్రేమ వివాహం చేసుకొన్నారు. దీనిని లతా తీవ్రంగా వ్యతిరేకించారు. అక్కా చెల్లెళ్ల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కానీ, ఆశాకు తొలి బిడ్డ పుట్టాక పుట్టింటి వారు ఆమె వివాహాన్ని ఆమోదించారు. కానీ, గణపత్‌కు మాత్రం ఆశా పుట్టింటి వారితో.. ముఖ్యంగా లతా మంగేష్కర్‌తో సంబంధాలు నెరపడం ఏమాత్రం ఇష్టం లేదు. దీంతో ఆశాను డబ్బు కోసం వేధించడం మొదలుపెట్టారు. మరోవైపు గణపత్‌రావ్ కుటుంబం గాయనిని ఇంటి కోడలుగా ఆమోదించలేదు. తన చిన్నకుమారుడు ఆనంద్‌ను కనబోయే ముందు అత్తగారి కుటుంబీకులు ఆశాను ఇంటి నుంచి వెళ్లిపొమ్మని చెప్పారు. మరోవైపు భర్త హింసాత్మక ప్రవృత్తితో ఆశా చాలా ఇబ్బందులు పడ్డారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ

అమలు, రెగ్యులర్ ప్రమోషన్స్, రిక్రూట్మెంట్స్, ఆర్టిజన్ సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది.కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, నాయకులు భూపాల్ రెడ్డి, సదానందం, స్వామి, రమేష్, అశోక్, సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, దయానంద్, శివశంకర్, జనప్రియ, మల్లయ్య, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌ను మళ్లీ టీఆర్‌ఎస్‌గా మార్చే ఆలోచన



డీలిమిటేషన్‌తో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయి. ఇతర రాష్ట్రాల పార్టీలు వస్తానంటే కాదనలేం. గతంలో మేం కూడా మహారాష్ట్రకు వెళ్లాం కదా. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యత విపరీతంగా పెరిగింది. మేధావులు అనుకున్నవాళ్లు ఇప్పుడు మాట్లాడటం లేదు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలించారు. వారే ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్" అని అన్నారు.

**కాంగ్రెస్ పార్టీ అంతా అవినీతిమయం**

రాష్ట్రంలో 'దోచుకో.. దాచుకో' ప్రభుత్వం నడుస్తోందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలంతా అదే పని మీద ఉన్నారని విమర్శించారు. మంచిర్యాల జిల్లాలో పర్యటించిన ఆయన.. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన క్యాతనపల్లి పాలకవర్గ సభ్యులను సన్మానించారు. ఎన్ని ప్రలోభాలకు గురి చేసినప్పటికీ.. బీఆర్‌ఎస్-సీపీఐ కూటమి తరఫున గెలిచి కౌన్సిలర్లు.. ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అటకెక్కించిందని ధ్వజమెత్తారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరిట.. సింగరేణి సంపదను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రతి పథకంలో స్వయంగా మంత్రుల నుంచి మొదలుకొని ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ అవినీతికి పాల్పడుతున్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన 'దాచుకో-దోచుకో-దాచుకో' పథకం సింగరేణిలోనూ నడుస్తోంది.రేవంత్ రెడ్డి అంత చండాలపు ముఖ్యమంత్రి భారతదేశంలో ఎవరూ లేరు. రేవంత్ రెడ్డి అంత దారుణంగా, భారీ ఎత్తున దోచుకుంటున్న ముఖ్యమంత్రి కూడా దేశంలో ఇంకా ఎవరూ లేరు. మళ్ళీ తెలంగాణ రాష్ట్రం బాగుపడాలి అంటే, తెలంగాణ రైతుల ముఖంలో చిరునవ్వులు రావాలి అంటే, సింగరేణి కార్మికులకు లాభం జరగాలి అంటే కేసీఆర్ తిరిగి రావాల్సిందే. తెలంగాణలో ప్రజాస్వామ్యం బతకాలి అంటే కేసీఆర్ తిరిగి రావాల్సిందే.కాంగ్రెస్ పార్టీతో బిజేపి కూడా వంత పాడుతూ సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవడం లేదు. వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం కనీసం ఉలుకూ పలుకూ లేకుండా మౌనంగా ఉన్నది. వేల కోట్ల దోపిడీ పైన సీబీఐ ఎంక్వైరీ వేయమంటే పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్, బిజేపి చీకటి దోస్తులుగా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నారు. ముఖ్యమంత్రి బావమరిది సింగరేణిలో టెండర్లు వేస్తుంటే ఇక్కడే వసూళ్లు అవుతున్నాయి, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ పథకంలో కూడా సృజన్ రెడ్డికి వందల కోట్ల కాంట్రాక్టు ఇచ్చింది. అందుకే రాష్ట్రంలో ఇచ్చిపుచ్చుకునే విధంగా బిజేపి, కాంగ్రెస్ లు కలిసి నడుస్తున్నాయి. అందుకోసమే ఒకరి దోపిడీ ఒకరు బయటపడకుండా బ్రహ్మాండంగా కాంగ్రెస్, బిజేపి పార్టీలు పరస్పరం కాపాడుకుంటున్నాయి. ప్రధానమంత్రి ఢిల్లీకెంచి వచ్చి రాష్ట్రంలో 'ఆర్ఆర్' టాక్స్ వసూలు చేస్తున్నారు, బిల్డర్ల దగ్గర, కాంట్రాక్టర్ల దగ్గర దోపిడీ చేస్తున్నారు అని విమర్శించారు. కానీ రాహుల్-రేవంత్ టాక్స్ పైన ఇప్పటిదాకా విచారణకు ప్రధానమంత్రి ఎందుకు ఆదేశించలేదు? హోం మంత్రి అమిత్ షా వచ్చి తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారింది, అడ్డగోలుగా కుంభకోణాలు చేస్తుంది అన్నారు. కానీ దొంగలను పట్టుకోవాల్సిన కేంద్ర హోంశాఖ మంత్రి ఒక్క విచారణకు కూడా ఆదేశం ఇవ్వలేదు. అందుకే కాంగ్రెస్, బిజేపిలు ఒకరి దొంగతనం బయటపడకుండా ఇంకొకరు కాపాడుకుంటూ వస్తున్నారు.ఎన్ని ప్రలోభాలకు, ఎన్ని అక్రమ కేసులకు, వేధింపులకు గురి చేసినా క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన ప్రజలకి, మా పార్టీ కౌన్సిలర్లకి, కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. పొత్తు ధర్మాన్ని పాటించి మాతో నడిచిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ కౌన్సిలర్లకు, జిల్లా నాయకత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు.రాష్ట్రంలో నీచమైన, నికృష్టమైన రాజకీయం కొనసాగుతున్నది. క్యాతనపల్లిలో 22 స్థానాలకు 14 స్థానాలు గెలిస్తే కూడా కాంగ్రెస్ పార్టీ అనేక అరాచకాలకు పాల్పడింది. క్యాతనపల్లిలో ప్రజలు తిరస్కరించిన మంత్రి వివేక్ అహం దెబ్బతినడంతో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ రాజ్యాన్ని తలపించేలా క్యాతనపల్లిలో సైనిక కవాతు నిర్వహించి మరి కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురి చేశారు. 1000 మంది పోలీసులతో మాజీ ఎమ్మెల్యే సుమన్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి గారిని ఇబ్బందులకు గురి చేశారు.ఎన్ని కేసులు పెట్టినా, దౌర్జన్యాలు చేసినా, రాళ్లు వేసినా, కౌన్సిలర్లను ఎత్తుకుపోయే ప్రయత్నం చేసినా చివరికి లక్షల రూపాయల బ్లాంక్ చెక్కులు రాసిచ్చినా కాంగ్రెస్ పార్టీ ముఖాన కొట్టిన మన కౌన్సిలర్లందరికీ హృదయపూర్వకంగా నమస్కారాలు తెలియజేస్తున్నాను. మాజీ ఎమ్మెల్యే సుమన్ క్యాతనపల్లిలో ఉంటే తమ ఆటలు సాగవని అక్రమంగా అరెస్ట్ చేసి ఆసిఫాబాద్, మంచిర్యాల సబ్ జైలు కాకుండా అదిలాబాద్ జిల్లా జైల్లో పెట్టారు. కనీసం మాజీ ఎమ్మెల్యే అన్న గౌరవం ఇయ్యకుండా తీవ్ర ఇబ్బందులకు జైల్లో గురి చేశారు. మంత్రి వివేక్ క్యాతనపల్లి కావాలని సుమన్ ని అడుక్కుని ఉంటే ఇచ్చేసేవాడు. కానీ జైలుకు పంపి ఇబ్బందులకు గురి చేశాడు. నేను జైలులో సుమన్ని కలిసేందుకు పోతే, 'నేను ఇక్కడ సంవత్సరం అయినా ఉంటా కానీ మన కౌన్సిలర్లకు ధైర్యం చెప్పండి' అన్నాడు. 'కాంగ్రెస్ ఆటలను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ప్రజా తీర్పుని గౌరవించేలా కార్యకర్తలకు పోరాటం చేసేందుకు ధైర్యం నింపండి' అని కోరిండు 100 రోజుల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు దాటినా ఒక్క హామీ అమలు చేయలేదు. రైతుల నుంచి ఆడబిడ్డల దాకా, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అందరికీ తీవ్రమైన మోసానికి కాంగ్రెస్ పార్టీ గురి చేసింది. 'మూడు నెలల్లో పిల్లలు పుడతారా' అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, 30 నెలలు అయింది ఎందుకు గ్యారెంటీలు అమలు చేయలేదో అని మనం అడగాలి.కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి 'దాచుకో-దోచుకో' అన్న పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నడిపిస్తున్నారని అన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

అల్లూరి సీతారామరాజు జిల్లా (జనంసాక్షి):అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో విషాదం చోటు చేసుకుంది. పన్నెడా గ్రామానికి చెందిన ఐదుగురు బాలురు మత్స్యగెడ్డలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరిలో నలుగురు ప్రమాదవశాత్తు మునిగిపోగా.. మరొకరు బయటకు వచ్చి సహాయం కోసం కేకలు వేశారు. సమీపంలోని మత్స్యకారులు తక్షణమే స్పందించి.. ఒకరిని కాపాడగలిగారు. మిగిలిన ముగ్గురూ మృతి చెందారు. మృతులను హర్షిత్ (12), ప్రదీప్ (11), పాంగి బబులు (10)గా గుర్తించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక

హైదరాబాద్(జనంసాక్షి): మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలు బుద్ధి చెబుతారన్నారు. మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు దశాబ్దాల నాటి కల అని, మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మకమని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా బిల్లుకు మద్దతివ్వాలని బండి పిలుపునిచ్చారు.

# సమగ్ర కుల జనగణన జరగాలి



▫ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్ (జనంసాక్షి) : జాతీయస్థాయిలో సమగ్ర కుల జన గణన జరిగితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా 'క్యాస్ట్ సెన్సెస్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్' అనే పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో నిర్వహించే జన గణనలో అన్ని కులాల సామాజిక, విద్య మరియు ఆర్థిక స్థాయిలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, దేశవ్యాప్తంగా సమగ్ర కుల జన గణన చేపట్టడానికి అది మార్గదర్శకంగా నిలుస్తుంది ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో క్యాస్ట్ సెన్సెస్ అండ్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్ పుస్తక రచయిత, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిసర్చ్ స్కాలర్ జి కిరణ్ కుమార్, డాక్టర్ వాహిని బిల్లు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిపాలనను బలోపేతం చేయడంలో, సామాజిక న్యాయాన్ని మరింత లోతుగా స్థాపించడంలో కుల లెక్కింపు ప్రాధాన్యతను ఈ గ్రంథం స్పష్టంగా ప్రతిపాదిస్తుందని రచయితలు వారి అభిప్రాయాన్ని తెలిపారు. పుస్తక ఆవిష్కరణ అనంతరం డిప్యూటీ సీఎం బీసీ ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, మేధావులు, విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల గుణంతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో డి అశోక్, సురేందర్, గణేష్, శివ, అరవింద్, లక్కీ, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవితంలో పేదరికం.. చదువులో టాప్..


**స్టూడెంట్‌ను అభినందించి, చేయూతనిచ్చిన వార్డు సభ్యురాలు..**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జీవితంలో పేదరికం అనుభవిస్తూనే.. ఇంటర్ చదువులో మాత్రం మంచి మార్కులు సాధించి టాప్ లో నిలిచింది ఓ నిరుపేద స్టూడెంట్.. ఈ విషయం తెలిసిన స్థానిక వార్డు సభ్యురాలు మూల మంజుల తిరుపతి వెంటనే స్పందించి, స్టూడెంట్ కీసరి కీర్తి ను అభినందించి, వెంటనే రూ. 500లు అందజేసి ప్రోత్సహించేందుకు చేయూతనిచ్చారు. ఆదివారం విడుదల అయిన ఇంటర్ ఫలితాలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన కీసరి రాజిరెడ్డి కోమల దంపతుల కూతురు కీసర కీర్తి 470/452 మార్క్స్ సాధించి అందరినీ అబ్బుర పరిచింది. పేదరికంలో పుట్టినా చదువులో మాత్రం మంచి టాప్ మార్కులు తెచ్చుకోవడం పట్ల గ్రామస్థులు అభినందిస్తున్నారు. ఇంటర్ లో మంచి మార్కులు సాధించిన కీసరి కీర్తిని స్థానిక 6వ వార్డు సభ్యురాలు మూల మంజుల తిరుపతి అభినందించి, ఘనంగా సన్మానం చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ ఎన్డీఏ, ఎన్ఏ, సిడిఎస్ పరీక్ష

**ఆర్ట్స్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ రవి**



హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 12 (జనంసాక్షి) : యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఎన్డీఏ , నావల్ అకాడమీ ఎన్ ఏ కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ సిడిఎస్ -2026 పరీక్షలు జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షలు నిర్వహించగా, పింగిలి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో కమాండ్ డిఫెన్స్ సర్వీస్ పరీక్ష జరిగింది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యూపిఎస్సి ద్వారా నిర్వహించిన పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సందర్శించిపరీక్ష జరుగుతున్న తీరును, ఏర్పాట్లను పరిశీలించారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించిన రెండు పరీక్ష కేంద్రాలలో 754 మంది అభ్యర్థులకు గాను మొదటి పరీక్షలో 517 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా మధ్యాహ్నం 2 నుండి 4:30వరకు నిర్వహించిన రెండో పేపర్ పరీక్షకు 471 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పింగిలి కళాశాలలో ఉదయం 9 నుండి 11 గంటల వరకు నిర్వహించిన సిడిఎస్ పరీక్ష ఫస్ట్ సెషన్ కు 209 మందికి గాను 84 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్ పరీక్షకు 88 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. నాలుగు నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన మూడో సెషన్ పరీక్షకు 103 మంది అభ్యర్థులకు గాను 40 మంది పరీక్ష రాశారని అధికారులు వెల్లడించారు.

# కంకల వాగులో అస్తిపంజరం అవశేషాలు లభ్యం



**నూగూర్ వెంకటాపురం, ఏప్రిల్ 12(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లో ని కంకల వాగు లో గుర్తు తెలియని వ్యక్తి ఆస్థి పంజర అవశేషాలు లభించినట్లు ఎస్సై ఎం. సాయికృష్ణ తెలిపారు. మృతుడు ఎరుపు రంగు టి -షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే రాత్రి కావడం తో నేర స్థలాన్ని భద్ర పరిచి, ఎస్సై ఎం సాయి కృష్ణ, పోలీస్ సిబ్బంది తో ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. విచారణలో లభించిన అవశేషాలు మగ వ్యక్తికి చెందినవిగా నిర్ధారించినట్లు తెలిపారు. వెంకటాపురం పోలీస్ స్టేషన్ లో 9 నెలల క్రితం నమోదు అయినా మిస్సింగ్ లో కంకల వాగు బ్రిడ్జి నుండి దూకిన బొగ్గుల శ్రీను, వయసు : 45 సంవత్సరాలు, వృత్తి :డ్రైవర్, అనే వ్యక్తికి చెందినవి గా అనుమానం వ్యక్తం మైందని అన్నారు. అతని కుటుంబ సభ్యులను పిలిచి చూపించగా, కుటుంబ సభ్యులు అవశేషాలు గుర్తించారు. చట్టపరమైన విధివిధానాల ప్రకారం పంచనామా నిర్వహించమని అన్నారు. ఎస్సై ఎం సాయి కృష్ణ, పోలీస్ సిబ్బంది, డాక్టర్ సమక్షంలో పోస్ట్ మార్టం చేయించి, డి ఎన్ ఏ నిర్ధారణ కోసం నమూనాలు పోరెన్సిక్ ల్యాబ్ కు పంపించామని తెలిపారు. మృత దేహ అవశేషాలని కుటుంబ సభ్యులకు అప్పగించి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై ఎం సాయి కృష్ణ తెలిపారు.

# అరైవ్... అలైవ్ ఒక ఉద్యమంగా సాగించాలి

▫ డీజీపీ బి శివధర్ రెడ్డి



బెల్లంపల్లి, ఏప్రిల్ 12, (జనంసాక్షి) : అరైవ్... అలైవ్ ఒక ఉద్యమం లాగా సాగించాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం బెల్లంపల్లి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా "అరైవ్... అలైవ్" పేరుతో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జాయింట్ కలెక్టర్ చంద్రయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాకుండా ప్రభుత్వ సమగ్ర విధానంలో భాగమని తెలిపారు. "99 రోజుల యాక్సిడెంట్స్ ఫ్రీ డ్రైవ్" లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ తదితర శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో రహదారి భద్రత కమిటీలు ఏర్పాటు చేసి, ఎక్కడా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉద్యమ స్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. మన గ్రామంలో, కాలనీలో ఒక్క ప్రాణం కూడా ప్రమాదంలో కోల్పోకూడదు అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్... అలైవ్" కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించాలని అన్నారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు ఒక సామాజిక సమస్యగా మారాయని, వాటిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే "అరైవ్... అలైవ్" కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం మాత్రమే కాకుండా సరిగా బిగించుకోవాలని, నాలుగు చక్రాల వాహనదారులు డ్రైవర్‌తో పాటు అందరూ సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, అధిక వేగం, అధిక లోడింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు ఎల్లప్పుడూ తమ వద్ద కలిగి ఉండాలని తెలిపారు. ప్రత్యేకంగా ఆటో డ్రైవర్లకు సూచిస్తూ, ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరుగుతుందని, ప్రమాదం జరిగితే కుటుంబాలపై తీవ్రమైన ప్రభావం ఉంటుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన డ్రైవర్లకు డీజీపీ చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు మరియు సుమారు 200 మంది పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన డీజీపీ**

బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సందర్శించారు. బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ ను కలిశారు. ఎమ్మెల్యే వినోద్ డీజీపీ శివధర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా స్థానిక అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసులు చేస్తున్న కృషిపై చర్చించారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య, డీసీపీ భాస్కర్, ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, ఇతర ఉన్నతాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హైడ్రా ఆపరేషన్ కంటిన్యూ

▫ కొనసాగుతున్న ఆక్రమణ తొలగింపు

▫ అమీన్‌పూర్‌లో 861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్





హైదరాబాద్, ఏప్రిల్ 12 (జనంసాక్షి) : అమీన్‌పూర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్ కొనసాగుతోంది. శనివారం ఉదయం మొదలు పెట్టిన కార్యక్రమం రాత్రి వరకు కొనసాగింది. రాత్రి పూట ఆపేసి ఆదివారం ఉదయం మళ్ళీ హైడ్రా ప్రారంభించింది. వీబనస్త్రవవఎ సోదరుడు అజీమ్ అక్రమంగా నిర్మించిన 6 అంతస్తుల భవనం 80 శాతం తొలగించడం అయ్యింది. మరో గంటలో మొత్తం పూర్తి అవుతోంది. పక్కనే ఉన్న అపార్టుమెంట్లకు ఎలాంటి నష్టం జరగకుండా హైడ్రా జాగ్రత్తలు తీసుకుంది. దీంతో అక్రమ భవనం కూల్చివేతకు సమయం పడుతోంది. అలాగే 861 ఎకరాల చుట్టు ఫెన్సింగ్ వర్క్ జరుగుతోంది. సాయంత్రం వరకు పూర్త్ అయ్యే అవకాశం ఉంది. హైడ్రా అధికారులు దగ్గరుండి ఈ ఆక్రమణ తొలగింపు, ఫెన్సింగ్ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. స్థానికులు హైడ్రాకు సహకరించడమే కాదు అభినందిస్తున్నారు. పేదలు గతంల్9 భయం భయంగా ఉండేవాళ్ళం. ఇప్పుడు హైడ్రా రాకతో మాకు భరోసా వచ్చింది. మా ఇళ్ళను కూల్చుమని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఈ మేరకు ఖాళీ స్థలాలను కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మాలో ఉన్న ఆందోళనలన్నీ పటాపంచలు అయ్యాయి. ప్రభుత్వానికి ధన్యవాదాలు. హైడ్రా చర్యలు అభినందనీయం అని స్థానికులు చెబుతున్నారు. కబ్జాలు చేసి వందల ఎకరాలను మాయం చేసి వందలు, వేల కోట్ల రూపాయలను కొల్లగొట్టిన గుండాల భారతం పట్టడంలో హైడ్రా చొరవని అభినందిస్తున్నాం అని పలువురు సంబరాలు చేసుకున్నారు. హైడ్రా అంటే పెదవాళ్ళకు భరోసా అనేది మరోసారి రుజువైందని పలువురు పేర్కొన్నారు.



# న్యాయం చేయండి

▫ భర్త ఇంటి ముందు భార్య బైఠాయింపు

**బచ్చన్నపేట ఏప్రిల్ 12 ( జనం సాక్షి):** తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ భార్య భర్త ఇంటి ముందు బైఠాయించిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం జాల గ్రామానికి చెందిన కాకల్ల కనకయ్య, వెంకటమ్మల కుమార్తె సౌమ్యకు, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కన్నె యాదయ్య, మల్లమ్మల రెండో కుమారుడు శివతో 2021లో ఘనంగా వివాహం జరిగింది. పెళ్లి సమయంలో పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా రూ. 2.50 లక్షల నగదు, ఆరు తులాల బంగారం కట్నకానుకలుగా అందజేశారు. వివాహం జరిగిన మొదటి ఏడాది వీరి సంసారం సాఫీగానే సాగింది. అయితే, గత నాలుగు సంవత్సరాలుగా భర్త శివ తనను ఇంటికి తీసుకువెళ్లకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సౌమ్య ఆవేదన వ్యక్తం చేశారు. భర్త మరియు బావ వైఖరితో విసిగిపోయిన బాధితురాలు, చివరకు న్యాయం కోసం భర్త ఇంటి ముందే మౌన పోరాటానికి దిగారు. "నాకు న్యాయం జరిగే వరకు ఈ ఇంటి ముందు నుండి కదిలేది లేదు" అని సౌమ్య స్పష్టం చేశారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అధికారులు స్పందించి తనకు తన భర్తతో కలిపి జీవించేలా న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు. ఈ క్రమంలో ఆమెకు మద్దతుగా జాల గ్రామస్తులు మరియు నాగిరెడ్డిపల్లి ప్రజలు భారీ సంఖ్యలో మద్దతు తెలిపారు

# నేడు కాళోజీ కళాక్షేత్రంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభం

▫ పాల్గొననున్న పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, కలెక్టర్లు ప్రజాప్రతినిధులు




**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, డాక్టర్ సత్య శారద, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులు గా పాల్గొననున్నారు ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను డిసిపి సెంట్రల్ జోన్ ధార కవిత, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు నరసింహారావు, సత్యనారాయణ తదితర అధికారులు ఆదివారం ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని వివిధ వర్గాల ప్రజలతో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి, ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సర్పంచు లు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు. ఇతర వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ఘనపూర్ ఆయకట్టుకు నీటి విడుదలపై నీలిమేఘాలు

▫ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన నర్సాపూర్ ఎమ్మెల్యే





**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 12 (జనం సాక్షి):** ఘనపూర్ ఆయకట్టు లో ఎండుతున్న పంటల ను కాపాడేందుకు ప్రభుత్వం సింగూర్ నుంచి నీటి విడుదలకు ఆదేశాలు ఇచ్చినా అధికారులు మోకాలు అడ్డడంతో రైతాంగానికి ఆశనిపాతంగా మారింది. ఒక్క తడితో వేలాది ఎకరాల్లో సాగు చేసిన కోట్లాది రూపాయల పంట చేతికందనుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ని ఏకైక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు ఐన ఘనపూర్ ( వనదుర్గ ) ప్రాజెక్ట్ ఆయకట్టు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ప్రభుత్వం 0.35 టీఎంసీల నీటిని విడుదల చేస్తే లక్ష ఎకరాల్లో సాగుచేసిన పంటలు చేతుకు అంది అన్నదాతలు ఘుట్టెక్కనున్నారు. వివరాల్లోకి వెళితే మెతుకు సీమ (మెదక్ జిల్లాలో) 1905 వ సంవత్సరంలో కరువు రక్కసి నుంచి ప్రజలను కాపాడేందుకు మంజీరా నదిపై కొల్చారం - పాపన్నపేట మండలాల సరిహద్దులో గన్ పూర్ ఆనకట్ట నిర్మాణం జరిగింది. మంజీరా నదిపై సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూరు ప్రాజెక్టు నుంచి మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ఉన్న ఘన్పూర్ ఆనకట్ట వరకు సంగారెడ్డి, అందోల్, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలో 100 కిలోమీటర్ల మంజీరా పరివాహక ప్రాంతం ఉంది. సుమారుగా లక్ష ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ ప్రాంతంలో హత్నూర, చిలిపిచెడ్, కౌడిపల్లి, కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ప్రైవేటు ఎత్తిపోతలు కాకుండా సుమారుగా 25 ప్రభుత్వ ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఘన్పూర్ ఆనకట్ట కింద ఎం ఎన్, ఎఫ్ఎన్ కెనాల్ ల ద్వారా సుమారుగా 20 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గత వర్షాకాలం కురిసిన భారీ వర్షాలతో సింగూర్ ప్రాజెక్టు భారీగా నిండి 60, 70 టీఎంసీల నీరు వృధాగా పోయింది. సింగూర్ ప్రాజెక్టు భారీ వరదలతో ప్రమాదం బారిన పడిందని... మరమ్మత్ పనులు చేయాలని సెంట్రల్ వర్కింగ్ టీం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆనకట్టలో 16 టీఎంసీల నీరు ఉండగా 8 టీఎంసీలను వదలడంతో పాటు , మరో 8 టీఎంసీలు హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు... జిల్లాలో మిషన్ భగీరథ తాగునీటి కోసం అవసరమవుతాయని నిర్ణయించారు. ఘన్పూర్ ఆనకట్ట కింద జనవరి నెలలో రైతులు పంటలు సాగు చేశాక ఈ నిర్ణయం బయటపడడంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. మాఘ అమావాస్య నుంచి మహాశివరాత్రి వరకు నీటి విడుదల తో రైతులు సాగు చేసిన పంటలకు 90 రోజులపాటు నీరు అందింది. పంటలు చేతికి వచ్చేందుకు మరో 30 రోజులు సమయం ఉండగా, సింగూర్ నుంచి నీటి విడుదల చేయకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మరో 30 రోజుల్లో పంటలు చేతికి రానున్నందున పది రోజులకు ఒక విడతగా 0.35 టీఎంసీల నీటిని విడుదల చేస్తే సుమారుగా ఒక లక్ష ఎకరాల్లో పంటలు చేతికందనున్నాయి. ఈ విషయమై నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి మెమోరాండం అందజేయడమే కాకుండా అసెంబ్లీలో ప్రస్తావించారు. సింగూర్ ప్రాజెక్టు నుండి ఘనపూర్ ప్రాజెక్ట్ కు నీటిని విడుదల చేసినప్పటికీ.. సరైన ఆదేశాలు లేకపోవడంతో మంజీరా డ్యామ్ నుంచి కింది భాగంలో ఉన్న ఘన్పూర్ ప్రాజెక్టుకు నీరు రాకుండా అధికారులు అడ్డగించారు. ఈ సందర్భంగా స్పష్టం అయిన ఆదేశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మ రెడ్డి ఆదివారం బహిరంగ లేఖ రాశారు.

# జలియన్ వాలాబాగ్ ఓ కుట్ర కోణ ఉదంతం



భారతదేశ చరిత్ర అంతా గెలిచిన వారిదే. ఇక్కడ ఆధిపత్య కులాల వారి పాత్రలు, పోరాటాలే చరిత్రలో కనబడతాయి. పూలే, అంబేడ్కర్, కాన్సిరాం సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాటంతో వాస్తవ చరిత్ర బయటకు వచ్చింది. ఉద్ధం సింగ్, ఝల్కారీబాయి చరిత్ర, జలియన్ వాలాబాగ్ దుర్ఘటన ఇందుకు నిదర్శనం. దేశ చరిత్రలో జలియన్ వాలాబాగ్ హత్యాకాండ ఒక ముఖ్యమైన స్వాతంత్ర్య ఉద్యమ ఘటన. ఇది 1919, ఏప్రిల్ 13న అమృతసర్ లో జరిగింది. వేలాదిమంది అసువులు బడిన ఈ ఉదంతంలో వాస్తవికతను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఉదంతం పై ఆధిపత్య చరిత్రకారుల చరిత్రను పరిశీలించినట్లయితే...

జలియన్ వాలాబాగ్ ప్రాంతంలో వేలాది మంది ప్రజలు కులం, మతం, వర్గం తేడా లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యారు. ఈ సమావేశం రోలట్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనగా పేర్కొన్నారు. ఈ చట్ట ఎలాంటి విచారణ అరెస్ట్ చేయడం. దీనికి నిరసనగా జలియన్ వాలాబాగ్ ప్రాంతంలో సమావేశమైన ప్రజలపై బ్రిటిష్ సైన్యాధికారి రెజినాల్డ్ డయ్యర్ తన సైన్యంతో ప్రజలపై కాల్పులు జరిపించాడు. ఇది బ్రిటిష్ పాలన క్రూరత్వానికి ఉదాహరణ, "భారతీయులపై బ్రిటిష్ దమన చర్య"గా చరిత్రకు ఒకవైపు. బహుజనుల కోణంలో వాస్తవ చరిత్రను పరిశీలించినట్లయితే... జలియన్ వాలాబాగ్ ఉదంతంలో ఓ కుట్ర కోణం ఉందని నిరూపణ అవుతుంది. అందరి త్యాగాలు ఉన్నాయని చెబుతున్న ఈ హత్యకాండలో కొన్ని వర్గాలే బలైనారు. కుల వివక్షత, అంటరానితనం వంటి అమానుష శిక్షలు అనుభవిస్తూ, సిక్కు మతంలోకి మారిన దళిత బహుజనులే బలి పశువులుగా మారారు.

**తప్పుగా చిత్రీకరించిన ఉదంతం.**

చారిత్రకంగా ఈ దేశ మూలవాసులుగా చెప్పబడుతున్న దళిత, బహుజనుల చరిత్ర మరుగునపడింది. అగ్రకుల చరిత్రకారుల రాతలే చరిత్రపై ప్రభావం చూపాయి. దీంతో అణగారిన వర్గాల చరిత్ర, త్యాగాలు మరుగున పడ్డాయి. భారతీయ కుల వ్యవస్థలో అట్టడుగు వర్గాలు సామాజిక దుర్విచక్షణకు గురైనారు. దేవాలయాల్లోకి అనుమతించకపోవడం, నైవేద్య ప్రసాదానికి, మోక్షానికి అనర్హులు. ఈ వివక్షత నుంచి బయటపడడానికి దళిత, బహుజనులు ఇతర మతాల్లోకి మారారు. ముఖ్యంగా సమానత్వానికి ప్రాధాన్యమించి, భారతదేశంలో ఆవిర్భవించిన అది మతాలైన బౌద్ధం, సిక్కు ప్రధానమైంది. సిక్కు మతగ్రంథమైన 'ఆది గ్రంథ్'లో చమార్ కులానికి చెందిన సంత్ రవిదాస్ బోధనలు ప్రధానంగా చెప్పబడతాయి. సిక్కు సంప్రదాయం కులవ్యవస్థ, బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా సమానత్వం, లంగర్, కరాహ్ ప్రసాదం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పించిన భారతీయ మతం. 1699లో గురు గోబింద్ సింగ్ ఖాల్సా పంథ్‌ను స్థాపించిన రోజుగా వైశాఖిని (బైశాఖి) జరుపుకుంటారు. ఇది చాలా పవిత్రమైన పండగ. ప్రతి ఏటా పంజాబీలోని వైశాఖి రోజున గురుద్వారాలలో కరాహ్ ప్రసాదం (తీపి ప్రసాదం) పంచుతారు. దళిత సిక్కులు ఈ ప్రసాదాన్ని పంచడానికి అగ్రకుల బ్రాహ్మణ సిక్కులు అనుమతించలేదు. దీంతో వేలాది దళిత సిక్కులు 1919 ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ మైదానంలో చేరుకొని సమావేశమైనారు. ఈ సమావేశాన్ని అగ్రకుల బ్రాహ్మణ సిక్కులు బ్రిటిష్ వారిపై దాడికి యత్నిస్తున్నారని తప్పుడు సమాచారమివ్వడంతో బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ అధికారి డైర్ కాల్పులకు ఆదేశించాడు. పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మైఖేల్ ఓ'డ్వైర్ డయ్యర్ ఈ దుర్ఘటనకు మద్దతు పలికాడు. జలియన్ వాలాబాగ్ మైదానంలో వాలంటీర్ గా పనిచేసిన ఉద్ధం సింగ్ చమార్ తన కళ్ళెదుట అసువులు బాసిన వారిని చూసి చలించాడు. విప్లవ భావాలు గల ఆయన లండన్ వెళ్ళి మైఖేల్ ఓ'డయ్యర్ ను హత్య చేశాడు. దళిత విప్లవకారుడి పగ ప్రతీకారానికి నిదర్శనం. స్వాతంత్ర్య ఉద్యమంలో దళితుల భాగస్వామ్యం, దేశభక్తి, త్యాగాన్ని గుర్తుచేస్తుంది. అసలు ఈ దేశ స్వాతంత్రోద్యమ కాలంలో అనేక పోరాటాలు యుద్ధాలలో అగ్రకులారే నాయకత్వం వహించారు. వారి నాయకత్వంలో జరిగిన అనేక ఉద్యమాలలో మెజారిటీ ప్రజలైన బీసీ ఎస్సీ ఎస్టీలు పోరాటాలు, త్యాగాలు కనుమరుగైనాయి. దేశ నాయకులుగా దళిత, బహుజనులను చూపించకపోవడమే ఇందుకు నిదర్శనం. అందుకే "అంబేద్కర్ చరిత్ర తెలియనివాడు చరిత్ర సృష్టించలేడని" చెబుతాడు. కాబట్టి అట్టడుగు అణగారిన వర్గాలు తమ చరిత్ర తెలుసుకొని, స్ఫూర్తి పొంది, విముక్తి కోసం యుద్ధం చేయాల్సిన అవసరం ఉంది.



సంపతి రమేష్
సామాజిక విశ్లేషకులు
7989579428.

## లడ్తే.. లడ్తే.. ఏ అప్నా దం నిక్లే..

మధుర స్వరంతో వేలాది పాటలతో
కొట్లానుకోట్ల శ్రోతలను అలరించిన
అమర గాయని ఆశా భోంస్లే ఆకాంక్ష
గాతే గాతే దం నిక్లే ఏ మెరి ఆశా హై

పీడిత ప్రజల విముక్తికే తన జీవితం
అంకితం ఇచ్చిన విప్లవ యోధుడూ
భగత్సింగ్ వారసుడు ఆర్కే ఆకాంక్ష
జనంకొరకే జీవిస్తాం మరణిస్తాం కూడా

లడ్ తే.. లడ్ తే..ఏ అప్నా దం నిక్లే

జీవితాల్ని సార్థకం చేసుకోవ్దమంటే
వీర యోధులూ మీకే గదా సాధ్యం
వీరులూ మీ పురిటిళ్ళు పోరాటాలే!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

## అమెరికా-ఇరాన్ శాంతి ప్రయత్నాల వైఫల్యం

# ప్రపంచానికి సంకేతాలు ఏమిటి?



అమెరికా-ఇరాన్ సంబంధాలు గత నాలుగు దశాబ్దాలుగా సంక్షోభం, అనుమానం, వ్యూహాత్మక పోటీ అనే మూడు మూలస్థంభాలపై నిలిచాయి. ఇటీవల జరిగిన శాంతి ప్రయత్నాలు విఫలమవడం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త అనిశ్చితికి దారి తీసింది. ఈ పరిణామంపై అంతర్జాతీయ మీడియా, మేధావులు, రాజకీయ విశ్లేషకులు విభిన్న కోణాల్లో స్పందిస్తున్నారు. ఈ విఫలత కేవలం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సమస్య మాత్రమే కాకుండా, ప్రపంచ శాంతి, ఆర్థిక వ్యవస్థ, భద్రతా వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపే అంశంగా మారింది.

అమెరికా, ఇరాన్ మధ్య ప్రధాన విభేదం అణు కార్యక్రమం చుట్టూ తిరుగుతోంది. జాయింట్ కంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (ఇరాన్ న్యూక్లియర్ ఒప్పందం 2015) ఒక పెద్ద మైలురాయి కాగా, డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 2018లో ఆ ఒప్పందం నుంచి తప్పుకోవడం వల్ల సంబంధాలు మళ్లీ ఉద్రిక్తమయ్యాయి. అంతర్జాతీయ మీడియా సంస్థలు, ముఖ్యంగా బీబీసీ న్యూస్, ది న్యూయార్క్ టైమ్స్ వంటి వేదికలు ఈ చర్యను "వ్యూహాత్మక తప్పిదం"గా విశ్లేషించాయి. వారి అభిప్రాయం ప్రకారం, అమెరికా ఒంటరితనానికి దారి తీస్తూ, ఇరాన్‌ను మరింత కఠిన వైఖరికి నెట్టింది.

ప్రఖ్యాత మేధావి నోమ్ చోమ్స్కీ అభిప్రాయం ప్రకారం, అమెరికా విదేశాంగ విధానం తరచుగా శాంతి కంటే ఆధిపత్యాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ఆయన విశ్లేషణలో, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఇది అంతర్గత అస్థిరతను పెంచుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక గణాంకాల ప్రకారం, అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్ జీడీపీ 2018--2020 మధ్య సుమారు 6--7 పర్సెంట్ వరకు క్షీణించింది.

రాజకీయ విశ్లేషకులు ఈ విఫల శాంతి ప్రయత్నాలను "మిస్డ్ అపార్చునిటీ"గా చూస్తున్నారు. ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్ నివేదిక ప్రకారం, అమెరికా--ఇరాన్ మధ్య నమ్మకం లోపం ప్రధాన అడ్డంకిగా మారింది. ఇరాన్ భావన ప్రకారం, అమెరికా ఒప్పందాలను నిలబెట్టుకోదు; అమెరికా దృష్టిలో, ఇరాన్ ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. ఈ పరస్పర అనుమానం చర్చల విఫలానికి కారణమైంది.

మధ్యప్రాచ్య రాజకీయాలలో ఈ విఫలత ప్రభావం తీవ్రమైంది. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా వంటి దేశాలు ఇరాన్ ప్రభావాన్ని తగ్గించేందుకు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ మీడియా విశ్లేషణలో, ఈ పరిణామం ప్రాంతీయ యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరికలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో చమురు సరఫరా అంతరాయం కలిగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 పర్సెంట్ హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతోంది.

ఇంకా ఒక ముఖ్యమైన కోణం ... ప్రపంచ శక్తి సమీకరణం. చైనా, రష్యా వంటి దేశాలు ఈ పరిస్థితిని తమ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌తో చైనా చేసిన 25 సంవత్సరాల వ్యూహాత్మక ఒప్పందం (సుమారు 400 బిలియన్ డాలర్ల పెట్టుబడులు) ఈ దిశలో ఒక కీలక పరిణామం. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అమెరికా ప్రభావం తగ్గుతున్న ప్రాంతాల్లో చైనా, రష్యా తమ ఆధిపత్యాన్ని పెంచుకునే అవకాశం ఉంది.

అంతర్జాతీయ మేధావులు ఈ విఫలతను "డిప్లొమసీ పరాజయం"గా చూస్తున్నారు. ఫరీద్ జకారియా వంటి విశ్లేషకులు, "సంఘర్షణలు సైనిక పరిష్కారాల ద్వారా కాదు, చర్చల ద్వారానే స్థిరంగా పరిష్కారమవుతాయి" అని హెచ్చరిస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఈ సిద్ధాంతానికి విరుద్ధంగా ఉన్నాయి.

మరొక కీలక అంశం ... మానవతా ప్రభావం. ఆర్థిక ఆంక్షలు, రాజకీయ అస్థిరత కారణంగా ఇరాన్‌లో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగాయి. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, ఇరాన్‌లో ద్రవ్యోల్బణం కొన్ని కాలాల్లో 40 పర్సెంట్ దాటింది. ఇది సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసింది. ఈ పరిస్థితిని మేధావులు "సైలెంట్ క్రైసిస్"గా పేర్కొంటున్నారు.


మొత్తానికి, అమెరికా--ఇరాన్ శాంతి ప్రయత్నాల వైఫల్యం ప్రపంచానికి మూడు ప్రధాన సంకేతాలు ఇస్తోంది. మొదటిది, అంతర్జాతీయ సంబంధాల్లో నమ్మకం కీలకం; అది లేకపోతే ఏ ఒప్పందం నిలబడదు. రెండవది, ఆర్థిక ఆంక్షలు సమస్యలను పరిష్కరించకపోయి, మరింత సంక్లిష్టం చేస్తాయి. మూడవది, శక్తి రాజకీయాలు ఇంకా ప్రపంచాన్ని నియంత్రిస్తున్నాయి.

ఇప్పటికైనా అమెరికా, ఇరాన్ పరస్పర అవగాహనతో ముందుకు సాగకపోతే, ఈ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ప్రపంచ శాంతి, ఆర్థిక స్థిరత్వం కోసం డిప్లొమసీకి మరో అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే, ఈ విఫల శాంతి ప్రయత్నాలు భవిష్యత్తులో మరింత పెద్ద సంక్షోభాలకు నాంది కావచ్చు.చైనా, రష్యా, నార్త్ కొరియా, ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు జోక్యం చేసుకోవాలి.మరీ ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దేశాల ప్రజలు, మేధావులు, రచయితలు, మీడియా శాంతి కోసం కృషి చేయాలి.అమెరికా, ఇజ్రాయెల్ దూకుడు తగ్గించుకోవాలి.చర్చల ద్వారా మరోసారి ప్రయత్నాలు చేస్తునే ఉండాలి.ఇప్పటి వరకు యుద్ధం లో ఉన్న దేశాలతో పాటు ఇతర ప్రపంచ దేశాలకు జరిగిన భౌతిక,మానవ, ఆర్థిక నష్టం చాలు.ఇకనైనా జ్ఞానంతో వ్యవహరించాలి.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496

# జీవితాలను బలి తీసుకుంటున్న రుణయాప్‌లు




రోజురోజుకు రుణ యాప్ ల అరాచకాలు పెరుగుతున్నాయి.తద్వారా ఎంతోమంది బాధితులు ఈ రుణ యాప్ ల మోసాలకు బలవుతున్నారు.అధిక వడ్డీలను వసూలు చేస్తున్న ఈ అక్రమ యాప్ ల బారినపడి, అనేకమంది తమ ప్రాణాలను తీసుకోవడమే కాకుండా తీవ్ర అప్పుల పాలవుతున్నారు. గడిచిన ఐదేళ్లలో రుణ (లోన్) యాప్ ల వ్యాపారం రెట్టింపు కావడంతో వాటి నిర్వాహకుల వేధింపులు కూడా పెరిగాయి. అప్పు తీసుకున్న వారి ఫోన్ నెంబర్లు, వారి ఛాయాచిత్రాలు, వారు ఎక్కడున్నారన్న సమాచారం, వారికి సంబంధించిన వీడియోలతో పాటు,తదితర వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి,వారి నెంబర్లకు పంపించి,బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.చట్టవిరుద్ధ రుణ యాప్ లు,అధిక వడ్డీ రేట్లు వసూలు చేయడం, డబ్బు రికవరీ చేయడానికి బెదిరింపులకు పాల్పడడం వంటి అంశాలపై నిత్యం వివిధ మాధ్యమాలలో ద్వారా చూస్తున్నాం.


ఈ రుణ యాప్ లు చాలా ప్రమాదకరం.రుణయాప్ ద్వారా లోన్ ఇచ్చే ముందు మనకు సంబంధించిన అన్ని వివరాలు తీసుకుంటారు. వీటికి ఎలాంటి అనుమతులు ఉండవు.ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని, క్షణాల్లో రుణాలు అందిస్తూనే అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాయి. రుణాలు చెల్లించడంలో విఫలమైన వారిపై బెదిరింపులకు పాల్పడుతూ వారి ప్రాణాలను సైతం బలి తీసుకుంటున్నాయి. ఇలా వ్యక్తిగత సమాచారం సేకరించడం,వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమే కాక భద్రతకు ప్రమాదకరమని కేంద్రం హెచ్చరిస్తున్నప్పటికిని రుణయాప్ ల దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదిక ప్రకారం 600 కు పైగా ఫేక్ రుణ యాప్ లు అందుబాటులో ఉన్నాయని, రుణాల కోసం ఏదైనా యాప్ ను డౌన్లోడ్ చేసుకునే ముందు యాప్ పేరు, దాని రేటింగ్, యాప్ స్టోర్ లో సమీక్షలు, ఇతర వివరాలను పరిశీలించాలి.భారతీయ రిజర్వు బ్యాంకు నుంచి అనుమతి పొందిన బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్ బి ఎఫ్ సి) లతో ఒప్పందం కుదుర్చుకున్న యాప్ లు రుణాలు ఇవ్వాలి. కానీ ఇక్కడ మూతపడిన ఎన్బిఎఫ్సీలతో పొత్తు పెట్టుకుని ఆన్లైన్ రుణాల పేరిట అడ్డగోలుగా దందాలు చేస్తున్నాయి. బీద, మధ్యతరగతి కుటుంబాలు, చిరు వ్యాపారులు, యువతకు ఎలాంటి హామీ లేకుండా తక్కువ అప్పులు ఇచ్చి,అధిక వడ్డీని వసూలు చేస్తున్నాయి. వడ్డీలు కట్టలేని పరిస్థితి ఉన్నప్పుడు వారు వారి అమూల్యమైనటువంటి ప్రాణాలను తీసుకుంటున్నారు.కానరాని లోకాలకు వెళ్తున్నారు.రుణ యాపుల నిర్వాహకుల వేధింపులతో 2021 లో దేశవ్యాప్తంగా 68 మంది ఆత్మహత్య చేసుకుంటే తెలంగాణలో ఈ రుణ యాపుల వేధింపులతో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు.ఒక్క ఏడాదిలోనే 2500 ఫిర్యాదులు పోలీస్ స్టేషన్లో నమోదు కాగా ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు విచారణ చేపట్టి వీటి వెనుక కీలక పాత్ర పోషిస్తున్న చైనా జాతీయులను కూడా అరెస్టు చేసినట్లు ప్రకటించారు.పెట్టుబడుల పేరిట మోసాలకు పాల్పడుతూ రూ. 903 కోట్లు కొట్టేసి అడ్డదారిలో చైనాకు పంపిన ఇద్దరిని పట్టుకున్న ఉదాంతం హైదరాబాదులో వెలుగు చూసింది.

ప్రపంచవ్యాప్తంగా ఆన్ లైన్ లో రుణ యాపుల కార్యకలాపాలు 10% ఉండగా,భారత్ లో 45%, చైనాలో 28%, ఫిలిప్పీన్స్, మలేషియా,థాయిలాండ్లలో 10% ఉన్నాయి. యూట్యూబ్ వీడియోల లింకుల ద్వారా, ప్లే స్టోర్ ల ద్వారా, ఈ యాప్లు పంపించి కొన్ని కోట్లు కొల్లగొట్టిన వారు ఉన్నారు. వారిలో అధిక శాతం చైనా దేశానికి చెందినవారు.ఆన్లైన్ మోసాలు రుణయాపుల ద్వారా సంపాదించిన డబ్బులను దొంగ పత్రాలతో ఏర్పాటు చేసిన కంపెనీల ద్వారా విదేశాలకు తరలించి, అక్కడి నుండి చైనాకు తరలిస్తున్నారు. రుణ యాపుల ద్వారా అప్పు తీసుకున్న వారు మీ ఇంట్లో కుటుంబ సభ్యులు గాని, తల్లిదండ్రులకు గాని, భార్యాబిడ్డలకు గాని తెలియజేయాలి.ఒత్తిళ్లకు తలోగ్గి అగాయిత్యాలు చేసుకోకుండా, రుణయాప్ ల వారు ఒత్తిడి తెస్తే పోలీస్ వారిని,సైబర్ క్రైమ్ వారిని, సంప్రదించి ఫిర్యాదు చేయాలి. రుణయాప్ ల ద్వారా అప్పులు తీసుకోవడం మాని, ఆర్బిఐ నిబంధనల ప్రకారం పని చేసే సంస్థల వద్ద మాత్రమే అప్పు తీసుకోవాలి. ఇంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఈ కాలంలో జాతీయ సైబర్ నేరాల ఫోరెన్సిక్ సేవలు, సైబర్ క్రైమ్ పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆన్లైన్ మోసాలను నియంత్రించడంలో పాత్ర వహిస్తున్నారు. ప్రాణం ఉంటే అప్పు ఈరోజు కాకపోతే రేపు కూడా తీర్చవచ్చు కానీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి, అఘాయిత్యాలు చేసుకోకుండా, మనోర్భరంతో ఉండి మీ కుటుంబానికి బాసటగా నిలవండి.



డాక్టర్ మోటె చిరంజీవి
సెల్ : 9949194327

# స్ఫూర్తి ప్రదాతలు




విద్యార్థులు, యువకులు తమ తమ రంగాలలో వికాసం చెందాలంటే ముఖ్యంగా ఆయా రంగాలలో రాణించి సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల జీవిత చరిత్రలను అధ్యయనం చేసి స్ఫూర్తిని పొందాలి. ముఖ్యంగా విద్యారంగం వ్యాపారాత్మకంగా మారిన తరువాత నేటి యువతకు తమ "కెరీర్"పై ఉన్నంత శ్రద్ధ సామాజిక బాధ్యత గల"క్యారెక్టర్" పై లేకపోవడం దురదృష్టకరం. పైగా అదొక లోపంగా కనిపిస్తుంది. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని శిక్షణ సంస్థలు వ్యక్తిత్వ వికాసం, సంభాషణ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే నెపంతో లక్షలాది రూపాయలను దండుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక స్పృహ, చైతన్య స్ఫూర్తిని కలిగించేందుకు ప్రముఖ వామపక్ష నాయకులు జి. రాములు ఆయననే సిపిఎం రాములు అని కూడా అంటారు. ఆయన రచించిన "స్ఫూర్తి ప్రదాతలు" అనే పుస్తకం యువతకు దిక్సూచిగా నిలుస్తుంది. రాములు తమ ఉద్యమ నేపథ్యంలో భాగంగా ఆయా ప్రదేశాలకు వెళ్ళినప్పుడు తారసపడిన వ్యక్తులను గురించి వారి నేపథ్యాన్ని గురించి సమాజానికి వారు చేసిన సేవ దాని పరిణామాన్ని గురించి శాస్త్రీయంగా విశ్లేషిస్తూ "పదుగు రాడు మాట పాడి యౌనట్లు" ఇందులో పది మందిని గురించి వివరించారు. వారిలో సుందరయ్య, ఓంకార్ వంటి నాయకులు ఎస్. ఆర్. శంకరన్, కాకి మాధవరావు వంటి ఐ.ఏ.ఎస్ అధికారులు, జస్టిస్ చంద్రకుమార్ వంటి న్యాయమూర్తులు, డాక్టర్ ప్రసాద్ రావు వంటి వైద్యులు, జి.రాంరెడ్డి, కంచ ఐలయ్య లాంటి విద్యావేత్తలు, ప్రజా యుద్ధ నౌక గద్దర్, సామాజిక ఉద్యమకారులు కత్తి పద్మారావు వంటి సాహితీ మూర్తులు ఇందులో ఉన్నారు. వీళ్లందరితో తనకున్న అనుభవాలను సమాజానికి వాళ్లు చేసిన సేవలను వారి వ్యక్తిత్వాలను విశ్లేషిస్తూ రాములు గారు వ్యాసాలు రాశారు. సుమారు ఐదున్నర దశాబ్దాలకు పైగా వామపక్ష రాజకీయాలతో మమేకమైన రాములు మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం బలపాల అనే గ్రామంలో దళిత పేద కుటుంబంలో జన్మించారు. చదువుకునే రోజుల నుంచే అభ్యుదయ భావజాలంతో వామపక్ష రాజకీయాలతో మమేకమై అందులో క్రియాశీలంగా వ్యవహరిస్తూ పార్టీ అప్పగించిన పలు బాధ్యతలను నిర్వహించారు. 1975లో దేశంలో ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మే ఫైనల్ చదువుతున్న రాములు నిర్బంధం కారణంగా అర్ధాంతరంగా పరీక్షల మధ్యలోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. వామపక్ష రాజకీయాలు వర్గ దృక్పథం నుంచే కాకుండా దేశంలో వేళ్ళుని కొనిపోయిన కుల కుల వ్యవస్థ కోణంలో నుంచి సమస్యలను పరిశీలించాలని బలంగా ప్రతిపాదించిన వ్యక్తి రాములు. ఈ నేపథ్యంలో నుంచే పుట్టుకొని వచ్చిందే లాల్-నీల్ ఐక్యత. వరంగల్ జిల్లాలోని సిపిఎం పార్టీలో నాటి నగర కమిటీ కార్యదర్శి భగవాన్ దాస్ కు అప్పటి నర్సంపేట శాసనసభ్యులు ఎం. ఓంకార్ కు మధ్య ఉన్న రాజకీయ వైరం కారణంగా ఇతనిని నగర కమిటీలోకి తీసుకోకపోవడాన్ని గురించి సుందరయ్య గారు ప్రస్తావిస్తూ"నిరుపేద దళిత కుటుంబానికి చెందిన రాములు రిజర్వేషన్ అవకాశం వలన ప్రభుత్వ ఉద్యోగ అవకాశాన్ని వదులుకొని పార్టీ ఉద్యమంలోకి వచ్చాడని చెబుతూ చివరకు నగర కమిటీకి రాష్ట్ర కమిటీ లోబడి ఉండాలా? లేక రాష్ట్ర కమిటీకి మీ నగర కమిటీ లోబడి ఉండాలా? అని ఘాటుగా స్పందించినట్లు చెప్పారు. దీనిని బట్టి సుందరయ్య గారికి రాములు వంటి సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కార్యకర్తల పట్ల, దళిత వర్గం పట్ల ఆయనకు ఉన్న గౌరవం గొప్పదని తెలుస్తుంది. అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్గా పనిచేసిన కాకి మాధవరావు గండు ఐలయ్య అనే గౌడ్ ఆధ్వర్యంలో గీత కార్మిక సహకార సంఘాలను ఏర్పాటు చేసి దొరల దౌర్జన్యాలను దోపిడీకి అడ్డుకట్ట వేశాడని ముఖ్యంగా రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీల సప్లై అమలుకు వారి ఆధ్వర్యంలోనే కృషి జరిగిందని రాములు మరో వ్యాసంలో వివరించారు. త్యాగానికి మరో పేరు ఎస్సార్ శంకరన్ అనే వ్యాసంలో ఆయన గొప్పతనాన్ని గురించి రాస్తూ"అధికార యంత్రాంగం అనే ఇనుము నుండి సంక్షేమ తైలాన్ని పిండిన మానవతావాది" అని కొనియాడారు. నర్సంపేట ను రాజకీయ కేంద్రంగా చేసుకొని అనేకసార్లు శాసన సభ్యునిగా గెలిచిన మద్దికాయల ఓంకార్ రాష్ట్ర పార్టీతో తనకున్న అభిప్రాయ భేదాలను బయటపెడుతూ 90 పేజీల లేఖను రాయడంతో పాటు"మరి అంత గొప్ప ఎత్తుగడలు అనుసరించే పార్టీ ఆంధ్ర ప్రాంతంలో ఎందుకు పెరగలేదు? తెలంగాణ ప్రాంతంలో మనం నిలబడి పోరాడుతున్నాం కనుక మంచి ఫలితాలు వచ్చాయని" చెప్పినారట. ఆ విభేదాల కారణంగానే ఆయన సిపిఎం నుండి విడిపోయి ఎం సి పి ఐ ని ఏర్పాటు చేసుకున్నారు. ఏమైనా వామపక్ష రాజకీయాలలో ఓంకార్ ది చెరగని ముద్ర. జస్టిస్ చంద్రకుమార్ గారు మానవతా విలువలకు కట్టుబడిన వ్యక్తులు. ప్రజా సమస్యల పట్ల నిబద్ధత నిమగ్నత కలిగిన వారు. హనుమకొండలో నాడు హయగ్రీవాచారి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పిటిషనర్ గా రాములు వేసిన కేసును హైకోర్టులో వాదించడానికి ఆయన పూనుకోవడం, తరువాత ఆ భూమిని ప్రజాపరం చేయటంలో న్యాయవాదిగా ఆయన చేసిన కృషిని రాములు ఈ వ్యాసంలో ప్రస్తుతించారు. సమాజంలో మానవీయ విలువలను పెంపొందించడానికి ఆయన నిరంతరం తన రచనల ద్వారా కృషి చేస్తూనే ఉన్నారు. ఉన్నత విద్యావేత్తగా, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా సార్వత్రిక విశ్వవిద్యాలయాల రూపశిల్పిగా, యుజిసి చైర్మన్ గా పేరొందిన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి ఉత్తమ వ్యక్తిత్వ సంపన్నులు. ఆయనలోని మానవతా కోణాన్ని ఆవిష్కరిస్తూ రాములు తను ఎమర్జెన్సీ కారణంగా పరీక్షలు రాయలేకపోవడం వలన తదనంతర కాలంలో తనకై ప్రత్యేకంగా పరీక్షలు ఏర్పాటు చేయడం, రిజర్వేషన్ కోటాలో విశ్వవిద్యాలయంలో అవకాశం ఉన్న ఉద్యోగంలో చేరమని, అందుకు అవసరమైన ఆర్డర్స్ తీసుకోమని రమ్మని చెప్పటం రామ్ రెడ్డి గారి ఉత్తమ వ్యక్తిత్వానికి నిదర్శనంగా చెప్పారు. నేటితరం మేధావులకు, పరిపాలన వ్యక్తులకు ఈ సంఘటన స్ఫూర్తిని అందిస్తుంది అనుకుంటాను. అలాగే ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, దేశంలో గుణాత్మకమైన మార్పు రావాలంటే లాల్ – నీల్ మధ్యన ఐక్యత అవసరమని తన వ్యాసాల ద్వారా ఉపన్యాసాల ద్వారా ప్రబోధిస్తున్న మేధావి కంచ ఐలయ్య."సమాజంలో ఆర్థిక అంతరాలు తొలగాలని కుల నిర్మూలన జరగాలని స్త్రీ పురుష సమానత్వం రావాలని మార్క్స్ అంబేద్కర్ వాదుల మధ్యన ఉన్నది శత్రు వైరుధ్యం కాదని అది మిత్ర వైరుధ్యమని ప్రగాఢంగా విశ్వసించి ప్రబోధించిన ప్రజా కళాకారుడు గద్దర్ అని రాములు అభివర్ణించారు. అలాగే ఇటు సాహిత్యకారుడుగా అటు సామాజిక ఉద్యమ కారుడుగా పేరు గాంచిన కత్తి పద్మారావు అంబేద్కర్ వాదులు, సామాజిక ఉద్యమకారులు, వామపక్షాలు, హేతువాదులు, అభ్యుదయ శక్తులన్నీ కలిస్తేనే సామాజిక మార్పు సాధ్యమని గుర్తు చేసినట్లు రాములు వివరించారు. అలాగే ప్రజా వైద్యులుగా డాక్టర్ దాసరి ప్రసాద్ రావు గారు అటు నిమ్స్ కు, బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. ముఖ్యంగా లాల్– నీల్ మధ్య ఐక్యతనే ఇరుసుగా కలిగిన "స్ఫూర్తి ప్రదాతలు" అనే పుస్తకం పాఠకుల మదిలోనూతన ఆలోచనల ఆవిష్కరణకు, ఆచరణకు మార్గదర్శకంగా నిలుస్తుంది.



డా. శంకరమంచి శ్యాంప్రసాద్
9989148305

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
13 ఏప్రిల్ 2026

# నర్మెటలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**నంగునూరు, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో 250 కోట్ల వ్యయంతో జునోజోల్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ బయోగ్యాస్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం, ఆదివారం రోజు శంకుస్థాపన చేయడం సంతోషదాయకమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఫ్యాక్టరీ భూమి పూజ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అర్థవంతమైన స్వచ్ఛ ఇంధన కార్యక్రమాన్ని నిర్మించాలనే లక్ష్యంతో నాగ శరత్ రాయపాటీ మా వద్దకు వచ్చారు. ఇది హైదరాబాదుకి పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించాలని మేము భావించాం. దీన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయనకు తెలంగాణ ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు లభిస్తుంది అని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఆయనకున్న నిబద్ధత ఈ రంగంపై ఉన్న అవగాహన సరైన బాగా స్వాములను ఎగతాటిపై తీసుకు రాగల సామర్థ్యంతో జూనో జోల్ బయో ఫ్యూయల్ కింద ఈ ప్రాజెక్టు ప్రారంభించారు అని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ 2014 -15లో టిఎస్ ఐ ఐ సి కి 100 ఎకరాలు స్థలం కేటాయించడం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు జిల్లాల రాకతోనే ఈ ప్రాంతంలో అటు వ్యవసాయం ఇటు పారిశ్రామిక విప్లవం సాధ్యమవుతుందని. ఈ బయోగ్ గ్యాస్ ప్లాంట్ ద్వారా సుమారు 500 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయి అన్నారు. ఒకప్పుడు యాసంగి వస్తే సిద్దిపేట ప్రాంతంలో 8 వేల ఎకరాల మాత్రమే వరి సాగు జరిగేదని, కాళేశ్వరం జలాలు రాకతో 85వేల ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని, ఈ ఫ్యాక్టరీ ముడిసారుకుగా వరిగడ్డి అవసర పడుతుందని, ఈ ప్రాంతా రైతులకు గడ్డి ద్వారా కూడా డబ్బులు వస్తాయని ఈ ఫ్యాక్టరీ కొనుగోలు చేస్తున్నారన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలోజూనో జౌల్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ శ్రీ నాగశరత్ రాయపాటి మాట్లాడుతూ, "భారతదేశపు స్వచ్ఛమైన, స్వావలంబన కలిగిన ఇంధన రంగపు తదుపరి దశ నిర్మాణ దిశగా ఒక కీలకమైన ముందడుగుగా నిలిచే ఈ ప్రాజెక్టు ప్రారంభాన్ని గుర్తించడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశం తప్పనిసరి సిబిజి మిశ్రమం దిశగా వెళ్తుండటం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం వైపు పయనిస్తున్నందున, విస్తరించగల, విశ్వసనీయమైన బయో-ఎనర్జీ మౌలిక సదుపాయాలు అత్యంత కీలకం కానున్నాయి. మా క్లస్టర్-ఆధారిత విధానం, పెద్ద ఎత్తున స్థిరత్వాన్ని అందించడానికి, వ్యవసాయ వ్యర్థాల నుండి విలువను వెలికితీయడానికి, భారతదేశపు ఇంధన భద్రతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అర్థవంతంగా దోహదపడేలా రూపొందించబడింది" అని అన్నారు. విధానపరమైన మద్దతు మరియు శిలాజ ఇంధనాలకు స్థిరమైన ప్రత్యామ్నాయాల ఆవశ్యకత కారణంగా భారతదేశ బయో-ఎనర్జీ రంగం వేగంగా పురోగమిస్తోంది. అయితే, పెద్ద ఎత్తున దీనిని అమలు చేయడానికి ఆధారపడతగిన రీతిలో ఫీడ్‌స్టాక్ సరఫరా, మౌలిక సదుపాయాల అనుసంధానం ఆచరణీయమైన ఆఫ్టేక్ యంత్రాంగాలు అవసరం. జూనో జౌల్ యొక్క క్లస్టర్-ఆధారిత విధానం, విస్తరణ, సామర్థ్యం మరియు స్థిరమైన సరఫరాను సాధ్యం చేయడం ద్వారా ఈ సవాళ్లను పరిష్కరిస్తుంది, భవిష్యత్ అభివృద్ధికి ఈ ప్రాజెక్టును అనుకరించదగిన నమూనాగా నిలుపుతుంది. గోబర్ధన్ పథకం, భారతదేశ స్వచ్ఛ ఇంధన పరివర్తన లక్ష్యాలు వంటి జాతీయ కార్యక్రమాలకు అనుగుణంగా, కీలక ప్రాంతాలలో సమీకృత జీవ-శక్తి మౌలిక సదుపాయాలను నిర్మించాలనే విస్తృత దృక్పథానికి నర్మెట్ట కేంద్రం నాంది పలుకుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు ప్రేమ చంద్ర న్, మాజీ పార్లమెంట్ సభ్యులు రాయపాటి సాంబశివరావు, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, టీజీఐఐసీ ఎండి ఐఏఎస్ శశాంక తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఆర్ఏసి లిమిటెడ్ మాజీ చైర్మన్ రమేష్, ప్రధానమంత్రి కార్యాలయ మాజీ ఓఎస్డి పిల్లాయి, పలువురు ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు, బి ఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వనజీవి రామయ్య సినీ బృందానికి ఘన సన్మానం

- చేర్యాల వాసులకు అరుదైన గౌరవం



**చేర్యాల, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** ప్రకృతి పరిరక్షకుడు, పర్యావరణ పరిపోషకుడు దరిపల్లి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా ప్రముఖ సినీ దర్శకుడు వేముగంటి దర్శకత్వంలో అర్జున పట్ల సర్పంచ్ లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మాతగా ప్రకృతి పరిరక్షణ ఫిలిమ్స్ బ్యానర్ పై నిర్మించిన పద్మశ్రీ వనజీవి రామయ్య చిత్రానికి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉత్తమ చలన చిత్రాలకు అందిస్తున్న గద్దర్ అవార్డు సాధించిన సందర్భంగా, ఖమ్మం, బద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పారెస్టు అధికారులు సంయుక్తంగా చిత్రం యూనిట్ సభ్యులను గత గురువారం ఖమ్మం పట్టణంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రశంసా పత్రాలు అందించి, దరిపల్లి రామయ్య పర్యావరణ పరిరక్షణకు జీవితాంతం మొక్కలు నాటి న త్యాగనిరతిని కొనియాడారు. ఖమ్మం పారెస్టు అధికారి సిద్ధార్థ విక్రం సింగ్, బద్రాద్రి జిల్లా అధికారి బీమ్ నాయక్ పాల్గొనగా, సన్మానం పొందిన వారిలో చిత్ర దర్శకుడు వేముగంటి, కె మరామెన్ తోట రమణ, సిద్దిపేట జిల్లా, చేర్యాల మండలం, అర్జున్ పట్ల గ్రామ సర్పంచి మనజీవి రామయ్య చిత్ర నిర్మాత లింగంపల్లి చంద్రశేఖర్, వేచరేణి గ్రామ ఆడబిడ్డ హీరోయిన్ నాగరాణి, సినీ గేయ రచయిత ఘనయాది ఆకునూరు(మాసిరెడ్డిపల్లి) తో పాటు సినీ బృంద సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు, రెవిన్యూ అధికారులు, విద్యాధికారులు, పోలీస్ అధికారులు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మేధావుల ముసుగులో అర్బన్ నక్సలైట్లు

- ఎంపీ రఘునందన్ రావు



**నర్సాపూర్, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు. ఆదివారం బిజెపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 శాతం కేంద్ర ప్రభుత్వం సక్సెస్ అయిందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శనివారం హైదరాబాద్ నగరంలో కొంతమంది మేధావులను అనుకునేవారు కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్ షాను కించపరిచే విధంగా మాట్లాడటం కాకుండా ఆయనపై కేసు నమోదు చేయాలని సరికాదని అన్నారు మేధావులమని ఊహించుకుని కొంతమంది మీడియాలో రావడం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు సమాజంలో యువతకు నక్సలిజం వైపు మళ్లించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వారే అర్బన్ నక్సలైట్లని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్డాస్ మల్లేష్ గౌడ్, కౌన్సిలర్లు శ్రీకాంత్ ,నిరంజన్ దాస్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , రమేష్ గౌడ్ , సంఘసాని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## భ్రమారంభ మల్లికార్జున స్వామి కటాక్షం అందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- భక్తులతో కళకళలాడిన కళ్యాణ మహోత్సవం
- గొల్లగూడెంలో సందడి



**సంగారెడ్డి, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా గొల్లగూడెం 9వ వార్డులో శ్రీ శ్రీ శ్రీ భ్రమారంభ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి స్థానికులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భ్రమారంభ మల్లికార్జున స్వామి వారి కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కళ్యాణ మహోత్సవంలో డా.శ్రీహరి,పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, నాయకులు వేణుగోపాల స్వామి, కౌన్సిలర్ లాడే మల్లేశం,9 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి లాడే బాలు,కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు కర్కం మల్లేశం, కర్కం శ్రీశైలం, ధన లాడే మల్లేశం, శ్రీకాంత్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్‌సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగల మని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్)లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటివి జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

## సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో 5 చోట్ల జంక్షన్‌లు ఏర్పాటు చేయాలి

- జంక్షన్‌లు ఆకర్షణీయంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దండి
- హెచ్ఎండిఏ అధికారులను సూచించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం అవుతున్నాయి. రూ. 13 కోట్లతో చేపడుతున్న ఈ బై పాస్ రోడ్ లో ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు చేయాలని హెచ్ఎండిఏ అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో ఐబి గెస్ట్ హౌస్ మొదలుకుని బసవేశ్వర చౌక్ వరకు ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు చేయాలని జగ్గారెడ్డి ఆదివారం అధికారులకు సూచించారు బైపాస్ రోడ్డు విస్తీర్ణ పనులను ఆయన పరిశీలించారు. హెచ్ఎంటిఏ అధికారులతో కలిసి జంక్షన్ లు ఏర్పాటయ్యే ఐబి చౌరస్తా ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ చౌరస్తా ను పరిశీలించారు. జంక్షన్ లు ఏవిధంగా ఏర్పాటు చేయాలి, జంక్షన్‌లలో సుందరీకరణ పనులు చేయాలని, జంక్షన్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా జంక్షన్ ల డిజైన్ లు ఉండాలని కన్సల్టెన్సీ ప్రతినిధుల ను ఆదేశించారు. జంక్షన్ లు ఏర్పాటు విషయం లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి కావాలని అధికారులకు జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ , హెచ్ఎండిఏ ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లకల్‌లో దొంగల హల్‌చల్

- అర్ధరాత్రి బంగారం షాపులో చోరీకి యత్నం
- ఒకరు పట్టుబడగా మరొకరు పరార్
- యజమానికి స్వల్ప గాయాలు




**మనోహరాబాద్, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా మనోహరబాద్ మండలంలోని కల్లకాల్ గ్రామంలో దొంగల హల్ చల్ అర్ధరాత్రి బంగారం దుకాణంలో ఇద్దరు వ్యక్తులు చోరీకి ప్రయత్నించగా దుకాణం యజమాని కనిపెట్టి పట్టుకోగా ఒకరు దొరకగా ఇంకొకరు యజమాని తలపై కొట్టి పారిపోయారు స్థానికుల వివరాల ప్రకారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు భవాని జ్యువెలర్స్ బంగారం దుకాణంలో చోరీకి యత్నించగా దుకాణం యజమాని గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా ఒకరు పట్టుబడగా మరొకరు పరారీలో ఉన్నాడు ఈ ఘటనలో యజమానికి స్వల్ప గాయాలైనట్టు సమాచారం దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు మహారాష్ట్రకు చెందిన వారిగా అనుమానిస్తున్నారు ఎటువంటి బంగారు ఆభరణాల అపహరణకు గురి కాలేదు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు యజమాని ఓ ప్రైవేట్ దావఖాన లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

## స్వశక్తితో యువత ముందుకు సాగాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**పుల్కల్, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** యువత స్వశక్తితో ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మధుమాణిక్యం చౌరస్తాలో మిన్పూర్ గ్రామానికి చెందిన నగేష్ టి 24 అవర్స్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా మంత్రి పై విధంగా మాట్లాడారు. ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తనకాలపై నిలబడేలా యువత స్ఫూర్తి పొందాలన్నారు. నగేష్ సొంతంగా బిజినెస్ ప్రారంభించడం మిగతా యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్ధన్, రామచంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు ఉదయ్ కుమార్, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేయాలి

- రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ



**నారాయణపేట, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** బిజెపిని బూత్ స్థాయి నుండి పటిష్టం చేయాలని బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయి ప్రజలకు అందేలా పని చేసి రాష్ట్రంలో బిజెపి అధికారమే లక్ష్యంగా పని చేయాలని పిలుపు నిచ్చారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో పండిత్ దిన్ దయాళ్ ఉపాధ్యాయ మహా ప్రశిక్షణ అభియాన్ 2026 నా రెండు రోజుల కార్యశాల సమావేశం జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ లో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పగడకుల శ్రీనివాస్, ముఖ్య వక్తలు, మున్సిపల్ చైర్మన్ శ్వేతా యాదవ్, వైస్ ఛైర్మన్ మంజులా జిఆర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, సర్పంచ్, ఉపసర్పంచ్, రాష్ట్ర, జిల్లా, నాయకులు, బూత్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెదక్ నర్సింగ్ కళాశాల సందర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి



**మెదక్, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలను మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు ఎం పద్మ దేవేందర్ రెడ్డి ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఐఈజు)కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. 120 మంది విద్యార్థులకు ఒకే టాయిలెట్ ఉండటం దురదృష్టకరమని అన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని, కూలిపోయిన కూరగాయలతో వంటలు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థుల నుంచి అదనపు మిస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హెచ్చరించారు.వారం రోజుల్లోనే కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వం, అధికారులకు గడువు విధించారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం వాటిలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. విద్యార్థులు మంచి శిక్షణ పొందితే భవిష్యత్తులో సమాజానికి మెరుగైన సేవలు అందిస్తారని పేర్కొన్నారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, కౌన్సిలర్లు బట్టి ఉదయ్, దీపక్ కుమార్, నాయకులు లింగా రెడ్డి, సురేందర్ గౌడ్,కిష్ట గౌడ్,మాయ మల్లేశం ,ఆర్కే శ్రీనివాస్, సంతోష్, సాయి కుమార్,నవీన్, బాలరాజు, కిరణ్, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

## పేదల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యం

▫ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 12, (జనంసాక్షి) :** పేదల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యం తోనే సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఆయన బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లిలో సిలోజు మౌనిక – మనోజ్ చారి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్నారు. సిలోజు మౌనిక – మనోజ్ చారి ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ప్రభుత్వం నుంచి మంజూరైన అయిదు లక్షల ఆర్థిక సాయంతో గృహ నిర్మాణం పూర్తి చేశారు. గృహప్రవేశానికి ఎమ్మెల్యే వినోద్ ముఖ్య అతిధిగా పాల్గొని దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. లబ్ధిదారు దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, దావ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ 3వ ర్యాంక్

▫ రాణించిన మోరే ట్రైలోక్య నాథ్ రెడ్డి

▫ విద్యే విజయానికి మార్గం..యువతే దేశానికి భవిష్యత్తు

▫ సామాజికవేత్తలు ఎర్రబెల్లి కోటేశ్వర్ రావు, వడిజ ఆనంద్ రావు

▫ ఇంటర్ స్టేట్ టాపర్ లో రాణించిన కుమారునికి స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్న తల్లిదండ్రులు



**మొగుళ్లపల్లి, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ 3వ ర్యాంకర్ గా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మోరే ట్రైలోక్య నాథ్ రెడ్డి రాణించి పుట్టిన ఊరికి..కనిపెంచిన తల్లిదండ్రులకు..విద్య నేర్పిన గురువులకు..తోటి స్నేహితులకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టాడు. మొగుళ్లపల్లి మండలంలో మోరే తిరుమల-రవీందర్ రెడ్డి దంపతులకు మొదటి సంతానంగా జన్మించిన మోరే ట్రైలోక్య నాథ్ రెడ్డి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఎస్వీ పాఠశాల పర్లపల్లిలో, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆర్బిట్ హైస్కూల్ బావుపేట హసన్ పర్తిలో విద్యనభ్యసించి, పదవ తరగతిలో 600 మార్కులకు గాను 561 మార్కులు సాధించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా 2వ ర్యాంకర్ గా వెలుగొంది..ఎంతోమంది విద్యార్థులకు ప్రేరణగా నిలిచాడు. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం నారాయణ కాలేజీ, మాదాపూర్ బాసర శరణి ఖాదంబరీ టూ క్యాంపస్ లో చదివి 470 మార్కులకు 467 మార్కులు సాధించి స్టేట్ 3వ ర్యాంకర్ గా రాణిస్తూ..సరస్వతీ పుత్రుడిగా విద్యారంగంలో దూసుకెళుతున్నాడు. కాగా ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ 3వ ర్యాంక్ ఎంపీసీలో రాణించినందుకు తల్లిదండ్రులు స్వీట్లు తినిపించి.. సంబరాలు చేసుకున్నారు.

**విద్యే విజయానికి మార్గం..యువతే దేశానికి భవిష్యత్తు : సామాజికవేత్తలు ఎర్రబెల్లి కోటేశ్వర్ రావు, వడిజ ఆనంద్ రావు**

విద్యే విజయానికి మార్గమని..యువతే దేశానికి భవిష్యత్తని, కష్టం చేసిన వారికే ఫలితం దక్కుతుందని..పట్టుదల ఉన్న వారికే విజయం వరిస్తుందని..ఓటమి ఒక పాఠం మాత్రమే అయితే..అది విజయం చివరి గమ్యమవుతుందని సామాజికవేత్తలు ఎర్రబెల్లి కోటేశ్వర్ రావు, వడిజ ఆనంద్ రావులు అన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ 3వ ర్యాంకర్ గా రాణించిన మోరే ట్రైలోక్య నాథ్ రెడ్డిని వారు అభినందించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని, తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి కష్టపడి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. ఇలాంటి ప్రతిభావంతులైన యువత..మన ప్రాంత భవిష్యత్తును నిర్మించే శక్తిగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇక్కడితో ఆగిపోకుండా మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో స్థిరమైన మార్పు తీసుకు రాగలమని, యువత తమ ప్రతిభను సానుకూల దిశగా మలచాలని సూచించారు. అలాగే ఆశించిన ఫలితాలు రాని విద్యార్థులు నిరుత్సాహానికి లోనవ్వకుండా..ఓటమిని విజయానికి తొలిమెట్టుగా భావించి..మరింత పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఓటమి ఒక పాఠమని, భవిష్యత్తులో గొప్ప విజయాలకు దారితీస్తుందని తెలిపారు. చివరగా ప్రతి విద్యార్థి తన కుటుంబానికి మాత్రమే కాకుండా తన గ్రామానికి, ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని, సమాజంలో మంచి మార్పు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## రాష్ట్ర డీజీపీ పర్యటనలో పలు కార్యక్రమాలు ప్రారంభం



**రెబ్బెన, ఏప్రిల్ 12 (జనంసాక్షి):** రెబ్బెన మండలంలోని పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆధునిక గ్రంథాలయంగా రూపాంతరం చేసి ఆదివారం రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఇది ఉపయోగకరంగా ఉండనుంది. డీజీపీ మాట్లాడుతూ గ్రామీణ యువతకు మెరుగైన చదువు వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అవసరమైన పుస్తకాలు, సాధన మెటీరియల్ ఒకే చోట అందుబాటులో ఉంచి యువత విజయానికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు ప్రస్తుత వ్యవహారాలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన గ్రంథాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఎఎస్పీ చిత్తరంజన్, సీఐ సంజయ్, ఎస్ఐ వెంకటకృష్ణతో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బైక్ దొంగతనం.. నిందితుడు అరెస్ట్



**టేకుమట్ల ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేరాల నియంత్రణలో భాగంగా టేకుమట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సి.ఐ మల్లేష్ పర్యవేక్షణలో, ఎస్.ఐ జి అమూల్య సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల సమయంలో నిందితుడు గుడిదే గోపి అలియాస్ తేజ (40 సం॥లు, గౌడ, కూలి, నివాసం: చందూర్లపాడు గ్రామం కృష్ణాజిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం) 11-04-2026 ఉదయం సుమారు 10:00 గంటలకు టేకుమట్ల గ్రామ శివారులోని పోచమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, నిందితుడు మేస్త్రి పని కోసం టేకుమట్ల మండలంలోని గర్మిళ్ల పల్లి గ్రామానికి వచ్చి మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో నల్లబెల్లి రవీందర్ ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న హీరో హోండా గ్లామర్ బైకు తాళం అదే బైక్ ముందు ట్యాంక్ కవర్ లో ఉండడం చూసి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుండి బైకును స్వాధీనం చేసుకొని, సీజ్ చేసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ మల్లేష్ యాదవ్ ఎస్సై జి అమూల్య తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలు అపరిచిత వ్యక్తులను పనిలో పెట్టుకునే ముందు వారి పూర్తి వివరాలు తప్పనిసరిగా తెలుసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన గురుకులాలు

**పాలకుర్తి, ఏప్రిల్ 12(జనంసాక్షి)** ఇంటర్మీడియట్ ఫలితాల్లో గురుకుల కళాశాలలు అద్భుతమైన సత్తాచాటాయి. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేయడంతో అత్యధిక శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాయి. మండల కేంద్రంలోని తెలంగాణ సాం ఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలల్లో మొదటి సంవత్సరం 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాదించగా, ఇంటర్ రెండో సంవత్సరంలో 97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చేగూరి స్నేహిత, ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) లో 470 మార్కులకు గాను 450 మార్కులు సాదించగా, బైపీసీలో మొదటి సంవత్సరంలో సట్ల అక్షిత 440 మార్కులకు గాను 428 మార్కులు సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ)లో గుడ్డేటి తేజస్విని 1000 మార్కులకు గాను, 947 మార్కులు సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం (బైపీసీ)లో పొగాకు శ్రుతి 1000 మార్కులకు గాను, 954 మార్కులు సాదించింది. మండల కేంద్రంలోని కస్తూర్భాగాంధీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్లో 90 శాతం ఉత్తీర్ణత సాదించగా, రెండో సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాదించారు. ఇంటర్ మొదటి సంవత్సరం (ఎం.పీ.సీ) లో డి.మైబూ 470 మార్కులకు గాను 438 మార్కులు సాదించగా, (బైపీసీ) జి. దేవిక 440 మార్కులకు గాను 430 మార్కులు సాధించింది. అదే విదంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో (ఎంపీసీ) లో ఎం. వైష్ణవి 1000 మార్కులకు గాను 903 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం (బైపీసీ)లో జి శైలజ 1000 మార్కులకు గాను 966 మార్కులు సాధించిందిందని ఆ కళాశాలల ప్రిన్సిపాళ్లు స్వరూప, నవీన తెలిపారు.



## అవినీతి,అక్రమాలు,భూ కబ్జాలకు పాల్పడితే సహించేది లేదు..

▫ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** ప్రజా పాలనలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి 31వ డివిజన్ పరిధిలోని శాయంపేట మరియు సుభాష్ వీధిలో సైడ్ డ్రైన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ నేపథ్యం కలిగిన శాయంపేట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత పదేళ్లలో స్థానిక ప్రజలను పట్టించుకోని నాయకులను చూసిన ప్రజలు, ఇప్పుడు అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా చూస్తున్నారని పేర్కొన్నారు. గత రెండేళ్లలోనే ఈ ప్రాంతాన్ని దాదాపు 50 సార్లు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థలు, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలల అభివృద్ధి, దేవాలయాల పునర్నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో కొత్త రోడ్లు నిర్మించడంతో అవి మోడల్ కాలనీలుగా మారాయని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సహకారం, స్థానిక నాయకత్వ ఐక్యతతో సమిష్టి కృషి ఫలితంగా వరంగల్ నగరం రూపురేఖలు మారుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని నమ్మకం వ్యక్తం చేశారు.

అదే విధంగా నగరంలో భూకబ్జా సమస్యలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. తమ పార్టీకి చెందిన వారైనా, తమ పేరును ఉపయోగించుకొని అవకతవకలకు పాల్పడిన వారైనా కఠిన చర్యలు తప్పవని, అలాంటి విషయాలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, నాయకులు సత్తు రమేష్, వేణు, రాజు, రమేష్ యాదవ్, సురేష్,కృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు ఈఈ రవి కుమార్, డీఈ శ్రీకాంత్, రాజు కుమార్ పాల్గొన్నారు.

## ఆగని మొరం దందా

▫ సెలవు దినాల్లో ఎడతెరిపి లేకుండా మొరం తవ్వకాలు



**సారంగాపూర్, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** మండలంలో కొందరు అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం దందా కొనసాగిస్తూ ఆదివారం వస్తే చాలు సెలవు దినాల్లో గుట్టలను మాయం చేస్తున్నారు. వీరి ధన దాహానికి గుట్టలు మాయమై మైదానాలుగా మారుతున్నాయి. కుప్టీ గ్రామ శివారులో ఉన్న కొండను మాయం చేస్తున్నారు. పట్టా భూమి అంటూ ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం సెలవు రోజున అధికారులు లేని సమయంలో ఉదయం నుండి రాత్రింబవళు మొరం తవ్వకాలు చేపడుతున్నారు. నేతల అండదండలతో రాత్రివేళ తవ్వకాలు చేపడుతూ మొరం దందాను మూడు పువ్వులు, ఆరు కాయలుగా మార్చుకుంటున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

▫ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్12 (జనంసాక్షి) :** ఆదివారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఘనమైన ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో, నిర్మల్ జిల్లా, 62.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 12 వ ర్యాంక్, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.43 శాతం ఉత్తీర్ణతో 13 వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం పై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ముున్ముందు పై తరగతుల్లో మరింత కష్టపడి చదివి, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. అనుత్తీర్ణులు అయిన విద్యార్థులు బాధపడకూడదని, మరింత కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరింత మంచి ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రస్థాయిలో మంచి స్థానంలో నిలపాలని అప్రకటన ద్వారా తెలిపారు.

## మంత్రులు వచ్చిన మారని దారులు

▫ రోడ్ల దుస్థితిని పట్టించుకోని అధికారులు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12(జనంసాక్షి):** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ నుండి ఉట్నూర్ వరకు జిల్లా రహదారి అధ్వానంగా మారి రాకపోకలు ఇబ్బందిగా మారిందని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. సి.పి.యం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ మాట్లాడుతూ కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకి మంత్రులు వస్తూ ఉంటారు వెళ్తూ ఉంటారు కానీ జిల్లా అభివృద్ధి మాత్రం వారికి పట్టదని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా జైనూర్ మండలం నుంచి ఉట్నూర్ ఎక్స్ రోడ్ వరకు గుంతలతో దారి మొత్తం ప్రమాదకరంగా మారిందని, తద్వారా ఎన్నో రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని,అలా ప్రజా, ప్రైవేటు వాహనాలు పాడవ్వడమే కాకుండా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందన్నారు. అలాగే అత్యవహసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్ళాలి అంటే ప్రాణాలతో జూదం ఆడటమే అని, ఈ దారిగుండా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు వస్తూ వెళ్తూ ఉన్నా కూడా రోడ్డు బాగు చేయాల్సిన బాధ్యతని మరచిపోవడం దురదృష్టకరం అన్నారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.పి.ఐ(ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి, సి.పి.ఐ జిల్లా సహాయా కార్యదర్శి ఆత్మకురి చిరంజీవి, సి.పి.యం జిలా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, గెడం టికానంద్, జాదవ్ రాజేందర్, జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లతో పేదల కళ్లల్లో ఆనందం

▫ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**చెన్నారావుపేట, ఏప్రిల్ 12 (జనం సాక్షి):** గూడు లేని పేదలకు నీడ కల్పించాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లతో పేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారురాలు పడిదం అనూష-రాకేష్ దంపతుల గృహప్రవేశానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నూతన ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, మాజీ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, సర్పంచులు భూక్య బుజ్జి సురేష్, కంది శ్వేత క్రిష్ణ చైతన్యరెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, ఉప సర్పంచ్ కక్కెర్ల రజిత, బాదావత్ వీరు, ఆకుల అశోక్, తేజావత్ బద్రు, ముత్యం భద్రయ్య, బాదావత్ వీరు, వీరు నాయక్, చందర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్-2026 అవార్డ్స్ అందుకున్న 'సిద్ధార్థ' విద్యార్థులు



**పాలకుర్తి, ఏప్రిల్ 12 (జనంసాక్షి)** ఇన్స్పైర్. ఐఐటి. నీట్ ఫౌండేషన్ ఎక్సలెన్స్ 2026 ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఐఐటీ పరీక్షలో ఉత్తీర్ణులై స్టేట్ టాపర్లు గా ఎంపికైన విద్యార్థులకు హన్మకొండ లోని కాళోజీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవం లో భాగంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య. తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా సిద్ధార్థ విద్యాలయం విద్యార్థులకు ప్రశంస పత్రాలు షీల్డ్ లు పాఠశాలల నిర్వాహకుల సమక్షంలో ఇన్స్పైర్ ఐఐటి నీట్ ఫౌండేషన్ నిర్వహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాలయం ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, జక్కుల శాంతన్, ఉపాధ్యాయులు జీవంజి దామోదర్, మహేష్ పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో కేజీబీవీ ప్రభంజనం

**టేకుమట్ల ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** టేకుమట్ల కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల బాలికలు ఈరోజు వెలువడిన ఇంటర్ ఫలితాలలో విజయకేతనం ఎగురవేశారు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 965 మార్కులతో విద్యార్థిని సౌజన్య కాలేజీ, మొదటి స్థానంలో నిలువగా విద్యార్థిని వర్షిత 961రెండవ స్థానం సాధించుకుంది ద్వితీయ సంవత్సరం బైపీసీలో సాయి ప్రియ బైపిసి 940 మార్కులతో నిలువగా మొదటి స్థానం సంపాదించుకోగా మాధవి 914 అత్యుత్తమ మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆత్మకూర్(ఎం), ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** ఆత్మకూర్ మండలం లో పలు గ్రామాలల్లో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. అలాగే మండలంలోని రాయపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్వేపల్లి గ్రామంలో ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మొట్టమొదటిసారిగా బునాది కాల్వ పారుతుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం నిర్వహించి, మహిళా భవనానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సిద్దాపురం గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు మరియు వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. లింగరాజుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పల్లెర్ల గ్రామంలో మహిళా భవనం, సీసీ రోడ్డు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం మరియు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, సర్పంచ్ కోసన లక్ష్మి కిష్టయ్య, సోలిపురం ఎల్లారెడ్డి, తండ మంజుల నర్సింహా గౌడ్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం, వైస్ ఎంపీపీ భాషబోయిన పద్మ పాపయ్య, జిల్లాల శేఖర్ రెడ్డి, బత్తిని ఉప్పలయ్య ముద్దసాని సిద్ధులు, జన్నాయి కోడె నగేష్ వివిధ గ్రామాల సర్పంచులుజిల్లా నాయకులు, మండల నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

## జూనియర్ ఇంటర్ ఫలితాలలో హాలియా విద్యార్థి స్టేట్ 2వ ర్యాంక్



హాలియా, ఏప్రిల్ 12 (జనం సాక్షి) : తెలంగాణ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఇంటర్ మిడియట్ ఫలితాలలో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి మహమ్మద్ ఇలియాస్ నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలోని ఆకాంక్ష పాఠశాల కు చెందిన విద్యార్థి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయి లోనే రెండవ ర్యాంక్ సాధించాడు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించినాడు. రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులు మహమ్మద్ కరీం షమీమ్ పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

## మహనీయుల విగ్రహాలకు సొంత ఖర్చులతో రంగులు



**హాలియా, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** హాలియా పట్టణం జాతీయ రహదారిపై మండల పరిషత్ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్‌గారి విగ్రహాలకు రంగులు వేయించిన హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అచ్చమైన సామాజిక సేవా దృక్పథాన్ని ప్రదర్శించారు. రాబోయే అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని ఈ మహనీయులపై అభిమానంతో చైర్మన్ చంద్రారెడ్డి తన స్వంత ఖర్చుతో సుమారు 30 వేల రూపాయలు భారీగా వెచ్చించి విగ్రహాలకు ముస్తాబు చేయించారు. అట్టడుగు, బలహీన వర్గాల పైన తన గొప్ప అభిమానాన్ని ఈ సందర్భంలో చాటుకున్నారు. ఈ సత్కార్యాన్ని అనుముల మండలం బడుగు, బలహీన వర్గాల ప్రజలు, దళిత నాయకులు స్వాగతించి, చైర్మన్ చంద్రారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా మహనీయుల ఆదర్శాలను ప్రజలలోకి ప్రచారం చేయడమే కాకుండా, సామాజిక సమానత్వానికి చైర్మన్‌లోని నిబద్ధతను వెల్లడి చేస్తోంది.

## అవార్డులకు ఎంపికైన నాగార్జున పాఠశాల విద్యార్థులు



**నూతనకల్, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** ఇన్స్పైర్ ఐఐటి ఒలంపియాడ్ స్టేట్ ఎక్సెలెన్స్ అవార్డులకు మండల కేంద్రానికి చెందిన నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై ఆదివారం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో దేవదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ, వరంగల్ వెస్ట్ జోన్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు ప్రశంసా పత్రం అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అవార్డులు ప్రశంస పత్రం రావడం ఆనందంగా ఉందని తెలిపారు భవిష్యత్తులో ఇంకా ఉత్తమ అవార్డులు పొందే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు ఈ సందర్భంగా అవార్డులు పొందిన విద్యార్థులను శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

## ప్రమాదపు అంచున ఒరిగిన విద్యుత్ స్తంభం

- **విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం**



**మాడుగులపల్లి, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కు కేవలం 100 మీటర్ల దూరంలోనే ఒక విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒక వైపునకు ఒరిగిపోయి ఉంది ఈ విషయం స్పష్టంగా కనిపిస్తున్నా, ప్రతిరోజూ అటుగా వెళ్లే విద్యుత్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. సబ్ స్టేషన్ కు అతి సమీపంలోనే ఇంత ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు స్పందించకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది ప్రస్తుతం ఆ స్తంభం ఏ క్షణమైనా కూలిపోయే స్థితిలో ఉంది. బలమైన గాలి వీచినా లేదా వర్షం పడితే మట్టి లూజ్ అయి స్తంభం నేలకొరిగే అవకాశం ఉంది అదే జరిగితే పెను విద్యుత్ ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరిగే ఆస్కారం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందు జాగ్రత్తగా ఆ స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆ ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని, లేదా దానికి మరమ్మతులు చేసి ప్రమాదాన్ని నివారించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బొమ్మకల్‌లో విద్యార్థుల ఏకాంత విద్యా యజ్ఞం

- **ఒకే గదిలో 25 మంది విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది**
- **ఐదు తరగతులకు ఒకే చోట పాఠాలు**
- **కొత్త భవనం ముస్తాబైనా ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం**
- **ప్రజాప్రతినిధుల తీరిక కోసం చిన్నారుల ఎదురుచూపులు**

మాడుగులపల్లి, ఏప్రిల్ 12 (జనం సాక్షి) : అది ఒక ప్రభుత్వ పాఠశాల అక్కడ అక్షరాలు నేర్చుకోవాల్సిన విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. నూతన భవనం కళ్ల ముందే మెరుస్తున్నా, అడుగు పెట్టే భాగ్యం లేక పాత గదిలోనే బందీలయ్యారు నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం బొమ్మకల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితి చూస్తే ఎవరికైనా జాలి కలగక మానదు ఒక పక్క మన ఊరు -మన బడి అంటూ ప్రభుత్వం ప్రచారాలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం చిన్నారుల పాలిట శాపంగా మారింది.

### నరకప్రాయంగా విద్యాబోధన

బొమ్మకల్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 25 మంది విద్యార్థులు ఉన్నారు వీరందరికీ కలిపి ఉన్నది కేవలం ఒకే ఒక్క గది వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది పచ్చి నిజం. అదే గదిలో ఒకటో తరగతి విద్యార్థి ఓనమాలు దిద్దుతుంటే, పక్కనే ఐదో తరగతి విద్యార్థి లెక్కలు చేస్తున్నాడు. ఐదు తరగతులకు సంబంధించిన బోధన ఒకే చోట సాగుతుండటంతో విద్యార్థులకు ఏమీ అర్థం కాక అయోమయంలో పడుతున్నారు.

### ఉపాధ్యాయులకూ తప్పని తిప్పలు

విద్యార్థులకే కాదు, అక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పరిస్థితి కూడా దారుణంగా ఉంది. టీచర్లు కూర్చోవడానికి, రికార్డులు భద్రపరుచుకోవడానికి వేరే గది లేదు. ఆ 25 మంది విద్యార్థుల మధ్యే సిబ్బంది కూడా తమ విధులను నిర్వహించాల్సి వస్తోంది. గాలి వెలుతురు సరిగ్గా లేని ఆ చిన్న గదిలో, ఉక్కపోత మధ్య పాఠాలు చెప్పడం తమ వల్ల కావడం లేదని సిబ్బంది లోలోపల మధనపడుతున్నారు.

### ప్రారంభోత్సవానికి అడ్డేమిటి..?

ప్రభుత్వం లక్షల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేసి సకల సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించింది రంగులు అద్ది, కిటికీలు, తలుపులు బిగించి అన్ని పనులు పూర్తి చేసి రోజులు గడుస్తున్నాయి కానీ, ఏ అధికారిక కార్యక్రమం కోసం ఆపుతున్నారో ఏమో కానీ, నేటికీ ఆ భవనం తాళం తీయలేదు పెద్దలు వచ్చి రిబ్బన్ కట్ చేసే వరకు మా పిల్లలు ఆ ఇరుకు గదిలోనే మగ్గిపోవాలా? అని గ్రామస్తులు నిలదీస్తున్నారు.



### గ్రామస్తుల ఆగ్రహం అధికారుల మౌనం

కొత్త భవనం అందుబాటులో ఉన్నా ఉపయోగించుకోకపోవడంపై బొమ్మకల్ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, కేవలం ప్రోటోకాల్ పేరుతో కాలయాపన చేయడం సరికాదని వారు హెచ్చరిస్తున్నారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే ఆ పాఠశాలలో భవనాన్ని ప్రారంభోత్సవం తీయించి, విద్యార్థులను కొత్త భవనంలోకి మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో ఆందోళన బాట పడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.


## సురభి కాలనీలో భారీ అగ్నిప్రమాదం

- **సోఫా తయారీ గోదాం దగ్ధం..**
- **నింగికెగిసిన అగ్నికీలలు**
- **లక్షలాది రూపాయల ఆస్తి నష్టం**



**మొయినాబాద్, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురభి కాలనీలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కాలనీలోని ఒక సోఫా సెట్ తయారీ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. స్థానిక సమాచారం ప్రకారం.. గోదాం నుంచి హఠాత్తుగా మంటలు, దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గోదాంలో సోఫాల తయారీకి సంబంధించిన కలప, ఫోమ్, రసాయనాలు వంటి వస్తువులు ఉండటంతో మంటలు క్షణాల్లోనే భవనం అంతటా వ్యాపించాయి. మంటలు పక్కనే ఉన్న గృహాలకు విస్తరిస్తాయన్న భయంతో కాలనీ వాసులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ఈ ప్రమాదంలో సుమారు లక్షలాది రూపాయల విలువైన ముడి సరుకు, తయారైన సోఫా సెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో కోతుల బెడద



మర్రిగూడ, ఏప్రిల్ 12 (జనం సాక్షి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ పోలీస్ స్టేషన్ కోతులకు అడ్డాగా మారింది. సుమారు 50 నుండి 100 కోతుల సమూహం పోలీస్ స్టేషన్లో సంచరిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. సామాన్య ప్రజలు ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చినప్పుడు, కోతులు వారిపై దాడి చేస్తున్నాయి. పోలీసులు కూడా ఈ కోతుల బెడదకు భయపడుతున్నారు. శనివారం స్టేషన్ జందార్ పైనే కోతులు దాడికి తెగబడటం, ఇక్కడి భయానక పరిస్థితికి నిదర్శనం, పోలీస్ స్టేషన్‌లో భద్రత లేని పరిస్థితి ఏర్పడింది. కోతులను తొలగించేందుకు అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో చూడాలి. స్థానికులు కోతుల బెడద నుండి కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధి హామీ పథకం రద్దుకు కేంద్రం కుట్ర



**హుజూర్‌నగర్, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుటీల యత్నాలు చేస్తున్నదని, కార్పొరేటర్లకు ఊడిగం చేసేందుకే ఈ పథకాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన హుజూర్ నగర్ లో వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యులతో కలిసి మాట్లాడుతూ గాంధీ పేరు తొలగించి జాతిపితను అవమానించారని వి బి జి రామ్ జి తో పేదలకు, రైతులకు తీరని అన్యాయం జరిగిందని ఉపాధి హామీ చట్టాన్ని ఒక హక్కుగా కాకుండా స్కీమ్ గా మార్చే కుట్రను మూకుమ్మడిగా ఎదుర్కొంటామని, ఎక్కడ పనులు ప్రారంభించాలో ఢిల్లీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తుందని స్థానిక సంస్థలకు గాని రాష్ట్ర ప్రభుత్వాలకుగాని ఎటువంటి హక్కు లేకుండా చేశారని, ఉపాధి హామీ చట్టం కింద కేంద్రం విధులు 90% రాష్ట్ర ప్రభుత్వ వాటా పది శాతం గా ఉండేదని కానీ విబిజి రాంజీ పథకంలో కేంద్ర వాటా 60% రాష్ట్ర వాటా 40% చేశారని రాష్ట్ర ప్రభుత్వాలు మేము భరించలేము అంటే ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలో ఇది భాగమని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కుట్రను ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అర్థం చేసుకోవాలని ముఖ్యంగా పేదలు, రైతులు ఈ పథకం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా నిలబడాలని అందుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తన వంతు పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జడ వెంకన్న, నాగేశ్వరరావు, పి భరత్ పాల్గొన్నారు.


## మానస విద్యా మందిర్‌లో ముగిసిన 'జ్ఞాపకాల పండగ'

- **25 ఏళ్ల తర్వాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు**



**మోటకొండూరు, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** పాతికేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆ ప్రాంగణం మళ్లీ సందడిగా మారింది. చిన్ననాటి ముచ్చట్లు, తరగతి గది అల్లరి, గురువుల పాఠాలు అన్ని మళ్ళీ నెమరువేసుకునే సమయం వారికి మళ్ళీ ఈ కలయిక రూపంలో వచ్చింది. మండలంలోనీ మానస విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత ఉత్సాహంగా సాగింది. 1998-1999 7వ తరగతి బ్యాచ్, 2001-2002 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులందరూ ఆదివారం ఒక చోట చేరి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, యోగక్షేమాలు విచారించుకుంటూ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో స్థిరపడినప్పటికీ, స్కూల్ జ్ఞాపకాల ముందు అందరూ మళ్లీ పిల్లలమైపోయామని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాటి మానస విద్యా మందిర్ ప్రధానోపాధ్యాయులు సామ భూపాల్ రెడ్డి, కరస్పాండెంట్ నిమ్మ శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎండీ మదార్ ,నరసింగారావు, శ్రీనాథ్, నిర్మల, లత, బి ఏం అర్ ఎస్ విద్యాసంస్థల చైర్మెన్ మల్లారెడ్డి ,పూర్వ విద్యార్థులు రాజు, ప్రభాకర్రెడ్డి, రవి, రాము, వెంకట్, బాలకృష్ణ, సంతోష్, మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్ గౌడ్, స్నేహలత, సుమలత, సురేఖ, నవనీత, సబిత, రజిత, తదితరులు పాల్గొన్నారు .

## అంతర్గాం వడ్డెర కాలనీ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి




**జగిత్యాల జిల్లా క్రైమ్, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలోని జగిత్యాల రూరల్ గ్రామమైన అంతర్గాం ఒడ్డెర కాలనీ గ్రామంలో జగిత్యాల జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న పూర్తి స్థాయిలో నిధుల సమస్యలతో అభివృద్ధి జరగడం లేదని గ్రామ సర్పంచ్ కుంచెపు గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పూర్తిస్థాయిలో రాకపోవడం వేతనాల చెల్లింపులు ప్రత్యేక నిధులు వంటివి లేకపోవడంతో గ్రామ అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరిట చిన్నచిన్న గ్రామాలను తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నిధులతో అభివృద్ధి మాత్రం చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు? పల్లెలు పట్టు కొమ్మలు గ్రామ అభివృద్ధి దేశ అభివృద్ధి అన్నట్లుగా ఒడ్డెర కాలనీ గ్రామపంచాయతీని పూర్తిస్థాయిలో వైద్య విద్య రవాణా మౌలిక వసతులు డ్రైనేజీ వ్యవస్థ సీసీ రోడ్ల నిర్మాణం గ్రంథాలయం పరిశుద్ధమైన త్రాగునీరు వంటి వసతులతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్‌లో గంగదేవిపల్లి గ్రామం దేశానికి ఆదర్శంగా నిలిచిన సంఘటన విధితమే. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిస్థాయిలో గ్రామ పంచాయితీలకు వేతనాలు అభివృద్ధి పనులు అందక సర్పంచులు తీవ్ర నిరాశతో ఉన్నారని వారిని పూర్తిస్థాయిలో నిధులు చెల్లింపులు జరిగేలా చూడాలని వారిని ఆదుకోవాలని వడ్డెర కాలనీ గ్రామ సర్పంచ్ కుంచపు గంగాధర్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కు అతి సమీపంలో ఉన్నప్పటికిని జిల్లా ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని పూర్తిస్థాయిలో త్రాగునీరు అందేలా చూడాలని, ప్రత్యేక నిధులు అందేలా చూడాలని జిల్లా ఉన్నత అధికారులను ఓ ప్రకటనలో కోరారు.

# కల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం సాధన కోసం ఐక్యంగా కృషి చేద్దాం

**కల్లూరు, ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రెవిన్యూ డివిజన్ కేంద్రం, సబ్ కలెక్టర్ హోదా కలిగిన కల్లూరును అసెంబ్లీ నియోజకవర్గంగా ప్రకటించే వరకు రాజకీయాల కతీతంగా అన్ని సామాజిక వర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు ,ప్రజా సంఘాలు పాత్రికేయ మిత్రులు ఉద్యోగులు కార్మికులు, రైతాంగం అంతా సమిష్టిగా కలిసి కృషి చేయాలని నియోజకవర్గం సాధన ఐక్య జేఏసీ కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం కల్లూరు మున్సిపాలిటీలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ సాధనకై సన్నాహక సమావేశం జరిగినది .ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చందర్రావు , డాక్టర్ లక్కినేని రఘు, లక్కినేని కృష్ణ, జాస్తి శ్రీనివాసరావు, కాకర్ల రంగారావు, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గోపాలస్వామి, మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, రిటైర్డ్ ఆర్ సి ఓ మేకతోటి పుల్లయ్య, కర్నాటి అప్పి రెడ్డి, మద్దినేని రాధాకృష్ణ, పెద్ద బోయిన రామ నరసింహారావు పగడాల లచ్చిరెడ్డి, గునుకుల ఈశ్వరరావు, దామాల దయాకర్ పలువురు మున్సిపాలిటీ కౌన్సిలర్లు , కాంగ్రెస్ ,టిడిపి, సిపిఐ , బిఆర్ఎస్ బిజెపి నాయకులు, తదితరులు ప్రసంగించారు. రాజకీయాలకతీతంగా అందరం కలిసి కల్లూరు కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గ సాధనకై కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కల్లూరుకి 16 కిలోమీటర్లు తల్లాడ, కల్లూరుకి, 12 కిలోమీటర్ పెనుబల్లి ఉన్నాయి. మూడు మండలాలు కలిపి డివిజన్ కేంద్రం కల్లూరు లో అన్ని రకాల శాఖలకు సంబంధించిన కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ కల్లూరు కేంద్రంగా నియోజకవర్గం చేయటం వలన ప్రజలకు సులభంగా సేవలు అందుతాయి అన్నారు. డీలిమిటేషన్అనేదిజనాభా,ప్రాంతాలవైశాల్యం,అధాయమార్గాలు పరిగణలోకి తీసుకొని అందరికీ న్యాయం జరిగేలా శాస్త్రీయంగా డీలిమిటేషన్ ప్రక్రియకొనసాగించాలి అన్నారు. కల్లూరు గతంలో పెద్ద సమితిగా ఉండి చుట్టుపక్కల అనేక మండలాలకు సేవలందించడం జరిగింది. అదేవిధంగా కల్లూరులో 120 సంవత్సరాలు చరిత్ర కలిగిన పోలీస్ స్టేషన్ నేటికీ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు సేవలందిస్తుంది అన్నారు. కల్లూరుని నియోజవర్గం చేయాలనేదే ప్రజల కోరిక అని తెలిపారు. ఈ సందర్భంగానియోజకవర్గ సాధన కోసం జేఏసీ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. జేఏసీ కమిటీ సభ్యులుగా జాస్తి శ్రీనివాసరావు, జొన్నల గడ్డ గోపాలస్వామి, బోయిన దుర్గాప్రసాద్, దేవల్ల ఏడుకొండలు, మేకల ప్రసాద్, దామాల రాజు, పాశం నరసింహారావు, మాదిరాజు లక్ష్మణరావు, జిల్లెల్ల కృష్ణారెడ్డి, విజయదాసు, పగడాల లచ్చిరెడ్డి, కాకర్ల రంగారావు, పోట్రు శ్రీనివాసరావు, మహమ్మద్ గౌస్ పాషా, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# విపణి




## ఈ ఏడాది 25 వేల మంది ఫ్రెషర్లకు అవకాశం

**: టీసీఎస్ వెల్లడి**

**ముంబయి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27) 25 వేలమంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ వెల్లడించింది. డిమాండ్‌ను బట్టి మరింత మందిని నియమించుకుంటామని తెలిపింది. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ 44 వేల మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు సెక్టార్‌లో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఈ మేరకు టీసీఎస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు మాట్లాడారు. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ తన విధానంలో ఏమైనా మార్పులు చేసిందా? అని ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి ట్రైనింగ్ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా అందుబాటులోకి రావడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. అదే ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాలను బట్టి నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని కృతి వాసన్ పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40 వేలు, అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు.

## ఐటీ ఫ్లెక్సీ సిబ్బందిలో 40% మహిళలే

**న్యూఢిల్లీ:** ఐటీ – ఐటీ ఆధారిత సేవా రంగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో/ఫ్లెక్సిబుల్ రోల్స్‌లో పనిచేస్తున్న వారిలో 40% మంది మహిళలని టాలెంట్ సొల్యూషన్ల సంస్థ కెరీర్‌మెట్ రూపొందించిన నివేదిక వెల్లడించింది. 2021-22లో ఫ్లెక్సీ పోస్టుల్లో మహిళల వాటా 30 శాతంగా ఉండగా, 2025-26 కల్లా 10% అధికమై 40 శాతానికి చేరినట్లు వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో కాంట్రాక్టు పోస్టుల్లో నియమితులైన 3,000 నియామకాలను విశ్లేషించి ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ ప్రకారం..మహిళా ఉద్యోగుల్లో 43% మంది ఫైనాన్స్, అకౌంటింగ్‌లో, 34% మంది డేటా సైన్స్, అనలిటిక్స్‌లో, 31% మంది డిజైన్-ఆర్కిటెక్చర్‌లో, 29% మంది ఐటీ-ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీలో, 27% మంది ఇంజినీరింగ్-సాఫ్ట్‌వేర్ విభాగాలపై ఆసక్తి చూపుతున్నారు. కన్సల్టింగ్‌పై 20% మందే మొగ్గుచూపారు.

# క్యాన్సర్ మందుల ధరలకు రెక్కలు?

- 50% పెంపు కోసం ఎన్‌పీపీఏను ఆశ్రయించిన ఔషధ కంపెనీలు ప్లాటినం ధర 6 నెలల్లో 60 శాతం పెరగడమే కారణం
- కార్బోప్లాటిన్, ఆగ్జాలిప్లాటిన్, సిస్‌ప్లాటిన్ తయారీలో ఈ లోహ వినియోగం

**న్యూఢిల్లీ:** ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం, అంతకుముందు అంతర్జాతీయంగా సంభవించిన పరిణామాల ఫలితంగా క్యాన్సర్ మందుల ధరలు పెరిగే ముప్పు కనిపిస్తోంది. కొన్ని రకాల క్యాన్సర్ మందుల తయారీలో వినియోగించే ప్లాటినం లోహం ధర 6 నెలల్లోనే 60% పెరగడం ఇం దుకు కారణం. కార్బోప్లాటిన్, ఆగ్జాలిప్లాటిన్, సిస్‌ప్లా టిన్ మందులను క్యాన్సర్ బాధితులకు కీమోథెరపీ చికిత్సలో వినియోగిస్తారు. ఈ మందుల తయారీలో ప్లాటినం లోహాన్ని వినియోగిస్తారు. ప్లాటినం ధర గణనీయంగా పెరిగినందున, పాత ధరలకు ఈ మందులను విక్రయించలేమని.. ధరలు కనీసం 50% పెంచాలని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ)కి పరిశ్రమ వర్గాలు నివేదించినట్లు తెలుస్తోంది. సహజంగానే క్యాన్సర్ మందుల ధర అధికంగా ఉంటుంది. అయితే దేశీయంగా క్యాన్సర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, సామాన్యులకూ అందుబాటులో ఉంచేందుకు.. కొన్ని ముఖ్యమైన క్యాన్సర్ మందులను కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణ జాబితాలో చేర్చింది. ప్లాటినం ఆధారిత ఔషధాల ధరలపై 2013 నుంచి ప్రభుత్వ నియంత్రణ కొనసాగుతోంది. యుద్ధాలు, ఇతర కారణాల వల్ల అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలు కుప్పకూలి, గత రెండేళ్లలో ఎన్నో రకాల ముడిపదార్థాల ధరలు పెరిగాయి. విలువైన లోహాలు.. బంగారం, వెండి, ప్లాటినం ధరలు బాగా పెరిగాయి. 2025 సెప్టెంబరు వరకు ఒక గ్రాము ప్లాటినం ధర దేశీయంగా




రూ.3,800 దరిదాపుల్లో ఉంది. కానీ ఈ ఏడాది జనవరిలో రూ.8,500కు చేరినా, మళ్లీ కాస్త తగ్గి ఇప్పుడు రూ.6,200 వద్ద ఉంది. అంటే 6 నెలల్లోనే 60% మేర ఈ లోహ ధర పెరిగింది. అందువల్లే ఈ ఔషధాల విక్రయ ధర పెంచాలని ఫార్మా కంపెనీల ప్రతినిధులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న డాక్టర్ రెడ్డీస్, నాట్కో ఫార్మా, ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్, హెటిరోతో పాటు సిప్లా, ఇంటాస్, జైడస్ లైఫ్‌సైన్సెస్, ఎంక్యూర్ ఫార్మా వంటి ఫార్మా కంపెనీలు ఈ మందులు తయారు చేస్తున్నాయి.కార్బోప్లాటిన్ 10గ్రా/ఎంఎల్ వయల్‌ను రూ.61.10కి మించి విక్రయించడానికి లేదు. సిస్‌ప్లాటిన్ ధర రూ.75నుంచి రూ.400 వరకు ఉంది. ఆగ్జాలిప్లాటిన్ ఇంజెక్షన్ 50 ఎంజీ ధరపై రూ.2,303కి పరిమితి ఉంది ప్లాటినం ధరల పెరుగుదల కారణంగా, ప్రభుత్వ ధరల పరిమితుల్లో ఈ ఔషధాలు తయారు చేయలేమని భావిస్తున్న ఔషధ కంపెనీలు, జనవరి నుంచే ఆచితూచి వ్యవహరిస్తున్నాయని సమాచారం.ఈ ఔషధాలకు రూ.110 కోట్ల మార్కెట్ ఉంది. ఏటా వీటి అమ్మకాలు 14% పెరుగుతున్నాయి. అందుబాటులో ఉంచడానికే ధరలపై పరిమితి మెటాలిక్ ఏపీఐలుగా వ్యవహరించే (ప్లాటినంతో తయారు చేసే) కీమోథెరపీ మందులను సాధ్యమైనంత తక్కువ ధరల్లోనే అందుబాటులో లభించేలా చూసేందుకే ప్రభుత్వం వీటిపై గరిష్ఠ విక్రయ ధర పరిమితులను విధించింది. ఈ మందులను రొమ్ము, గొంతు, ఊపిరితిత్తులు, పొట్టలో వచ్చే క్యాన్సర్ వ్యాధులకు చికిత్సలో వినియోగిస్తున్నారు. 2013 నుంచి కార్బోప్లాటిన్ మందు ధర ఇప్పటి వరకు 20 శాతమే పెరిగిందని, మిగిలిన మందుల ధరల్లో పెద్దగా మార్పు లేదని సంస్థలు చెబుతున్నాయి. అయితే ప్లాటినం ధర ఇంతగా పెరిగినందున, విక్రయ ధర పెంచితేనే ఈ మందులను ఉత్పత్తి చేయగలమని లేకపోతే ఉత్పత్తి నిలుపుదల చేయాల్సి వస్తుందని స్థానిక ఫార్మా పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే క్యాన్సర్ మందులకు కొరత ఏర్పడి, రోగులకు మరింత నష్టం ఏర్పడుతుంది. ప్రస్తుత పరిస్థితులను, పరిశ్రమ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు పేర్కొంటున్నారు. కొంతకాలం చూసి, ప్లాటినం ధర దిగిరాని పక్షంలో మందుల ధర పెంచడానికి ఎన్‌పీపీఏ అనుమతి ఇస్తుందని వివరిస్తున్నారు. అంటే కీమోథెరపీ చికిత్స చేయించుకునే క్యాన్సర్ బాధితుల మందుల ఖర్చు పెరిగే అవకాశం ఉంది.

## పసిడిని కేంద్రబ్యాంకులు కొంటూనే ఉన్నాయ్

**ఫిబ్రవరిలో నికరంగా 19 టన్నులు**

**న్యూఢిల్లీ:** పసిడి ధర పరుగులు పెట్టడానికి, వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దమొత్తంలో పసిడి నిల్వలు పెంచుకోవడమూ ఒక కారణమన్నది తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు నికరంగా 19 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయని ప్రపంచ స్వర్ణమండలి (డబ్ల్యూజీసీ) తెలిపింది. కొనుగోలుదార్లు- విక్రయదార్ల వివరాలు: పోలండ్ 20 టన్నులు, ఉజ్బెకిస్థాన్ 8, చెక్ రిపబ్లిక్ 2, మలేషియా 2, చైనా - కాంబోడియా 1 టన్ను చొప్పున కొనుగోలు చేయగా, టర్కీ 8 టన్నులు, రష్యా 6 టన్నుల చొప్పున పసిడిని విక్రయించాయి. 2025 ఫిబ్రవరిలో 29 టన్నులు కొనుగోలు చేసిన పోలండ్ కేంద్రబ్యాంక్ మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ రికార్డుస్థాయిలో పసిడిని పోగుచేసుకుంది. మొత్తం బంగారం నిల్వలను 700 టన్నులు చేయాలన్నది ఈ బ్యాంక్ లక్ష్యం కాగా, ఇప్పటికి 570 టన్నులు చేసింది. చైనా విదేశీ మారకపు నిల్వల్లో బంగారం వాటా 10%. ఈ దేశ కేంద్రబ్యాంక్ వద్ద మొత్తం 2,308 టన్నుల బంగారం ఉంది. బంగారాన్ని కొనుగోలు చేయడం చెక్ రిపబ్లిక్‌కు వరుసగా ఇది 36వ నెల కాగా, చైనాకు 16వ నెల, ఉజ్బెకిస్థాన్‌కు 5వ నెల.

## హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఈవీలు

హైదరాబాద్: దేశ వ్యాప్త విద్యుత్ వాహన (ఈవీ) వినియోగంలో 14% వాటాతో హైదరాబాద్ అగ్రస్థానంలో కొనసాగుతోందని మారుతీ సుజుకీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ అన్నారు. 108 ఇ-విటారాలను శనివారం ఇక్కడ కొనుగోలుదారులకు అందించిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఇ-విటారా కార్ల అమ్మకాలు ప్రారంభించిన తొలి నెలలోనే, 2,254 డెలివరీ చేశామన్నారు. వచ్చే ఆగస్టుకు కొత్త తయారీ కేంద్రం అందుబాటులోకి వస్తే, నెలకు 2,000 విద్యుత్తు కార్లు ఉత్పత్తి చేస్తామన్నారు. విద్యుత్ కార్లు ఉన్న వారిలో 95% మంది ఇళ్ల వద్దే ఛార్జింగ్ చేసుకుంటున్నారని, అందుకే కొనుగోలుదార్లకు రూ.50,000 విలువైన ఛార్జింగ్ వ్యవస్థను ఉచితంగా ఇన్‌స్టాల్ చేశాకే, ఈ కారు డెలివరీ చేస్తున్నామన్నారు. ఏడాదిపాటు రూ.20,000 విలువైన ఉచిత ఛార్జింగ్ సదుపాయం, మూడేళ్ల తర్వాత 60% ధరకు తిరిగి కొనుగోలు లాంటి ఆఫర్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2031 నాటికి 4 ఈవీ మోడళ్లను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి ఉక్కు, అల్యూమినియం, రబ్బరు తదితర ముడి సరకుల ధరలు విపరీతంగా పెరిగినా, ఇప్పటిదాకా ఆ భారాన్ని కంపెనీ భరించిందన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.37 | ₹ 4.32 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,40,100 (22 క్యారెట్లు) | ₹ 1,52,840 (24 క్యారెట్లు) |


### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,65,000

# ఉష్ణకవచం ఎదురొడ్డింది

**పనిచేసిన ఒరాయన్ హీట్‌షీల్డ్ • తొలి పరీక్షలో లోపాలు అధిగమించిన వ్యోమనౌక**





**వాషింగ్టన్:** చందమామ చుట్టూ ప్రదక్షిణను పూర్తిచేసుకున్న ఆర్టెమిస్-2 మిషన్ తిరుగు ప్రయాణంలో ఒకేఒక్క అంశం తీవ్ర ఉత్కంఠను కలిగించింది. అదే ఒరాయన్ వ్యోమనౌక ఉష్ణకవచం! భూవాతావరణంలోకి ప్రవేశించే క్రమంలో లావాను మించిన వేడిని అది ఎదుర్కొంది. దీన్ని వ్యోమనౌక తట్టుకోగలదా అన్న సందేహాలు తొలుత ఉత్పన్నమయ్యాయి. వాటిని పటాపంచలు చేస్తూ అది క్షేమంగా పుడమికి తిరిగిరావడంతో నాసా శాస్త్రవేత్తలు ఊపిరి పీల్చుకున్నారు. పది రోజుల్లో 11 లక్షల కిలోమీటర్ల ప్రయాణాన్ని పూర్తిచేసుకున్న ఒరాయన్‌కు ఎదురైన చివరి పరీక్ష.. రీఎంట్రీ! ఈ దశలో అంతరిక్షం నుంచి గంటకు 38,367 కిలోమీటర్ల వేగంతో భూవాతావరణంలోకి అది తిరిగి ప్రవేశించింది. ఇది ధ్వని వేగం కన్నా 32 రెట్లు అధికం. దీనివల్ల వ్యోమనౌక ముందు భాగంలోని గాలి సంపీడనానికి లోనైంది. అదే సమయంలో అది సహజసిద్ధ బ్రేక్‌లా పనిచేస్తూ వ్యోమనౌక వేగాన్ని తగ్గించింది. ఈ రాపిడికి ఒరాయన్ ముందుభాగంపై 2,760 డిగ్రీల సెల్సియస్ వేడి చెలరేగింది. ఇది సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రతలో సగం. దీన్ని తట్టుకోవడానికి స్పేస్‌క్రాఫ్ట్‌లకు ఉష్ణకవచాన్ని ఏర్పాటు చేస్తారు. ఇది సరిగా పనిచేయాల్సిందే. దీనికి ప్రత్యామ్నాయం ఉండదు. ఏదైనా తేడా వస్తే స్పేస్‌క్రాఫ్ట్ విచ్ఛిన్నమై, వ్యోమగాముల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. ఉష్ణకవచంలోని కొంత భాగం దెబ్బతినడం వల్ల 2003 ఫిబ్రవరి 1న కొలంబియా వ్యోమనౌక.. రీ ఎంట్రీ సమయంలో విచ్ఛిన్నమై, భారత సంతతి వ్యోమగామి కల్పనా చావ్లా సహా ఏడుగురు వ్యోమగాములు దుర్మరణం పాలయ్యారు. వ్యోమనౌక రీఎంట్రీ సరైన కోణంలో జరిగితేనే ఈ ఉష్ణకవచం పనిచేస్తుంది. మరీ నిటారుగా లేదా మరీ లోతు తక్కువగా సాగితే ప్రమాదం చోటుచేసుకుంటుంది. ఈ మేరకు రీఎంట్రీకి ముందు వ్యోమనౌక రాకెట్లను మండించడం ద్వారా దాని మార్గాన్ని సర్దుబాటు చేస్తారు.

**ఎబ్లేటివ్ కవచం**

ఒరాయన్ వ్యోమనౌక జిగురు బిందువు ఆకృతిలో ఉంటుంది. దీని బేస్ భాగంలో అవ్‌కోట్ అనే పదార్థంతో తయారుచేసిన ఎబ్లేటివ్ హీట్‌షీల్డ్‌ను అమర్చారు. దీని వెడల్పు 16.5 అడుగులు. ఇందులో ప్రధానంగా సిలికా ఫైబర్లు ఉంటాయి. ఈ కవచం.. తీవ్ర వేడిని ఎదుర్కొనే క్రమంలో ఒక పద్ధతి ప్రకారం తానే కాలిపోతుంది. తద్వారా తనతోపాటు వేడిని కూడా తరలించుకుపోతుంది. వ్యోమనౌకను తీవ్ర ఉష్ణం తాకకుండా చూస్తుంది.

**తొలి పరీక్షలో బయటపడ్డ లోపాలు..**

2022 డిసెంబరులో ఆర్టెమిస్-1లో భాగంగా మానవరహిత ఒరాయన్‌ను పరీక్షించినప్పుడు దాని ఉష్ణకవచం.. అనుకున్నదాని కన్నా ఎక్కువగా కాలిపోయింది. పెద్ద పరిమాణంలో ఆ కవచం గల్లంతైనట్లు ఇంజినీర్లు గుర్తించారు. ఇది అసాధారణం. అయితే వ్యోమనౌకలోని సెన్సర్లు.. లోపల, వెలుపల ఎలాంటి అసాధారణ ఉష్ణాన్ని గుర్తించలేదు. అందువల్ల కవచం ఎంతలా క్షీణించినా అది తన లక్ష్యాన్ని నెరవేర్చగలదని నాసా భావించింది.

**ఇదే కారణం..**

ఆర్టెమిస్-1 కవచంలో లోపాలకు కారణాలపై నాసా లోతైన పరిశోధన చేపట్టి, అసలు విషయాన్ని గుర్తించింది. ఈ కవచంలో సన్నటి రంధ్రాలు ఉన్నాయి. అవి మరీ సన్నగా ఉన్నచోట డికంపోజిషన్ పొరలో వేడివాయువులు చిక్కుకుపోయినట్లు ఇంజినీర్లు తేల్చారు. దీనివల్ల కాలిపోయిన ఉష్ణకవచంలో పగుళ్లు ఏర్పడి చుట్టుపక్కల భాగం ఊడిపోయినట్లు నిర్ధారించారు. ఇలా వేడి వాయువులు ఎక్కువగా పేరుకుపోవడానికి ప్రధాన కారణం ఆర్టెమిస్-1 యాత్రలోని 'స్కిప్ ఎంట్రీ' అనే ప్రయాణమార్గమేనని గుర్తించారు. స్కిప్ ఎంట్రీ విధానంలో వ్యోమనౌక తొలుత భూవాతావరణంలోకి ప్రవేశించి, వేగాన్ని బాగా తగ్గించుకుంటుంది. తర్వాత మళ్లీ పైకి వెళుతుంది. అనంతరం మళ్లీ భూవాతావరణంలోకి ప్రవేశించి, సాగర జలాల్లో నిర్దేశిత ప్రదేశానికి చాలా దగ్గరగా దిగుతుంది.అయితే ఈ విధానం వల్ల ఉష్ణకవచం బాగా వేడెక్కి, దానిపై వాయు పీడనం పెరిగినట్లు నాసా గుర్తించింది. ఫలితంగా వ్యోమనౌక ఉష్ణకవచంలో వందకుపైగా పగుళ్లు ఏర్పడ్డాయని తేల్చింది.

**మార్గాన్ని మారిస్తే సరి..**

ఆర్టెమిస్-1 పరిశీలనల్లో వెల్లడైన అంశాలతో ఉష్ణకవచాన్ని రీ డిజైన్ చేయాలా లేక పాత దాన్నే కొనసాగించాలా అని నాసా డోలాయమానంలో పడింది. కవచాన్ని మార్చాలంటే ఆర్టెమిస్-2 యాత్రలో జాప్యం జరుగుతుంది. ఇప్పటికే ఆ మిషన్ బాగా ఆలస్యమైంది. దీంతో పాత కవచాన్నే కొనసాగిస్తూ.. ఆర్టెమిస్-2 రీఎంట్రీ కోణాన్ని మార్చాలని నాసా నిర్ణయించింది. దీనివల్ల కవచంపై థర్మల్ ఒత్తిడి తగ్గుతుందని భావించింది. ఈ మార్గంలోనూ ఆర్టెమిస్-2.. 'స్కిప్' విన్యాసాన్ని వ్యోమనౌక చేసింది. అయితే అది కొద్దిసేపే సాగింది. మొత్తానికి ఈ వ్యూహం ఫలించింది.

# అందమైన అమ్మాయిని అప్పగించండి

**తుర్కియేకి ఉగాండా జనరల్ హుకుం**



**న్యూఢిల్లీ:** ఉగాండా సైన్యాధిపతి జనరల్ ముహూజీ కైనెరుగాబా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. సోమాలియాలో ఇస్లామిక్ మిలిటెంట్ల నుంచి రక్షణ కల్పించడానికి ఉగాండా అందిస్తున్న సేవలకు గానూ 1బిలియన్ డాలర్ల నగదు చెల్లించాలని తుర్కియేను డిమాండ్ చేశారు. నగదుతో పాటు తను పెళ్లి చేసుకోవడానికి.. దేశంలోని అత్యంత అందమైన అమ్మాయిని అప్పగించాలని అన్నారు. 30 రోజుల్లోగా తన డిమాండ్‌కు అంగీకరించకపోతే తీవ్రమైన దౌత్య పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తుర్కియేను హెచ్చరించారు. ఉగాండాలోని ఆ దేశ రాయబార కార్యాలయాన్ని సైతం మూసివేస్తామని.. తమ గగనతలంలో తుర్కియే ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు నిలిపివేస్తామని అన్నారు. తుర్కియేతో ఉగాండాకు ఉన్న సంబంధాలన్నీ త్వరలో తెంచుకుంటామని కైనెరుగాబా అన్నారు. వెన్నుపోటు పొడిచే స్నేహితుడిని తాము కోరుకోవట్లేదంటూ వ్యాఖ్యానించారు. తుర్కియేకు అన్ని ప్రయాణాలు నిలిపేసుకోవాలని దేశ ప్రజలకు సూచించారు. అదే సమయంలో ఇజ్రాయెల్‌కు సాయంగా లక్ష మంది సైనికులను పంపనున్నట్లు తెలిపారు. కైనెరుగాబా స్త్రీలను ఉద్దేశించి ఇలాంటి విపరీతమైన డిమాండ్లు చేయడం ఇదే మొదటిసారి కాదు. 2022లో ఇదే విధంగా ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనిని వివాహం చేసుకుంటానని బహిరంగంగా ప్రకటించారు. ఆమెను తనకు అప్పగిస్తే.. బదులుగా 100 అంకోలే జాతి ఆవులను ఇస్తానని ఆఫర్ చేశారు. అనంతరం కైనెరుగాబా వ్యాఖ్యలకు గానూ అతడి తండ్రి, ఉగాండా అధ్యక్షుడు అయిన యోవేరి ముసెవెని బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ప్రస్తుతం కైనెరుగాబా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ఆయన వ్యాఖ్యలపై ఇప్పటి వరకు తుర్కియే స్పందించలేదు.

## వాషింగ్టన్‌లో భారీ విజయతోరణం

- బంగారు పూతతో 250 అడుగుల రెక్కల ఎత్తయిన విగ్రహం
- ట్రంప్ ఆలోచనలకు అనుగుణంగా ప్రణాళిక ఆవిష్కరణ

వాషింగ్టన్: అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్ డీసీలో భారీ విజయ తోరణాన్ని నిర్మించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను అమెరికా ప్రభుత్వానికి చెందిన యూఎస్ కమిషన్ ఆన్ ఫైన్ ఆర్ట్స్ శుక్రవారం విడుదల చేసింది. అమెరికా స్వాతంత్ర్యం పొంది 250 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ భారీ నిర్మాణాన్ని తలపెట్టారు. తోరణంపై న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ చేతిలో ఉన్నట్లుగా కాగడా, కిరీటంతో కూడిన 250 అడుగుల (76.2 మీటర్లు) ఎత్తైన రెక్కల విగ్రహాన్ని వాషింగ్టన్ డీసీలో నిర్మిస్తారు. దీనికి ఇరువైపులా రెండు గద్దలు, నాలుగు సింహాల విగ్రహాలు ఉంటాయి. అన్ని విగ్రహాలకు బంగారు పూత వేస్తారు. ఈ తోరణం తూర్పు భాగంలో లింకన్ మెమోరియల్, పశ్చిమ భాగంలో ఆర్లింగ్టన్ జాతీయ శ్మశానవాటిక ఉంటాయి. కొత్త నిర్మాణం పూర్తయితే 99 అడుగుల (30.2 మీటర్లు) ఎత్తులో ఉన్న లింకన్ మెమోరియల్ దీనికన్నా చిన్నదిగా కనిపిస్తుంది.

## ఇరాన్‌కు ఆయుధాలిస్తే జాగ్రత్త.. చైనాకు ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్:** యుద్ధం సమయంలో ఇరాన్‌కు చైనా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు వెలువడిన నివేదికలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. టెహ్రాన్‌కు ఆయుధాలు పంపితే బీజింగ్ తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు అటువంటి చర్యలను ఇకనైనా మానుకోవాలని సూచించారు. చమురు నౌకల ప్రయాణానికి హర్మూజ్‌ను తిరిగి తెరవడానికి వీలుగా సీమైన్స్‌ను తొలగించడానికి తమ దళాలు కృషి చేస్తున్నట్లు వెల్లడిం చారు. ఇరాన్‌తో చర్చలు విఫలమైనప్పటికీ అంతిమ విజయం తమదేనని పేర్కొన్నారు. ఆ దేశాన్ని సైనిక పరంగా ఓడించామన్నారు. యుద్ధం విషయం లో నాటో వైపు నుంచి అమెరికాకు ఎటువంటి సాయం లభించలేదన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే.. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో దెబ్బతిన్న తమ రక్షణ



సామర్థ్యాలను వేగంగా పునర్నిర్మించుకోవడానికి టెహ్రాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చైనా.. ఇరాన్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలు గుర్తించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. భుజం మీద పెట్టుకొని ప్రయోగించే షార్ట్ రేంజ్ మిసైల్ లాంచర్‌లను, ఇతర క్షిపణి వ్యవస్థలను టెహ్రాన్‌కు సరఫరా చేయడానికి బీజింగ్ ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిపాయి. అమెరికా విమానాలు, డ్రోన్లను కూల్చడానికి ఇరాన్ వీటిని ఉపయోగిస్తోంది. వారం రోజుల్లో ఇవి టెహ్రాన్‌కు చేరే అవకాశం ఉందన్నాయి. తన పేరు బయటకురాకుండా ఉండేందుకు చైనా ఈ ఆయుధాలను ఇతర దేశాల మీదుగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలను వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే చైనా నుంచి ఆయుధాలు అందినట్లు ఇరాన్ బహిరంగంగా వెల్లడించనప్పటికీ.. తాము అమెరికా విమానాలను విజయవంతంగా కూల్చడానికి అధునాతన రక్షణ వ్యవస్థలే కారణమని ఐఆర్‌జీసీ వెల్లడించింది.

## ఐదేళ్లలోపు దగ్గుమందు వినియోగం వద్దు

చేయరాదని ప్రతిపాదిస్తున్నారు.అయిదేళ్లలోపు పిల్లలకు కూడా అత్యంత జాగ్రత్తగా, క్లినికల్ మదింపు చేయకుండా వీటిని సిఫారసు చేయరాదు. దగ్గు నివారణకు ఉపయోగపడే లిక్విడ్ ఓరల్ ఫార్ములేషన్స్‌లో డైఇథిలీన్ గ్లైకాల్(డీఈజీ), ఇథిలీన్ గ్లైకాల్(ఈజీ) వంటి హానికర పారిశ్రామిక రసాయనాలు ఉన్నట్లు తేలడంతో, సిరప్‌ల తయారీలో నిబంధనలను కఠినతరం చేసే దిశగా ఐపీసీ అడుగులేస్తోంది.ఫార్మా కంపెనీల బాధ్యత ఇదీ..దగ్గుమందుల్లో మలినాలు రాకుండా తయారీదార్లు ఫార్మాకోపియల్ గ్రేడ్ సాల్వెంట్లనే వినియోగించాలి. రిజిస్టర్డ్ లేబొరేటరీల్లో ముడిపదార్థాలు, తుది ఉత్పత్తులను బ్యాచ్‌ల వారీగా పరీక్షలు జరిపి, సవివర రికార్డులను నిర్వహించాలి. ఇండియన్ డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ వంటి పరిశ్రమ సంఘాలు ఈ ముసాయిదాను సమీక్షించి, తమ స్పందన తెలుపుతాయి. దగ్గుమందుగా వినియోగిస్తున్న సిరప్‌ల వల్ల చిన్న పిల్లల్లో పరిమత థెరప్యూటిక్ ప్రయోజనమే ఉంటుందని నిపుణులు అంటున్నారు. దగ్గు అనేది ఒక సహజమైన రక్షణ ప్రతిచర్య అని.. ఈ లక్షణాలను అణచివేయడం కంటే, అందుకు కారణాలపై దృష్టిసారించడం మంచిదని వైద్యులు అంటున్నారు. సిరప్‌లకు బదులుగా హైడ్రేషన్, సెలైన్ డ్రాప్స్, తేనె (ఏడాది వయసుపైన పిల్లలకు) వంటివి సిఫారసు చేయొచ్చని అంటున్నారు.

# నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

- త్వరలోనే పరిహారం అందజేసి కాలువల పనులు పూర్తి చేస్తాం..
- మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి 4ఎకరాల స్థలం పరిశీలన
- రైతులు ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేయాలన్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్





చిగురుమామిడి ఏప్రిల్ 12 (జనంసాక్షి):గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు త్వరలోనే పరిహారం అందజేసి కాల్వల పనులు పూర్తి చేస్తామని, అందుకు ప్రతి రైతు సహకరించాలని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కోరారు.ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ స్కూళ్లలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం చిగురుమామిడి రైతు వేదిక వద్ద వ్యవసాయ యాంత్రికరణ పథకం 2025,2026 రైతులకు వచ్చిన వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పంపిణీ చేశారు. అవసరం ఉన్న,అర్హత కలిగిన ప్రతి రైతుకు సబ్సిడీలో వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.5ఎకరాల పైన ఉన్న రైతులు ఆయిల్ ఫాం సాగు చేయాలని,చిన్న గ్రామాల్లో 50ఎకరాలు పెద్ద గ్రామాల్లో వంద ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని సూచించారు.ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు కోతులు,పకృతితో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అవసరమైతే నర్మట ఆయిల్ ఫ్యాన్ ఫ్యాక్టరీని విజిట్ చేయాలని కోరారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు రావాలంటే పిల్ల పాపలతో వచ్చి తీసుకెళ్లే పరిస్థితి ఉండేదని, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో వెనువెంటనే చెక్కులను అందజేస్తున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు జరిగే నాలుగు వరుసల రహదారి నిర్మాణా నికి ప్రజలంతా సహకరించాలని,ప్రస్తుత వేసవి కాలంలో రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకాడే,ఆర్డీవో మహేష్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సర్పంచ్ ఆకారం భవాని శివప్రసాద్,తాహశీల్దార్ ముద్దసాని రమేష్,ఎంపీడీవో విజయ్ కుమార్,పలు గ్రామాల సర్పంచులు మార్క రాజ్ కుమార్ గౌడ్,గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, కాటం సంపత్ రెడ్డి, జంగా శిరీష వెంకటరమణారెడ్డి,కొంకట మౌనిక,సన్నీల్ల కవిత వెంకటేశం,అలవాల శంకర్,చింతపూల నరేందర్,అల్లేపు సంపత్, గోగురి లక్ష్మీ మురారి రెడ్డి,గూళ్ల రజిత రాజు,మాజీజెడ్పిటిసి గీకురు రవీందర్,చిట్టుమల్ల రవీందర్,దాసరి ప్రవీణ్ కుమార్ నేత,వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,రైతులు,లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్లో స్కాలర్స్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 12 జనం సాక్షి :** ఇంటర్మీడియట్ 2026 ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో, గతంలో మాదిరిగా ఎంపీసీ ,బైపీసీ గ్రూపులలో స్కాలర్స్ విద్యార్థులు విజయ దుందుభి మారు మ్రోగించారు..ద్వితీయ సం బైపిసి లో బి. మహాలక్ష్మి 993 మార్కులు, అలీషాసాజి- 992, సుస్మిత - 991, బాంధవి- 990 మార్కులు సాధించారు.ద్వితీయ సం ఎంపీసీ లో కె.నర్మద -992, కె.శిరిష -991, కె. లలిత - 989మార్కులు సాధించారు. ద్వితీయ సం॥ సీఈసీ లో టి.శ్రావణి - 771 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరము ప్రథమ సం బైపిసి లో డి. పల్లవి - 437, నిగ్రు అఫ్రిన్ - 437, బి. అక్షయలక్ష్మి - 436, భవ్యశ్రీ - 434, కే యామిని- 434, స్వాతిక- 434, కే రాజేష్ - 434, ఇందు- 432, అఖిలాండేశ్వరి- 432, గేయశ్రీ - 432, అఖిల- 432 మార్కులు సాధించారు. ప్రథమ సం ఎంపీసీ లో ఎ.బన్ని - 463 మార్కులు, జి.హర్షిత - 462, శ్రీవర్షిని - 462, దివ్యశ్రీ - 460, మార్కులు సాధించారు. ప్రథమ సం సీఈసీ. లో ముస్కన్- 406 మార్కులు సాధించారు.ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను వీరిని ప్రోత్సహించిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపాల్స్ ఎ. శ్రీధర్, బి. మధుసూదన్ గుప్త డైరెక్టర్లు డా పి.జగదీశ్వర్, డా జి. వరప్రసాదరావు, డా బి. నాగేశ్వర్రెడ్డి,డా ఎల్. సత్యనారాయణరెడ్డి పుష్పగుచ్ఛములతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు సిబ్బంది పాల్గొన్నారు.



## చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

**కోట్పల్లి ఏప్రిల్ 12 (జనం సాక్షి):**
నాగ్ సాన్ పల్లి చెరువులో చేపల వేటకు వెళ్ళి బర్వాద్ గ్రామానికి చెందిన ఇద్దరు మృతి ఆదివారం జరిగింది. ఈనెల 10 న సాయంత్రం బర్వా ద్ నుండి చేపల వేటకని ఇంట్లో చెప్పి చాకలి అంజయ్య దోమ పండు అనే ఇద్దరు వ్యక్తులు ఇంటి నుండి వెళ్ళిగా రెండు రోజుల నుండి ఇంటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు ఆదివారం నాడు ఉదయం సమయంలో నాగ్ సాన్ పల్లి చెరువు వద్దకు వెళ్ళి చూడగా ఇద్దరు నీటిలో శవాలుగా తేలుతూ వుండగ ఇట్టి విషయం కోట్ పల్లి పోలీస్ వారికి తెల్పడంతో గ్రామస్తుల సహాయం తో వారిని నీటిలో నుండి తేసి చాకలి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పంచనామా చేసి కేసు నమోదు చేయడం జరిగినది. పోస్టుమార్టం అనంతరం శవాలను బంధువులకు అప్పగించారు.




## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మంథని, ( జనంసాక్షి ) : ఒకప్పుడు అటవీ ప్రాంతం విద్యాభ్యాసన కు అనుకూలంగా లేని ప్రాంతం నేడు హైదరాబాద్ లాంటి ప్రాంతంలో కార్పొరేట్ పాఠశాలలో లేని సౌకర్యాలకు మించిన సౌకర్యాలు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రిమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో ప్రభుత్వ పాఠశాలలు.. ఇటు ప్రభుత్వ నిధులు, అటు సి ఎస్ ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలు ఆధునిక హంగులతో ముస్తాబు అవుతున్నాయి. ఒక గొప్ప ఆలోచన తో మారుమూల ప్రాంతం కాదు ఇది ప్రభుత్వ పాఠశాలలో కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించే మహోన్నత విద్యానిలయాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక చొరవ చూపిస్తున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి పిఆర్టియుటిఎస్ పునః నిర్మాణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కర్రు సురేష్ కృతజ్ఞతలు తెలియ జేశారు. గొప్ప ఆలోచన విధానం కలిగిన శ్రీధర్ బాబు ఇదే విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కి త్వరలో శ్రీకారం చూపుతారని ఆశిస్తున్నామని కర్రు సురేష్ అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రభుత్వ విద్యాభివృద్ధికి చేస్తున్న ఈ మహా యజ్ఞానికి సహకరిస్తున్న రామ్ కి ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ లకు కర్రు సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రెనే హాస్పిటల్‌లో రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి చికిత్స యంత్రం





- కె.టి.ఆర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం
- లక్కీడ్రా ద్వారా 15 మందికి ఉచిత కీలు మార్పిడి

**కరీంనగర్, ఏప్రిల్ 12 (జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెనే హాస్పిటల్‌లో ఉత్తర తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి చికిత్స యంత్రాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కె.టి.ఆర్) ఘనంగా ప్రారంభించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు రెనే హాస్పిటల్‌లో వాలిస్ కంపెనీకి చెందిన సుమారు ఐదు కోట్ల విలువ చేసే అత్యాధునిక రోబోటిక్ సర్జరీ యంత్రాన్ని కె.టి.ఆర్. ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.టి.ఆర్ మాట్లాడుతూ, ఇలాంటి అత్యాధునిక వైద్య సదుపాయాలను జిల్లా కేంద్రాల్లో అందుబాటులోకి తెచ్చిన రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి, డా. రజనీ ప్రియదర్శిని లను ప్రత్యేకంగా అభినందించారు. చైర్మన్ డా. బంగారి స్వామి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు బంగారి లక్ష్మి, మైసయ్య పేరుతో సుమారు 50 లక్షల రూపాయల విలువైన సర్జరీలను తాను, తన సతీమణి డా. రజనీ ప్రియదర్శిని ఉచితంగా చేయడం జరుగుతోందన్నారు. తాను వైద్య రంగంలో ఉన్నంత కాలం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, తమ కుటుంబం అంతా వైద్య సేవకే అంకితమని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా 180 మంది రిజిస్ట్రేషన్ నుంచి 15 మందిని ఎంపిక చేసి వారికి పూర్తి ఉచితంగా మోకాలి కీలు మార్పిడి చికిత్సను రాబోయే నెల రోజుల్లోగా నిర్వహిస్తామని చైర్మన్ ప్రకటించారు. మిగతా వారికి అతి తక్కువ ఖర్చులో ఆపరేషన్ చేస్తామని, ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మున్సిపల్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ సుడా చైర్మన్ జి.వి. రామకృష్ణా రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.
రెనే హాస్పిటల్ యాజమాన్యం ఈ అత్యాధునిక సదుపాయం ద్వారా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యం అందించడం హర్షణీయమని స్థానికులు అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభను చాటిన గురుకుల విద్యార్థినిలు

**మల్యాల ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** తాటిపెల్లి గురుకుల పాఠశాల మరియు కళాశాల ఇంటర్ విద్యార్థులు ఆదివారం వెలువడిన ఫలితాల్లో ప్రతిభను చాటారు.ఎంపీసీ రెండవ సంవత్సరంలో డి.రుచిత 994,బైపిసి రెండవ సంవత్సరంలో కె.ప్రణీత 992,ఎంపీసీ మొదటి సంవత్సరం లో పి.దీక్షిత,ఆర్ అక్షిత 467,బైపిసి మొదటి సంవత్సరం కె.రిషిక 437 మార్కులు సాధించారు.ప్రిన్సిపల్ మానస, అధ్యాపకులు అభినందించారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే

### ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలి



గంభీరావుపేట, ఏప్రిల్ 11 (జనంసాక్షి): అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైనదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు అన్నారు. శనివారం గోరంటాల గ్రామంలో గంభీరావుపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శాస్త్ర బోయిన లక్ష్మణ్ ముదిరాజ్ అధ్యక్షతన జ్యోతిబాపూలే 199వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ, భారతదేశ తొలి సంఘ సంస్కర్త, సామాజిక న్యాయ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలే అన్నారు. రెండు వందల సంవత్సరాల క్రితమే సమాజంలోని అసమానతలపై, కుల వివక్షపై సమసమాజ స్థాపన కోసం పోరాడి అనేక త్యాగాలు చేసిన గొప్ప చరిత్ర ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు, గోరంటాల గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మ మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే ఒక సామాన్యుడు కాక విప్లవకారుడుగా భారతదేశంలోనే సామాజిక మానవత్వం, అంటరానితనం, కులక్షేత్రం కోసం పోరాడిన వ్యక్తి అని, స్త్రీలకు విద్య వంటి అంశాలపై ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లు గారి నర్సాగౌడ్, వార్డు సభ్యులు గ్యార దేవరాజు రెడ్డి, మల్ల రాజనర్సు, మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు ఎర్రోళ్ల శంకర్, ఎమ్మార్పీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శనిగారపు నరేష్, దళిత నాయకులు నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు ముసుగులో వసూళ్లు

### - నిందితుడి అరెస్ట్.. కత్తితో బెదిరించి ఫోన్ పే ద్వారా నగదు వసూలు

- వేములవాడలో నకిలీ జర్నలిస్టు రిమాండ్
- బాధితులను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవు
- వేములవాడ టౌన్ సీఐ వీర ప్రసాద్ హెచ్చరిక

వేములవాడ, ఏప్రిల్ 11 (జనంసాక్షి):జర్నలిస్టునని చెప్పుకుంటూ ఓ సూపర్ మార్కెట్ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నిందితుడిని వేములవాడ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వేములవాడ టౌన్ సీఐ బి. వీర ప్రసాద్ వివరాలను వెల్లడించారు. చంద్రంపేటకు చెందిన గోడిశేల మహేష్ అనే వ్యక్తి జర్నలిస్టుగా పరిచయం చేసుకుని, వేములవాడకు చెందిన ఓ సూపర్ మార్కెట్ యజమానిని భయభ్రాంతులకు గురిచేశాడు. అధికారులతో తనిఖీలు చేయిస్తానని, పత్రికల్లో వ్యతిరేక వార్తలు రాస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. కత్తితో ప్రాణహాని తలపెడతానని హెచ్చరించి బాధితుడి నుండి ఫోన్ పే ద్వారా రూ. 42,000 వసూలు చేశాడు. నిందితుడు మళ్లీ డబ్బుల కోసం వేధిస్తుండటంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.ఎస్ఐ రామ్మోహన్, కానిస్టేబుల్ గోపాల్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా ప్రెస్ లేదా అధికారుల పేరుతో బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. నిందితుడు మహేష్ చేతిలో మరెవరైనా మోసపోయి ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# హయత్‌నగర్‌లో ఫోర్జరీ పత్రాలు సృష్టించి బ్లాక్‌మెయిల్

- 43 లక్షలు మోసం చేసిన నిందితులు అరెస్టు
- ఇల్లు, ప్లాట్లు అమ్ముతామని నమ్మించి లక్షలు వసూలు

**హయత్‌నగర్, ఏప్రిల్ 12 (జనంసాక్షి):** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోర్జరీ పత్రాలు సృష్టించి బాధితుని బ్లాక్‌మెయిల్ చేసి విడతల వారిగా లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఐత రాజు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, ఫోర్జరీ తదితర సెక్షన్లతో కేసు నమోదైంది. ప్రధాన నిందితులైన ఐతరాజు శంకరయ్య (48), ఆడెపు రాము (32)లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
నిందితులు ఐతరాజు శంకరయ్య, ఆడెపు రాము, వడ్ల మురళి, పెండెం శివ, మధుసూదన్‌లు కలిసి బాధితుడు ఐతరాజు ఆంజనేయులను నమ్మించి, ఇల్లు తక్కువ ధరకు 27 లక్షల 50 వేల రూపాయలకు కొనిపిస్తామని చెప్పి మొదట అడ్వాన్స్ తీసుకున్నారు. తర్వాత విడతల వారీగా 23 లక్షలు తీసుకొని ఇంటిని రిజిస్ట్రేషన్ చేయకుండా మాయమాటలు చెప్పి కాలయాపన చేశారు. డబ్బులను వేరే రెండు ప్లాట్లలో పెట్టుబడి పెట్టినట్లు అబద్ధం చెప్పి, నకిలీ సంతకాలతో ఫోర్జరీ అగ్రిమెంట్లు తయారు చేసి, ఆ రెండు ప్లాట్లను 46 లక్షల ధరకు అమ్ముతామని చెప్పి బాధితుని నుంచి మొత్తం 43 లక్షలు తీసుకున్నారు. ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారు. నిందితులు బాధితుని డబ్బులను ఇతర రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో వినియోగించినట్లు విచారణలో తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్న కే. అరుణ్ కుమార్ ఎస్ఐ మాట్లాడుతూ, నిందితులు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి నమ్మకద్రోహం చేసి 43 లక్షలు తీసుకొని తిరిగి రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసినట్లు తేలిందన్నారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తామని హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ పి. నాగరాజు గౌడ్ తెలిపారు. అన్యాయంగా, మోసపూరితంగా బాధితులను మోసం చేసిన వారు ఎవరైనా చట్టప్రకారం శిక్షించబడతారని హెచ్చరించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



## రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో మెరిసిన జాగృతి విద్యార్థులు

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 12 జనం సాక్షి :**
ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో జాగృతి విద్యార్థులు విజయకేతన్ ఎగరవేశారు. ఏప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఇంటర్మీడియట్ ఫలితాల్లో, రాష్ట్ర ,జిల్లా స్థాయి ర్యాంకులను సొంతం చేసుకుంది. క్రమశిక్షణగా మారుపేరుగా నిలిచిన జాగృతి కళాశాల, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యను అందించడంతోపాటు, ఎప్పటికప్పుడు విద్యార్థులతో మమేకమై, ఈ ర్యాంకులు సాధించేందుకు కళాశాల యజమాన్యం నిరంతరం కృషి చేసిందని చెప్పవచ్చు. అందుకు నిదర్శనమే ఈ ఫలితాలు. జాగృతి కళాశాల బైపిసి రెండవ సంవత్సరం విద్యార్థి హెచ్ అనుష్క 994, ఎన్ అర్చన 993, రెండో సంవత్సరం ఎంపీసీలో అపూర్వ 992, త్యాగరాజు 992, బి ఇందు 991, పి లావణ్య 990, రెండవ సంవత్సరం ఎం ఇ సి యశ్వంత్ 965, రెండో సంవత్సరం సీఈసీ శ్రీలత 954, మొదటి సంవత్సరం బైపిసి లో ఉజ్మ హాజరా 438 మార్కులతో స్టేట్ ఫస్ట్ తో, ఎం హరీష్ 437 స్వప్న 437, అశ్విని 435, మొదటి సంవత్సరం ఎంపీసీ కే హిమలత 466, గాయత్రి 466 సాయి చరణ్ తేజ్ 465, ఎం ఇ సి శ్రావణ్ కుమార్ 460 సీఈసీ 491 ప్రణీత బి శ్రావణి 482 తో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ తెలియజేశారు. అలాగే జేఈఈ మెయిన్స్ 2026 లో సిహెచ్ అర్జున్91.69 శాతం తో జిల్లాలోని అగ్రగామిగా నిలిచారు. స్టేట్ మొదటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు జిల్లా స్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థులను కళాశాల యజమాన్యం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయి ర్యాంకులను సాధించడం గర్వంగా ఉందని అందుకు కారణమైన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, కళాశాల యజమాన్యం అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో కళాశాల యజమాన్య సభ్యులు భాస్కర్, శ్యామ్ కుమార్ ,సత్యనారాయణ కళాశాల లెక్చరర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పథకంతో పేదల స్వంత ఇంటి కల సాకారం

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- అర్హులైన అందరికీ ఇండ్లు మంజూరు చేస్తాం
- ఆయిల్ ఫాం సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



ఎలిగేడు,ఏప్రిల్ 12(జనంసాక్షి) : ఇందిరమ్మ పథకం తో పేదల స్వంత ఇంటి కల సాకారం అవుతుంది అని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు. మండలం లోని, బురహన్మియపేట గ్రామంలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గుజ్జుల రవళి - విజేందర్ రెడ్డి, బొంగోని రమ సంపత్, గుజ్జుల లావణ్య - ప్రశాంత్ రెడ్డి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొని ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్, విజయ రమణారావు ప్రారంభించారు.తదుపరి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గ్రామస్తులు ఎమ్మెల్యే విజయరమణ రావు ను,ఘనంగా సత్కరించారు.తదుపరి గ్రామంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే విజయరమణ రావు పాల్గొన్నారు.అనంతరం నర్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొని ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల పాటు పేద, మధ్యతరగతి ప్రజలను మభ్యపెట్టి ఇండ్లు ఇవ్వకుండా తీరని అన్యాయం చేసిందన్నారు. వారికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటి లబ్ధిదారునికి రూ.5 లక్షల సహాయం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతని కొనియాడారు. మొదటి విడతగా మంజూరి చేసిన ఇందిరమ్మ ఇండ్లలో నిర్మాణపు పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించడం జరిగింది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంది అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు కలిగినా కూడా సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు గుర్తు చేశారు. అయిల్ ఫాం సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. వరి పంటకు మాత్రమే పరిమితం కాకుండా రైతులు బీరకాయ, దొండకాయ, కాకరకాయ, చిక్కుడుకాయ వంటి పంటలతో పంట మార్పిడి ద్వారా మంచి లాభాలు సాధిస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గోపు రజిత లక్ష్మ రెడ్డి,నర్సపూర్ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు,పలు గ్రామాల సర్పంచ్ లు, ఉ పసర్పంచ్ లు మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
13 ఏప్రిల్ 2026

## కేటీఆర్, హరీష్‌రావులను కలిసిన మహేష్ బిగాల






హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావును బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కో–ఆర్డినేటర్ మహేష్ బిగాలా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావు మహేష్ బిగాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. మహేష్ బిగాలా గారు వారి ఆశీస్సులు తీసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో అరాచక రాజకీయం

### దోచుకో దాసుకో స్కీంను అమలు చేస్తున్న కాంగ్రెస్

- సీఎం కుటుంబానికి సింగరేణి టెండర్లు
- ప్రజా తీర్పుకు వ్యతిరేకంగా పన్నాగాలు
- బ్లాంక్ చెక్ ఇస్తానన్న పట్టించుకోని కౌన్సిలర్లు
- ఖ్యాతనపల్లిలో ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన కౌన్సిలర్స్
- బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్



మంచిర్యాల ప్రతినిధి ఏప్రిల్ 12 (జనంసాక్షి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మోసపు మాటలతో అధికారం చేపట్టి అరాచక పాలన కొనసాగిస్తుందని దోచుకో దాసుకో అనే స్కీం ను సీఎం బావమరిది పేరిట అమలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్మాణం అవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని, అలాగే మెడికల్ కాలేజీలను సందర్శించారు. అనంతరం నస్పూర్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఖ్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ మంత్రి వివేక్ కౌన్సిలర్లను కొనడానికి ప్రయత్నించి భంగపడ్డారని తెలిపారు. ప్రజలు ప్రజాస్వామ్య బద్ధంగా ఇచ్చిన తీర్పును మంత్రి బేకాతరూ చేస్తూ బ్లాంక్ చెక్కులు ఇస్తానని కౌన్సిలర్లకు గాలం వేశారని అయినా బిఆర్ఎస్ కౌన్సిలర్లు మొక్కవోని ధైర్యంతో ఖ్యాతనపల్లి మున్సిపాలిటీ కైవసం చేసుకున్నారని వారిని ఆయన అభినందించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ దక్కించుకునేందుకు వెయ్యి మంది పోలీసులను నియమించుకొని కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేసి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమనును మంత్రి వివేక్ అక్రమ కేసులు బనాయించి జైలు కూడా పంపించాడని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నికల్లో ఆరు గ్యారంటీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. నవంబర్లో తీసుకుంటే చేయూత పెన్షన్ 2000 ఇస్తారని డిసెంబర్లో నేను గెలిస్తే 4000 పెన్షన్ ఇస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి ఇంతవరకు ఒక రూపాయి పెంచలేదని ఎద్దేవా చేశారు . కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తానని చెప్పిన సీఎం కోటి మంది మహిళలకు ఎన్ని డబ్బులు కావాలో అవగాహన ఉండే మాట్లాడుతున్నాడా? అని మోసం మాటలు చెప్పడం తప్ప ఆయన చెప్పిన మాటలు ఆచరణలో అమలుకు నోచుకోదని తెలిపారు. సింగరేణి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులు వారసత్వ ఉద్యోగాలతో సుఖసంతోషాలతో ఉండేవారని ఉండేవారని ఇప్పుడు సింగరేణి అవినీతి కుంభకోణంలో మునిగిపోయిందని ఆయన ఆరోపించారు సింగరేణిలో టెండర్లు సీఎం బావమరిది సుజన్ రెడ్డికి అక్రమంగా ఇస్తు న్నారని ఆరోపించారు. సైటు విజిట్ పేరుతో కాంట్రాక్టర్లను టెండర్ వేయకుండా అడ్డుకొని సింగరేణి అధికారులచే టెండర్లు వేస్తానన్న కాంట్రాక్టర్లకు సైటు విజిట్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందుల గురిచేసి ఎట్టకేలకు సింగరేణి టెండర్ వర్క్ అన్ని సీఎం కుటుంబానికి చెందినట్లు ప్రణాళిక బద్ధంగా దోసుకుంటున్నారని పేర్కొన్నారు. సింగరేణి నిలువునా దోచుకుంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ ప్రేక్షక పాత్ర వహిస్తుందని బిజెపి కాంగ్రెస్ ఒకరికొకరికి సహకరించుకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు . సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు మెడికల్ బోర్డు అమలు చేయడం లేదని అమలు చేయకపోగా గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 16 వేల ఉద్యోగాలపై విజిలెన్స్, ఏసీబీ ఎంక్వయిరీ చేస్తామని చెప్పడం వారి మూర్ఖత్వానికి నిదర్శనం అని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా రేవంత్ రెడ్డి లాగా లేకి మాటలు మాట్లాడడం లేదని అదిలాబాద్ జిల్లాలో బహిరంగ సభలో మాట్లాడుతూ మూడు నెలలకు అభివృద్ధి జరుగుతుందా అని అను పార్లమెంటు లాంగ్వేజ్‌లో మాట్లాడడం ఆయన ముర్కత్వానికి నిదర్శనమని తెలిపారు . ఆరూ గ్యారంటీలు మూడు సంవత్సరాల క్రితం బాండ్ పేపర్‌పై రాయించి ఏం చేశారని విమర్శించారు. తులం బంగారం , వృద్ధులకు చేయూత పెన్షన్ 4,000 ఇస్తా మహిళలకు 2500 గృహలక్ష్మి ఇస్తానాని చెప్పిన సీఎం ఎక్కడ అమలు చేశారని తెలిపారు. కాలేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరం ప్రాజెక్టు లాగా అభివర్ణించారు కాలేశ్వరం ప్రాజెక్టు మూలంగా కొన్ని కోట్ల టన్నుల వడ్లు ఎక్కువ ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధమంటూ పలికి 52 కోట్లు కేటాయిస్తే అది ఎన్ని సంవత్సరాలకు పూర్తయి తదని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి శ్రద్ధ లేదని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన ఖ్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మిగతా కౌన్సిలర్లను మాజీ మంత్రి రామారావు వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, దివాకర్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మూల రాజిరెడ్డి టీజీబీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలతో ప్రమాదం

- ఒకరికి తీవ్ర గాయాలు



చెన్నారావుపేట, ఏప్రిల్ 12 (జనంసాక్షి) : మండలంలోని తోపనగడ్డ తండా సమీపంలో నెక్కొండ గూడూరుకు వెళ్లే ప్రధాన రహదారి పై ఆరబోసిన మొక్కజొన్నలు ప్రమాదానికి కారణమయ్యాయి. ఆదివారం రాత్రి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్న సూరిపల్లి గ్రామానికి చెందిన పూజారి వెంకన్న రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలపై జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పంటలను రోడ్లపై ఆరబోయడం వల్ల తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని వారు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రోడ్లపై పంటలు ఆరబోసే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రహదారుల భద్రతపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

## అత్యుత్తమ రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించిన సీవీ రామన్ కళాశాల విద్యార్థులు



వనపర్తి బ్యూరో ఏప్రిల్ 12 (జనంసాక్షి) : నేడు ప్రకటించిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో సి వి రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ విజయ పరంపరను ఈ సంవత్సరము ఫలితాలలో కూడా కొనసాగించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలను సాధించడం సివి.రామన్ కే సాధ్యం. మా కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపులలో మంచి ఫలితాలను ఫలితాలను సాధించటం జరిగింది. ప్రథమ ,ద్వితీయ సంములలో మా విద్యార్థులు ఘనమైన ఫలితాలను సాధించినందుకు వారికి వారి తల్లితండ్రులకు, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందమునకు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అద్భుతమైన ఫలితాలను సాధించినందుకు కళాశాల యాజమాన్యము విద్యార్థులను, పూలబోకెలతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డా కె. వీరయ్య , డైరక్టర్స్ వెంకటేశ్వర్లు , కుమారస్వామి , ప్రిన్సిపాల్ జి.యస్.యస్. ప్రకాశ్ , సీనియర్ అధ్యాపకులు యస్. వెంకటరమణ, జమీర్ ఖాన్, మల్లిఖార్జున్, వెంకటేశ్వర్ రెడ్డి, లింగస్వామి, శ్రీధర్, చంద్రశేఖర్, హనుమంతరావు, మనివర్ధన్, మహేందర్, రమేష్. శేఖర్ గౌడ్ మహేష్ పాల్గొన్నారు. మావిద్యార్థులు అన్ని గ్రూపులలో సాధించిన మార్కులు 900 పైగా మార్కులు 133 మంది విద్యార్థులు సాధించడం జిల్లా రికార్డు. ఎంపీసీ రెండు సంవత్సరం 993 – వి. మేఘన, 992 – అక్షయ, 992 – హన్సిక, 992 – సానియా, 992 – యం. స్వాతి, 991 – ఈ శ్రావణి, 989 – శ్రీహర్ష రెడ్డి, 988 – తనుశ్రీ, 988–కార్తీక్, 988 హెచ్, సాగర్, బైపీసీ రెండో సంవత్సరంలో 991 – సి. లక్ష్మీనారాయణ, 986 – పి. సూర్యవర్షిణి, 979 జి. మదుమోహన్ రెడ్డి, 979 – జి కావ్య, ఎం ఇ సి రెండో సంవత్సరంలో 983– వి నందిని, 967 – సి. జ్ఞనేశ్వరి, సీఈసీ రెండు సంవత్సరంలో 884 – ఆర్. వైష్ణవి, 828 – రామాంజనేయులు మార్కులు సాధించారు. 400కు పైగా మార్కులను 131 మంది విద్యార్థులు సాధించడం జిల్లాలోనే రికార్డుగా నిలిచింది. ఎంపీసీ మొదటి సంవత్సరం నవ్య సుధా 468, కావ్య 468, మనస్విని జై సూర్య సుమన్ 467, నార్మల్ గారు శ్రావణి 466 అక్షయ్ 465 బైపీసీ మొదటి సంవత్సరం మురళీకృష్ణ 433, అభిలాష్427 హారిక 423, ఎంఈసి 489 రాకేష్ నాయుడు 475 గురు ప్రసాద్, సి ఈ సి 479 ,శివకుమార్ 475, కే అనిల్ 466 బోజేష్ సాధించాలని కళాశాల యజమాన్యం తెలిపారు.

## స్టేట్ ర్యాంకు సాధించి వనపర్తికి వన్నెతెచ్చిన రావూస్ కళాశాల



వనపర్తి బ్యూరో ఏప్రిల్ 12 (జనంసాక్షి): ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో స్టేట్ ర్యాంకును సాధించి వనపర్తి జిల్లాకే వన్నెతెచ్చిన రావుస్ కళాశాల విద్యార్థులు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో మొదటి ర్యాంకుల సాధించి కళాశాల పేరును తెలంగాణ రాష్ట్రం లోనే వినిపించిన రావుస్ కళాశాల విద్యార్థులు. ఇంటర్మీడియట్–2026 ద్వితీయ సంవత్సరంలో రావూస్ విద్యార్థులు సాధించిన రాష్ట్రస్థాయి మార్కులు వనపర్తి ఇంటర్ ఫలితాల్లో చరిత్రలో మొదటిసారిగా సీనియర్ ఎంపీసీ స్టేట్ ఫస్ట్ మార్కులు సాధించిన ఏకైక కళాశాలగా 'రావూస్ నిలిచింది. సీనియర్ ఎంపీసీ ఎం హర్షిత శ్రీ– 996 , ఎం అక్షయ–994, రేష్మ బేగం–994, బి సంతోష్ నాయుడు–993, సీనియర్ బైపిసి,ఎం గీతాంజలి–994(జిల్లా మొదటి ర్యాంకు , టి రాధా –991, బి గోవిందమ్మ– 990,సీనియర్ ఎంఈసి పి కీర్తన–979, అయిషా బేగం–975, సీనియర్ సి ఈ సి లో ఎండి షారుక్ ఖాన్–955, (ఇంటర్మీడియట్– 2026) ప్రథమ సంవత్సరంలో రావూస్ విద్యార్థులు సాధించిన రాష్ట్రస్థాయి మార్కులు జూనియర్ ఎంపీసీఏ ప్రణయ్ తేజ–468, ఏం లావణ్య–468, ( ఉమ్మడి జిల్లా ఫస్ట్ ర్యాంక్) నీ భార్గవి–467, ఎన్ భవిష్య–467, అలేఖ్య ఆనందిని–467, నాగేంద్ర–467, శిల్పారెడ్డి–467, తేజశ్రీ–466, కే శ్రీకాంత్– 466, జియావుద్దీన్ 466, షేక్ మజ్–466, బి వినయ్–465, అభిత్రిని–465, జోష్నా– 465, స్పందన–465, ఈ రిషిత–465, పి నందిని–464, బి ఇందు–464, వై రాజేష్– 462 జూనియర్ బైపిసి,భీష్మ–438, రాష్ట్ర స్థాయి మార్కులు బి అశ్విని–437, కీర్తి– 436, హేమంత్–434, ఎం ఇందు–432 జూనియర్ ఎం ఈ సి ,ఎం చార్లిష్496, పి అక్షయ–494,జూనియర్ సీఈసీ, సుదనవ్– 473,రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్,ఇ. రామ్ కుమార్, యాజమాన్య సభ్యులు ఎ.శ్రీనివాసులు,కె. శ్రీనివాసులు, పి. అమరేంధర్ రెడ్డి బి. రమేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యమున్న విద్యార్థు ల చేత ఈ ర్యాంకులు సాధించి నందుకు ఎంతో గర్వంగా ఉందని వారు తెలిపారు. విద్యార్థుల కృషితో పాటు యజమాన్య సభ్యులే విద్యార్థులకు విద్యను అందించి, ఈ ర్యాంకు లు సాధింప చేశారని, వనపర్తి కీర్తిని తెలం గాణకె చాటి చెప్పిన మా కళాశాల విద్యా ర్థులకు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## అమెరికాలో బొబ్బిలి టెకీ మృతి

అమరావతి (జనంసాక్షి) : అమెరికాలో విషాదం నెలకొంది. ఏపీకి చెందిన యువకుడు స్నానానికి చెరువులో దిగి మరణించాడు. పుట్టిన రోజు నాడే ప్రాణాలు కోల్పోవడంతో అతని స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్, రమ దంపతుల కుమారుడు సాయి శ్రీ హరికృష్ణ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. చదువు పూర్తి కాగానే మూడు నెలల కిందట అక్కడే ఉద్యోగం కూడా సంపాదించాడు. ఇదిలా ఉంటే శనివారం తన పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. అక్కడే చెరువులో స్నానం చేస్తుండగా అందులో మునిగి చనిపోయాడు. పుట్టిన రోజు నాడే దేశం కాని దేశంలో తమ కుమారుడు మరణించడంతో హరికృష్ణ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హరికృష్ణ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కోచ్ తిరుమలరావుతో అథ్లెటిక్స్



హనుమకొండ (జనంసాక్షి) : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ కప్ అండర్–20 (బాస్ అండ్ గర్ల్), (సీనియర్) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా సీతక్క తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ క్రీడల్లో మన తెలంగాణ పిల్లలు రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని ప్రభుత్వం దీనికి ప్రోత్సహిస్తుందని చెప్పుకొచ్చారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన అథ్లెట్లు విశేష ప్రతిభ కనబరిచారు. కోచ్ తిరుమల రావు శిక్షణలో ఉన్న విద్యార్థులు పలు విభాగాల్లో మెడల్స్ సాధించి జిల్లాకు గౌరవం తీసుకొచ్చారు. ఈ పోటీల్లో మహిళలలో 400 మీటర్ల పరుగులో పోత్రకుండ సరిత కాంస్య పతకం సాధించగా, యు–20 గణేష్ 110మీ హర్డిల్స్ ఫైనల్స్‌లో 5వ స్థానం, హేమర్ త్రో ఫైనల్స్‌లో 4వ స్థానం, వాసుదేవ రాజు షాట్ పుట్ ఫైనల్స్‌లో 6వ స్థానం, మహిళల రజిని 100మీ పరుగు ఫైనల్స్‌లో 6వ స్థానం, పురుషులలో శ్రీనివాస్ 1500మీ మంచి ప్రతిభ కనబరిచారు అని కోచ్ తెలిపారు. అలాగే తమ అథ్లెట్స్ కన్నా కోచ్ కూడా ఎందులో తీసుకోకుండా సీనియర్స్ పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ మరియు ట్రిపుల్ జంప్ లో తిరుమల రావు రెండు రజత పతకాలు అందుకున్నారు. మంచి ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు రానున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా విజేతలను కోచ్ తిరుమల రావు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వేసవి వేడి నుంచి ఉపశమనం

### చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయితీలు, మండల కేంద్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవ రాజన్ కు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించే వారు, పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించా రు. వేసవి కాలంలో సాధారణ ప్రజల ఇబ్బందు లను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో, ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో, బస్ స్టాండ్‌లు, మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన రహదా రుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాల న్నారు. ప్రయాణ సమయంలో అలసటకు గురయ్యే వారికి, కూలీలు, రైతులు, రోజువారీ పనుల కోసం వెళ్లే ప్రజలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇప్పటికే ములుగు నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు పూర్తి కాగా, ప్రజలు ఈ సౌకర్యాన్ని విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని మంత్రి సీతక్క కోరారు. గత ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి తాగునీరు అందించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మరింత విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాల న్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. వేసవి వేడి కారణంగా ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించా రు. మంత్రి సీతక్క ఆదేశాలతో ప్రతి గ్రామ పంచాయతీలో చలివేంద్రాల ఏర్పాటుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చర్యలు చేపట్టినట్లు శాఖ డైరెక్టర్ దివ్యా దేవ రాజన్ తెలిపారు.



## ఘనంగా సంగీత-నాట్య సౌరభం

### సేవాభూషణ్ పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ (జనంసాక్షి) : శ్రీపురం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక, చిక్కడపల్లి లో నిర్వహించిన "సంగీత–నృత్య ప్రార్థన సేవాభావంతో పురస్కారాల ప్రదానం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు సమాజానికి మార్గదర్శకాలని, సంగీతం, నృత్యం ద్వారా ఆధ్యాత్మికతను ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని తెలిపారు. సేవా భావంతో కళాకారులను ప్రోత్సహించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులైన కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రముఖులు, ఆహ్వానితులు, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ 2026 ఫలితాలలో
# ఎస్వీజెసి విద్యాసంస్థల విజయ దుందుభి

**కళాశాల కరెస్పాండెంట్ ఉట్కూరి మహేందర్ రెడ్డి**

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :**

ఆదివారం ప్రకటించబడిన ఇంటర్– 2026 ప్రదమ, ద్వితీయ సంవత్సర పలితాలలో మా కరీంనగర్ ఎస్వీజెసి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు. ఆదివారం రోజు ప్రకటించిన ఫలితాలలో ఎస్వీ జెసి జూనియర్ కళాశాల చైర్మన్ ఉట్కూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... అత్యుత్తమ ఫలితాలు సాదించిన విద్యార్థులను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. మా విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా అభ్యసించి గణనీయమైన మార్కులు సాధించి మెరుగైన ఫలితాలను రాబట్టారని, అంకితభావంతో కృషి చేస్తే పాదించలేనిది ఏది లేదని నిరూపించారని తెలిపారు. మా సెకండ్ ఇయర్ విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్ కె తమన్నా 992, బోరే వెన్నెల 992, కుడుదుల సహస్ర 989, సిరిపురం వంశీ 989, టుర్ల తన్వి 987, బరిగెల సంజయ్, 987 పూరెల్ల సంజన 986, నల్లవెల్లి అరుణ్ తేజ 986, చోడ హరిణి 986, సాధుల రాజకుమార్ 985, చెల్లారం రాజ శేఖర్ రెడ్డి 984, శైలేంద్ర ఆర్థిక 984, లింగంపల్లి మనోజ్ 98,3 యాంసాని భక్త ప్రహల్లాద 981, ఆశాడపు హర్షవర్ధన్ 981. బైపీసీ విభాగంలో పాగా సహస్ర 994, ముస్త్యాల స్పందన 991, అనికేత్ మిశ్రా 991 హన్మకొండ నాగేశ్వరి 989, లంక శ్రీవల్లి 986, ఒగ్గు శ్రీనిధి యాదవ్ 984, దాసరి శివకుమార్ 980 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగం నందు గుగ్గిళ్ళ గ్రీష్మ 468, సాయిల్లా సాయి కీర్తన 467, దర్శనాల శివాంజలి 466, దుర్గం త్రిక 465, నెల్ల సింధు 465, పరాంకుశం శ్రీ హర్ష 465, బండారి సమీక్ష 464, కర్ల సాయి స్మిత 464, ఏనుగుల అభినవ్ 462, కోని అఖిల 462, కోట పూజిత 462, అభిరామ్ నాయక్ 461, అజ్మీర హనుమంత్ 460, మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో ముల్కల ఉమాదివి 435, ఓ. హర్షం 434, జి. అమూల్య 432 మొదటి సంవత్సరం సీఈసీ భాగంలో జవ్వాజి ఈశ్వర వదన 490, సిహెచ్ అనూష 489, కొండ దక్షిత 486 మార్కులు సాధించారు.



నాణ్యమైన కార్పోరేట్ సాయి విద్యను తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలని ఉద్దేశంతో శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థల నడుస్తున్నాయని తెలిపాడు. శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థలు స్థాపించిన నాటి నుండి రాష్ట్ర స్థాయి ర్యాంకులకు చిహ్నంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. పటిష్టమైన ప్రణాళికలతో పాటు నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల అత్యుత్తము బోధన, విద్యార్థుల పట్టుదల అహర్నిశల కృషి ఫలితంగా శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు, అత్యుత్తమ ఫలితాలతో విజయం సాధించారని తెలిపారు. ప్రతి ఏడాది ఎంసెట్, నీట్, ఐఐటి జేఈఈ పోటీ పరీక్షల లో విద్యార్థులు ర్యాంకులు సాదించి విద్యాసంస్థ ఆణిముత్యాలుగా నిలుస్తున్నారని తెలిపారు. అత్యున్నత పలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఈ ఘనవిజయం లో పాలుపంచుకున్న తమ అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఉట్కూరి మహేందర్ రెడ్డి, ఎస్వీజేసి బాలుర క్యాంపస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, ఎస్వీజేసి బాలికల క్యాంపస్ ప్రిన్సిపాల్ కె. రాంరెడ్డి, డైరెక్టర్లు సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# షరా మామూలే! 240 మందిపై కేసు నమోదు

- సైబరాబాద్‌లో పోలీసుల వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్
- పట్టుబడ్డ 193 ద్విచక్ర వాహనాలు, 38 కార్లు, 9 ఆటోలు

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 12 (జనంసాక్షి) :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వాహనదారులు ప్రతివారం నిర్లక్ష్యానికి పెద్దపీట వేస్తూ తమ పద్ధతిని మార్చుకోకపోగా యధావిధిగా ఫుల్లుగా మద్యం సేవించి పోలీసులకు చిక్కడం సర్వసాధారణంగా మార్చుకున్నారు. పోలీసులు సైతం వాహనదారుల ఆలోచన ధోరణిని మార్చాలన్న గట్టి సంకల్పాన్ని తీసుకొని చట్టాల అమలులో కొంత కఠినత్వాన్ని పాటిస్తే తప్ప ఎట్టి పరిస్థితులలోనూ నగరంలో మధ్యసేవనం అసలు తగ్గే పరిస్థితి లేదని పలువురు సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ను సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం డిసిపి రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 240 మంది మద్యం సేవించి పట్టుబడడం విశేషం. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం డిసిపి రంజన్ రతన్ కుమార్ ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పోలీసుల వీకెండ్ స్పెషల్ డ్రైవ్ ను విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు మొత్తం 240 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 193 మంది



ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 09 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా 38 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతున్న డ్రైవర్లు ఉన్నట్లు డిసిపి తెలిపారు. ఇందులో 199 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 36ఎంజి/100 ఎంఎల్ నుండి 200 ఎంజి/100 ఎమ్మెల్ వరకు, 32 మంది 201 ఎంజి/100 ఎమ్ఎల్ నుండి 300 ఎంజి/100 ఎం ఎల్ మద్యం సేవించడం జరిగిందని, అలాగే 09 మంది 301 ఎంజి/100 ఎమ్మెల్ నుండి 500 ఎంజి/100 ఎమ్మెల్ వరకు మద్యాన్ని సేవించి పట్టు బడడంపట్ల ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో ప్రవేశపెట్టగా గతవారం మొత్తం 86 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో ఇద్దరికీ జరిమానా, జైలు శిక్ష, ఒకరికి జరిమానా సోషల్ సర్వీస్, ముగ్గురికి జరిమానాన్ని విధించడం జరిగిందని డిసిపి మీడియాకు తెలిపారు.







# రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులతో అల్ఫోర్స్ జయకేతనం

- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అన్ని విభాగాల్లో అద్భుత విజయం
- 996 మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు..
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 12 (జనంసాక్షి):**

ఆదివారం రోజు ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థిని, విద్యార్థులు తెలంగాణ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులను సాధించారు. సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు కె. పల్లవి 996, జి. హైంథవి 996, డి.ప్రణవి 996, వై శ్రీ నిత్య 996 రాష్ట్రములో అత్యున్నత స్థానంలో నిలిచారు. 15 మంది విద్యార్థులు 995 ఆపై మార్కులు, 202 మంది విద్యార్థులు 990 ఆపైన మార్కులు సాధించడం విశేషం అని తెలిపారు. సీనియర్ ఇంటర్మీడియట్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను అర్. వైష్ణవి 995, కె.హారిక 995, నభిలాతాహేన్ 995, ఎస్. బ్రహ్మణి 995, ఎస్ ఐశ్వర్య 995 మార్కులు సాధించి రాష్ట్రములో అగ్రగామిగా నిలవడం జరిగింది. 38 మంది విద్యార్థులు 990 అపై మార్కులు సాధించడం విశేషం అని తెలిపారు. ఎంఇసి విభాగంలోను 1000 మార్కులకు గాను కె. మానస 988, మార్కులు సాధించారు. 970 అపై మార్కులు సాధించిన విద్యార్థుల నలుగురు సాధించారు. సిఇసి విభాగంలో ను 1000 మార్కులకు గాను పి. బావోజ్ఞ 987 మార్కులు సాధించారు. 970 అపై మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 18 అని తెలిపారు.

జూనియర్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను డి. వినిష 469, జి. అక్షర 469 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానములో నిలిచారు. 61 మంది విద్యార్థులు 468 అపై మార్కులు, 176 మంది విద్యార్థులు 467 అపై మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని దశదిశలా చాటారని తెలిపారు.

బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను ఎస్. జాగృతి 439, ఏ. హస్విత 439, ఖాన్సా అలియా 439, జి. కావ్యశ్రీ 439 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానము సాధించడము విశేషం అని 20 మంది విద్యార్థులు 438 అపై మార్కులు సాధించారు. 46 మంది విద్యార్థులు 437 అపై మార్కులు సాధించారు. 77 మంది విద్యార్థులు 436 అపై మార్కులు సాధించారని తెలిపారు. ఎం ఇ సి విభాగంలో 500 మార్కులకు గాను ఏమ్. మహాలక్ష్మి 493, మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను వి. ధిక్షిత 494, అనామ్మఫ్రూజ్ 494 మార్కులు సాధించారని విద్యార్థులకు అత్యుత్తమ విద్యద్వారా సంచలనాత్మక విజయాలను నమోదు చేయవచ్చని నాణ్యమైన భోధన ద్వారా అద్భుతాలు సృషించవచ్చు దానికి నిదర్శనం నేటి ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలే అని ప్రగాఢంగా విశ్వసిస్తున్నానని తెలిపారు. ఇటివల ప్రకటించబడిన ఐ.ఐ.టి మెయిన్ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్, ఎమ్సెట్ ఫలితాలలో అఖండ విజయం సాధిస్తారని నా ప్రగాఢ విశ్వాసం అని పటిష్ట ప్రణాళికతో విద్యాభోధన, పర్యవేక్షణ, విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయం సాధించడం జరిగిందిని, ఇంటర్ ఫలితాలలో అద్భుత మార్కులు సాధించిన మా ఆల్ఫోర్స్ అణిముత్యాలను వారి తల్లిదండ్రులను మన స్పూర్తిగా అభినందిస్తూన్నానని చైర్మన్ వి నరేందర్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ విజేత చైతన్య యూనివర్సిటీ జట్టు విజయం

- అభినందించిన చైతన్య యూనివర్సిటీ ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి

**మొయినాబాద్, ఏప్రిల్12 జనంసాక్షి:**

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ విద్యార్థులు హైదరాబాద్ లోని లార్డ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా విజేతలైన ఫుట్ బాల్ జట్టును యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ సీ. హెచ్. వీ. పురుషోత్తం రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, జట్టు సహకారం మరియు పోరాట స్ఫూర్తి విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు. క్రీడాలలో ఇలాంటి విజయాలు సాధించడం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తు



లో కూడా ఇదే ఉత్సాహం, కృషితో మరిన్ని విజయాలు సాధించి విశ్వవిద్యాలయానికి మరింత ఖ్యాతిని తీసుకురావాలని, అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీ. హెచ్.సాత్విక రెడ్డి, వైస్ ఛాన్సలర్ జీ. శంకర్ లింగం, రిజిస్టర్ రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పీ.మధుసూదన్ రెడ్డి, బి. కుమారస్వామి, రాము, రాజేష్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదే రాంబాబు రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన
# ప్రభుత్వం జూనియర్ కాలేజీ విద్యార్థులు
### ఫలితాల్లో సత్తా చాటిన అమ్మాయిలు


**తలకొండపల్లి ఏప్రిల్ 12(జనంసాక్షి)::**

ప్రైవేటు కార్పోరేట్ కళాశాలలే కాదు..ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా చదివి ర్యాంకులు సాధించవచ్చు అని నిరూపించారు.ఆదివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల ప్రారంభమైన మొదటి సంవత్సరంలోనే మంచి ఫలితాలు సాధించడం గర్వకారణం అని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మాధవరావు తెలిపారు.ఈ సంవత్సరం కళాశాలలో కేవలం ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు మొత్తం 108 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు వ్రాసి 43 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు.ప్రథమ మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు..ఎంపీసీ లో పి.వినయ్ 398 మార్కులు,బైపిసి లో ఎండి.అంజుమ్ 406 మార్కులు,సిఇసి లో సరిత 461 మార్కులు,ఎంఎల్ టి,లో సుష్మ 447 మార్కులు,ఎంపిహెచ్‌డబ్ల్యు (మహిళ)లో మనీషా 423 మార్కులు సాధించారని చెప్పారు.సీఈసీ లో సరిత మొత్తం 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించారని ఇది చాలా గర్వించదగిన విషయమని,ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు.




**సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈనెల 13 ఉంచి 20 వరకు చెల్లించవచ్చు..**


ఫెల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజులను కళాశాలలో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు చెల్లించవచ్చని ఆయన తెలిపారు.అదేవిధంగా ఫెలైన విద్యార్థులకు ఆన్లైన్ ఆఫ్ లైన్ బోధనల ద్వారా అధ్యాపకులు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తారని విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370